ధర్మదత్తోదయం

ఆధునిక సామాజిక పద్య ప్రబంధం

(ప్రబంధ పోటీలో తృతీయ బహుమతి పొందిన గ్రంథం)

రచన:

డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య

M.A., M.Com., M.phil., Ph.D.,

టేకుమళ్ళ ప్రచురణలు

16-6-81, శ్రీనివాస అగ్రహారం

నెల్లూరు - 524001

చరవాణి: 9490400858, 91105 80418

ఈమెయిల్: tekumalla.venkatappaiah@gmail.com

ధర్మదత్తోదయం

ఆధునిక సామాజిక పద్య ప్రబంధం

రచన: డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య

ముద్రణ : ప్రథమ ముద్రణ
ప్లవ - ఆశ్వీయుజ, అక్టోబరు - 2021

ప్రతులు : 300 కాపీలు
మూల్యం: రూ. 150/-

డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య
3 వ మెయిన్ రోడ్డు
16-6-81 శ్రీనివాస అగ్రహారం
విజయమహల్ దగ్గర
నేతాజి పైలట్ స్కూల్ ప్రక్కన
నెల్లూరు - 524 001, ఆం.ప్ర.

ఈమెయిల్: tekumalla.venkatappaiah@gmail.com
ఫోను: 9490400858, 91105 80418

డి.టి.పి: శ్రీగంగాధర్, హైదరాబాద్ - చరవాణి: 9848133848
ప్రచురణ: డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య, నెల్లూరు.
ముద్రణ: శ్రీఅళహరి రాము, విజయవాడ - చరవాణి: 9440277811



కృతజ్ఞతాంజలి

ఈ నా ప్రబంధ రచనకు మార్గదర్శకుడుగా నిలిచిన విద్వాన్ చక్రాల లక్ష్మీ కాంతరాజారావుగారికి వినమ్రపూర్వక కృతజ్ఞతాంజలి.

ప్రబంధం ఆద్యంతమూ పరిశీలించి గుణదోషములు తెలిపి మార్గదర్శనంచేసి, విశేషవృత్తాలను పరిచయం చేసి, అనేక ఛందస్సులతో వారు వెలయించిన పలు గ్రంధాలను నాకు బహూకరించి, నాకు అండగా నిలిచి, వెన్నుతట్టి, నా ఈ గ్రంధం సకాలంలో పూర్తయేట్టు కృషిచేసిన వారికి శతసహస్ర వందనాలు.



టేకుమళ్ళ వెంకటప్పయ్య

అంకితం

ఈ "ధర్మదత్తోదయం" గ్రంథం శ్రీరామాంకితం చేయడానికి ఒక కారణం ఉంది. మా తండ్రిగారు రామభక్తులు, యోగి. శ్రీరాముని సేవలో తరించినవారు. వారు వ్రాసిన "రామశతకం" గంథం నాకు ఊహ తెలియకముందే కాలగర్భంలో కలిసిపోవడం దురదృష్టకరమైన విషయం. వారు పోస్టు మాస్టరుగా, రామాలయ పూజారిగా, ఒక ఉపాధ్యాయునిగా విధులను ఎంతో సమవర్ధవంతంగా నిర్వర్తించారు. వారి స్మృత్యంజలిగా ఈ నా గ్రంథం రామాంకితం చేస్తున్నాను.

- టేకుమళ్ళ వెంకటప్పయ్య



శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే,

సహస్ర నామతత్తుల్యం రామనామ వరాననే

విషయ సూచిక

నా మాట

అభినవగుప్తుడను లాక్షణికుడు వాఙ్మయమును వేదము, పురాణము, కావ్యము అను మూడు తరగతులుగా విభజించి తత్స్వరూప స్వభావాలను వివరించాడు. వేదము శబ్ద ప్రధానము. ప్రభు సమ్మితము. ప్రభు శాసనములవలె వేద శాసనములను కూడా ఉల్లంఘించుటకు వీలులేదు. పురాణములు అర్థ ప్రధానములు, మిత్ర సమ్మితములు. అవి వేదములయందు చెప్పబడిన విషయములనే కధారూపమున జెప్పబడి మిత్రులవలె కర్తవ్యాకర్తవ్యోపదేశమును గావించును. కావ్యములు ఉక్తి ప్రధానములు ప్రభు, మిత్ర, కాంతా సమ్మితములు. ఇందులో ఉక్తి వైచిత్రి ప్రాధాన్యము ఎక్కువ. ప్రభు, మిత్ర, కాంతా సమ్మితములు మూడు కర్తవ్యోపదేశానికే నిర్దేశించబడినప్పటికీ చెప్పే విధానములో అనేక భేదములున్నవి.

"పలికెడిది భాగవతమట. పలికించెడివాడు రామభద్రుండట. పలికిన భవహరమగునట" అని బమ్మెర పోతన 'భాగవతావతారిక' లో చెప్పుకున్న విధంగానే ఇలియడ్, ఒడిస్సీ వంటి అద్భుత గ్రీకు ఇతిహాసాలను సృష్టించిన 'కవి హోమర్' కూడా తన కావ్యావతారికల్లో 'దేవతాప్రసన్నాన్ని అర్థించడం' గమనించదగ్గ విశేషం. సనాతన హిందూదేశంలోనే కాక, పాశ్చాత్య దేశాలలో కూడా కావ్యం రాయడానికి ప్రేరణ దైవమేనని కవులు నమ్మేవారని స్పష్టమౌతున్నది. జాగ్రత్తగా మనం గమనిస్తే "కావ్య నిర్మాణానికి కవికి దివ్యావేశం అవసరమ"న్న సిద్ధాంతం అన్ని దేశాల్లోను ఉంది.

ఏ కళా ప్రక్రియ సృజించాలన్న ఉన్ముఖీకరణ (Preparation), ధారణ (Incubation), ప్రేరణ (Inspiration), వివరణ (Eloboration or Explanation),అనే నాలుగు దశలు తప్పనిసరి. "ప్రముఖ పాశ్చాత్య విమర్శనా కేసరి వించెస్టరు అన్ని వాక్యాలలో ఆవేశము (Emotion), భావన (Imagination), ఆలోచన (Thought), పదగుంభన(Form),అనే నాలుగు అంశాలు కవిత్వంలో అంతర్భాగమని సూత్రీకరించాడు. ఈ నాలుగు అంశాలు కలిసే కావ్యానంద హేతువులవుతాయని, ఆ కావ్యము కావ్యకర్త యొక్క స్థాయిని బట్టి నిర్ణయించవచ్చని సిద్ధాంతీకరించాడు" .

పై నాలుగు విషయాలను పరిశీలించవలసి వస్తే...

1.ఆవేశమే కవిత్వానికి పునాది. "ఆవేశం స్వచ్ఛందంగా రూపొందిన శబ్దార్థాలు కవిత్వం" అనీ భావావేశాల భావనల శబ్దస్వరూపమే కవిత్వం" అని భావించవచ్చు.

2. "హృదయ స్పందనలవల్ల ఏర్పడే భావాన్ని స్వీయంగా చేసుకొని మరల దానిని సాధరణీకృతం చేయడమే సాహిత్యం" ప్రతి కవికీ ఈ కవితా భావుకత ముఖ్యం.

3. "మంచి రచనకు సజీవమైన ఆలోచనే జీవనాడి. కవితాలోచన ఎప్పుడూ సంభాషణ, అభినయం, పరిస్థితి, వాతావరణాలతో, సజీవమైన సంబఒధ శక్తి కలిగి ఉంటుంది"

4. పదగుంభన విషయానికొస్తే ఛందస్సు, శైలి అనేవి రెండు విషయాలు ప్రధాన పాత్ర వహిస్తాయి. వాస్తవానికి కవిత్వానికి ఛందస్సుకు ఉన్న సంబంధం విడదీయరానిది. కవిత్వానికి సౌందర్యం ఓజస్సు, లయ, ఊపు అనేవి ఛందస్సు ద్వారానే సమకూరుతాయి. అయితే "కవితాత్మకు ఛందస్సు ఓ కవచం. అంతే కానీ కవితావిర్భావానికి కారణం కాదు. ఒక అలంకారప్రాయం మాత్రమే" ప్రముఖ ఆంగ్ల కవి కోలరిడ్జి కూడా కవిత్వానికి ఛందస్సే ముఖ్యం కాదని నొక్కి చెప్పాడు. హోమర్ రాసిన ఇలియడ్, ఒడిస్సీ గ్రంథాలకు ఆంగ్లంలో "బూచర్" రాసిన గద్యానువాదాలు జగత్ ప్రసిద్ధి పొందడం అన్న అంశంతో బేరీజు వేసుకుని మనం ఈ విషయాన్ని గమనించవలసి ఉంటుంది. పద్యాలతో గద్యాన్ని కలిపి కావ్యాన్ని "చంపువు" గా రచించడం, మనకు తెలిసినంత మేరకు ఆదికవి నన్నయ్యతోనే ప్రారంభమయింది. ఆ తర్వాత వచ్చిన సింహగిరి వచనాలు, ఇటీవలి కాలంలో వచ్చిన చిన్నయసూరి నీతిచంద్రిక వంటి గ్రంథాలు వచన రచనల సొగసుకు అద్దం పట్టాయి.

ఆధునిక కాలమున వివిధసంస్కృతులతోను వివిధ భాషలతోను సంబంధ మేర్పడియున్నప్పటికీ, కవితారచన వివిధప్రక్రియలతో సాగుతున్నప్పటికీ, పద్య ప్రాధాన్యము పద్యానిదే! దానివలె స్వతంత్రముగా జిహ్వాగ్రమున నిలిచి మానవుని నైతిక ధార్మిక సాంస్కృతికాద్యనుభూతులను నెమరువేయింపఉగల శక్తి వచనాది

ప్రక్రియలకు లేదని నా అభిప్రాయం. కనుక పద్యమును వదలుట గాని వ్రాయమానుట గాని వాంఛనీయము గాదు. ఈనాటికిని సుమతి వేమన శతకములకు గల ప్రాచుర్యము తిరస్కరింపరానిదికదా! అయితే పద్య మెట్టి పదజాలమును కలిగియుండవలెను? ఎట్టి భావసంపద యుండవలెను? ఎట్టి శైలి కావలెను? అన్న ప్రశ్నలు రచయిత యొక్కయు, అతని రచన నర్థముఁ జేసికొనఁగలిగిన సహృదయుని యొక్కయు, శక్తికిని, అభిరుచికిని మాత్రము సంబంధించినట్టివే కాని యితరులు జోక్యము జేసికొనదగిన విషయము కాదని నా అభిప్రాయము. పద్యమన్న సమాస భూయిష్ఠముగా మాత్రమే వుండవలెననెడు నాటి పెద్దల ఆకాంక్ష వలన ప్రజలు పద్యానికి దూరంగా జరిగి వచన కవిత్వం ఎంచుకున్నారన్న వాదనలో 'పస' లేకపోలేదు. అక్కడక్కడా కొన్ని పద్యములు సమాసభూయిష్టముగా ఉన్నను, పద్య కావ్యం జన సామాన్యానికి అర్థమయ్యే రీతిలో ఉండవలెనని నా అభిప్రాయము. తిరుపతి వేంకట కవులు సరళమైన భాషలో "బావా ఎప్పుడు వచ్చితీవు?" అన్న సామాన్య పదాలతో పద్యాలను రచించడం, జాషువా, తుమ్మల, జంధ్యాల పాపయ్య శాస్త్రి, బలిజేపల్లి లక్ష్మీకాంతం, కాళ్ళకూరి లాంటి వారి సరళ పద్య రచనల వలననే ప్రజలకు పద్యాలపై మళ్ళీ ఆసక్తి పుట్టి పద్యం మళ్ళీ బ్రతికి బట్ట కట్టిందన్న విషయం విస్మరిచరానిది.

ఇక నేను అంకురార్పణ చేసిన సామాజిక ప్రబంధ రచన గురించి నాలుగు మాటలు చెప్పవలసి యున్నది. నాలో గుంటూరులో (02.09.2017 న) ప్రజ-పద్యం వారి "పద్యకవి సమ్మేళనం" లో బీజప్రాయంగా ఉన్న ఈ సామాజిక ప్రబంధరచన కాంక్ష అనంతరం హైదరాబాదులో శ్రీమతి మంథా భానుమతి గారి ఉద్యానవనంలో జరిగిన సభలో అంకురించింది. పెద్దలు సర్వశ్రీ కంది శంకరయ్యగారు, చింతా రామకృష్ణరావు గారు, కట్టుపల్లి ప్రసాద్ గారు, అవధాని ముద్దురాజయ్యగారు మరియూ ప్రజ-పద్యం అడ్మిన్స్ ఉండగా ఈ "సామాజిక ప్రబంధ లక్ష్య లక్షణాలు" నేను ఒక కరపత్ర రూపంలో అందరు కవులకు వివరింపబూనడం కించిత్ సాహసమే అయినప్పటికీ క్రొత్తగా ఈ ప్రబంధ రచన చేయబూనిన వారికి ఉపయుక్తంగా చాల విషయాలను అందులో చెప్పడానికి సాహసించాను. పెద్దలు కూడా సహృదయతతో

ఆ లక్ష్యలక్షణాలను సమాదరించడం నాకు ఆనందదాయకమైన విషయం.

ప్రక్రియలో నూతనత్వం ఉందని భావించిన పెద్దలు ప్రజ-పద్యం అడ్మిన్లు సర్వశ్రీ వీ.ఆర్.గణపతిగారు, అనంత కృష్ణగారు, ఎం.వి.పట్వర్ధన్ గారు ఈ ప్రక్రియను పోటీగా ప్రకటించడం నాకు మహదానందం కలిగించే విషయం. బహుమతి వస్తుందా? రాదా? అనే విషయం ప్రక్కన బెడితే నేను ఈ ప్రబంధ రచనలో చాలా క్రొత్త పుంతలు త్రొక్కాను. జాషువా కవి చెప్పినట్లు "ఒక్కొక పద్దియంబునకు ఒక్కొక నెత్తురుబొట్టు చొప్పున" అన్న విధంగా రాయడం జరిగింది. విశేష వృత్తాలను రాయడానికి పలుపెద్దలను సంప్రదించాను. అప్పకవీయంలోని విశేషవృత్తాలను క్షుణ్ణంగా పరిశీలించాను. అలాగే ఆ వృత్తాలగురించి పోటీలో ఉన్నవారికి చెప్పడం, దాని పీ.డీ.ఎఫ్ ఫైలును పలువురికి పంపడం చేశాను. కొందరు ఫోను ద్వారా, మెయిల్ ద్వారా అడిగిన సందేహాలను నా శక్తి యుక్తుల మేరకు నివృత్తి చేశాను. అందరూ పోటీదారులే అయినా అందరికీ దాపరికం లేకుండా అడిగిన విశేషాలను వివరించాను. కొంతమంది ప్రజ-పద్యం సభల్లో నా "ప్రబంధ్రరచన మార్గదర్శక సూత్రాల" గురించి ప్రస్తావించడం, ప్రశంసిచడం నాకు మహదానందమయింది.

ఈ "ధర్మదత్తోదయం" లో ఉన్న అనేక విషయాలను, విశేషాలను పాఠకుల దృష్టికి తీసుకురావాలన్న సదుద్దేశ్యం తో నా విన్నపాన్ని, నివేదనలను "పీఠిక" గా యిస్తున్నాను. నేను చెప్పకపోతే పాఠకుని గమనింపుకు రాదన్న అభిప్రాయంతో మాత్రం కాదు. ముఖ్యాంశాలు వారి దృష్టిలో పడాలన్న నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే! పాఠకులు సహృదయులై నా ముందుమాటలను, పీఠికను చదివిన పిమ్మట ప్రబంధ పద్యాలను చదవవలసిందిగా ప్రార్థిస్తున్నాను.

నాకు తృతీయ బహుమతినిచ్చి నా సామాజిక ప్రబంధ రచన ప్రయత్నాన్ని దీవించిన ప్రజ-పద్యం బృందం అడ్మిన్‌లకు, న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన డాక్టర్ తిరునగరి రామానుజయ్య గారికి నమస్సులను తెలియజేస్తున్నాను. నా ప్రబంధాన్ని బహుమతి ప్రదానోత్సవ సభలో బహుధా ప్రశంసించి, నేను వ్రాసిన పీఠిక, బోయి భీమన్న పీఠికలను గుర్తుచేసిందని సభలో ప్రకటించి, నాకు మంచి ముందుమాట

వ్రాసి పెడతానని చెప్పి, హఠాత్తుగా అనారోగ్య కారణం రీత్యా అనంతలోకాలకు వెళ్ళిపోయిన వారికి నా ప్రత్యేక శ్రద్ధాంజలి.

మ.మా. ఎవరైనన్ నను బిల్చి నిండుసభలో కాండమో పర్వమో
కవినో తత్కవి పాండితీగరిమనో కావ్యమ్మునో సన్మతిన్
బ్రవచింప దగునంచుదెల్ప దమితో వాణీకృపాలోకనో
ద్భవ శీతాంబువుతాక నా చదువుసంధ్యల్ పట్టి సద్భక్తితో
బ్రవచింపంగలవాడనట్టులనె కావ్యాల్వ్రాసి నేర్పొప్ప మ
త్కవితా భారతి నూపురధ్వనుల ఘల్ఘల్ శబ్దవిన్యాసమున్
స్తవనీయమ్ముగ జేయువాడ బుధసంతానమ్ము నన్నొక్కడన్
కవులారా! వరపండితీవిభవ వాఙ్మధుర్య సత్సాహితీ
ఛవులారన్ నను దీవెనన్ దనువుడీ సత్కళా హస్తద్వయిన్

టేకుమళ్ళ వెంకటప్పయ్య



సామాజిక ప్రబంధము–లక్ష్యలక్షణాలు

పురాణాల్లో ఉన్నటువంటి ప్రసిద్ధ కథను గ్రహించి అష్టాదశ వర్ణనలు, అలంకారాలతో, పాత్ర చిత్రణతో రసభావ ప్రధానంగా రచించడం అనే కావ్య పద్ధతిని "ప్రబంధం" అంటున్నాం. ప్రకృష్టమైన బంధం (కూర్పు) ఉన్నది ప్రబంధం. తెలుగు సాహిత్య చరిత్రలో శ్రీకృష్ణదేవరాయల కాలానికి ప్రబంధయుగం అని పేరు. ఆ కాలంలో వెలువడ్డ కావ్యాలకు ప్రబంధాలని పేరు. ప్రబంధం కూడా కావ్యమే అయినా వస్త్వైక్యం, ఏకనాయకాశ్రయం, రసాధిక్యత, నాటకీయత, అలంకారిక రచన, అష్టాదశ వర్ణనలు, స్వతంత్ర రచన అనే కావ్యకళా ధర్మాలకు ప్రాధాన్యం ఉంటుంది.

ప్రబంధావతరణము హటాత్సంభూతమేమీ కాదు. మహాభారతరచనలో ఈ ఛాయలు పెక్కు చోట్ల మనకు కనిపిస్తాయి. భారతమునందు వ్యక్తావ్యక్తముగాను, ఎఱ్ఱన హరివంశములో అంకురముగా, నాచన సోముని రచనలో మొలకగాను పొడసూపిన ప్రబంధలత శ్రీనాథుని కాలంలో చిగిర్చి మొక్కై మారాకులు తొడిగింది. శ్రీకృష్ణదేవరాయలు కాలంలో మానై ఫలపుష్పసహితంగా నిలిచింది. తొలి తెలుగు ప్రబంధం మనుచరిత్రగా భావిస్తున్నా, ఎఱ్ఱాప్రెగడను "ప్రబంధ పరమేశ్వరుడు" అన్నారంటే "హరివంశం" కూడా ఆ కోవకు చెందినదే! అని నా అభిప్రాయం. అయితే దీని మూలాలు నన్నెచోడుడు రాసిన "కుమార సంభవం"లో కూడాపుష్కలంగా ఉన్నాయన్న వాస్తవం విస్మరించరాదు. కన్నడము నుండి తెలుగుకు దిగుమతి అయిన ప్రక్రియగా కొంతమంది కవి పండితుల పరిశోధనలు చెప్తున్నాయి.

పింగళి లక్ష్మీకాంతం గారి మాటల్లో చెప్పాలంటే "ప్రబంధమునకు ఏక నాయకాశ్రయత్వము, దానితోపాటు వస్త్వైక్యము ప్రధాన ధర్మములు. ప్రబంధము అష్టాదశ వర్ణనాత్మకమై యుండవలెను. అందు శృంగారము ప్రధాన రసము. ఆవశ్యకతను బట్టి తక్కిన రసములు గౌణములు కావచ్చును. ఆలంకారిక శైలి ప్రబంధమునకు జీవము. ప్రబంధము భాషాంతరీకరణము కాకూడదు. స్వతంత్ర రచనయై యుండవలెను. పైన పేర్కొన్న లక్షణములన్నియు సమగ్రముగా పట్టినను, పట్టకున్నను,

స్వతంత్ర రచనలగుట చేతను, ఆలంకారిక శైలీ శోభితములగుట చేతను అవన్నియు ప్రబంధములుగానే పరిగణింపబడినవి".

కాగా సామాజిక ప్రబంధ రచనలకు పునాది పింగళి సూరన "కళాపూర్ణోదయం"తో పడిందని చెప్పవచ్చు. తెలుగులో మొట్టమొదటి కల్పితకథాకావ్యం కళాపూర్ణోదయం. దీనిని ప్రప్రథమ పరమ స్వతంత్రాంధ్ర నవలగా అభివర్ణిస్తారు లాక్షణికులు. పింగళి సూరన కథను చిత్రవిచిత్రంగా అల్లాడు. ఫ్లాష్‌బ్యాక్ పద్ధతిలో కథ చెప్పాడు. అనేక చమత్కార సంఘటనను కల్పించాడు. ఒక నవలలా సాగే ఛందోబద్ధ రచన. ఛందోబద్ధంగా సాగే ఒక నవల.

కాలానుగుణంగా రచనల్లోనూ మార్పు సహజం. పద్యకావ్యమైనా, వచనకవిత్వమైనా సమకాలీన సమాజాన్ని ప్రతిబింబించాల్సిన అవసరం ఉంది. సామాన్యునికి దూరమై కేవలం పండితులకే పరిమితమై రాజాస్థానాలలో తిరుగుతున్న సాహిత్యాన్ని పాల్కురికి సోమనాథుడు ఎంతో కష్టపడి జనబాహుళ్యంలోకి తీసుకుని వచ్చాడు. తదనంతర కవులు మళ్ళీ రాజాస్థానాలలోకి పట్టుకుని వెళ్ళడంతో, వేమన, పోతులూరి వీరబ్రహ్మం వంటివారు వచ్చే వరకూ అది ప్రజల్లోకి రాలేదు. ఇది విచారకర పరిణామం.

ఆధునిక కాలంలో వచన కవిత్వం వచ్చింది. వచన కవిత్వం అంటే కేవలం కవిత్వానికే పరిమితమవ్వాలని కథా కావ్యాలు, నాటకాల వంటి ప్రక్రియలు అవసరం లేదని ప్రముఖ కవి దేవరకొండ బాలగంగాధర తిలక్ అంటే వచన కవితా పితామహుడు కుందుర్తి ఆంజనేయులుగారు దానిని వ్యతిరేకిస్తూ వచన కవిత్వంలో కథా కావ్యాలు వస్తే గానీ అది స్థిరపడదని భావించారు. ఈ వచన కవిత్వ పరిణామలు, ప్రక్రియలు అలా ఉంచితే, ఇటీవలి కాలంలో కూడా కొన్ని పద్య ప్రబంధాలు ప్రాచీన శైలిలో రావడం గమనార్హం. మొదటగా దీనికి అగ్రిగోల్డ్ సంస్థ నడిపిన "నది" మాసపత్రిక వారు నాంది పలికారు. గతంలో నేను సహస్రావధాని గరికపాటి నరసింహారావుగారితో దూరదర్శన్ ముఖ-ముఖిలో మాట్లాడినప్పుడు వారు కూడా ప్రబంధాలు వినూత్న శైలిలో రావాలనే, వస్తాయని ప్రగాఢంగా విశ్వసించారు.

ప్రస్తుత కాలంలో పద్య ప్రబంధాలు ప్రాచీనరీతిలో అయినప్పటికి మన సమకాలీన సమాజాన్ని ప్రతిబింబిస్తూ "సామాజిక ప్రబంధం" అంటూ వస్తేనే అది

గుణరీత్యా ఛందోబద్ధమైనదైనప్పటికీ తప్పనిసరిగా అది ఆధునిక సమాజజీవన విధానాన్ని ప్రతిబింబించేదయి ఉండాలని మన "ప్రజ–పద్యం" లోని అధికశాతం సభ్యులు భావిస్తున్నారు. మనం గత శతాబ్దులలో వచ్చిన కొన్ని ప్రబంధాలను గమనిస్తే అవి ఆయా కాలాలలో ఉన్న ప్రజాజీవనశైలికి, సంఘంలో వున్న వర్ణ వ్యవస్థకి, అలవాట్లకు, కట్టుబాట్లకు అద్దం పట్టాయి. అదే విధంగా మనం ప్రస్తుతం రాయబోయే "సామాజిక ప్రబంధాలు" భవిష్యత్తులో నేటి సామకాలీన సమాజానికి దర్పణాలుగా నిలవాలని భావించే వారిలో నేకొణ్ణి.

"అయ్యో! అసలే తెలుగడుగంటిపోతున్న ఈరోజుల్లో ఈ ప్రబంధాలను, పద్య కావ్యాలను ఎవరు చదువుతారు?" అని ఎక్కువగా ఆలోచించకండి. పద్య ప్రేమికులుగా మన విధి మనం నిర్వర్తిస్తూ, భావి తరాలకు బాటలు వేద్దాం. "ఉందిలే మంచి కాలం ముందుముందునా" అంటూ సాగిపోదాం.

ఇక మన సామాజిక ప్రబంధ శైలి ఎలా ఉండాలంటే ఒక సామాన్యుడి ప్రస్తుత జీవన విధానం చక్కగా అద్దంపట్టేదయుండాలి. మౌలికంగా ఒక సాంఘికనవలను పద్యకావ్యంగా.. ప్రబంధంగా.. మలుస్తున్నామన్న భావన, స్పృహ కవుల్లో ఉండాలి. సరే ప్రబంధం అనగానే అష్టాదశ వర్ణనలు అవి ప్రాచీన కాలంలో అయితే ... పుర వర్ణన, గిరి వర్ణన, వన వర్ణన, నది వర్ణన, సముద్ర వర్ణన, ద్యూత వర్ణన, వివాహ వర్ణన, విరహ వర్ణన, యుద్ధ వర్ణన, షడృతువుల వర్ణన, ప్రాత: సంధ్యాకాల వర్ణన, సూర్యోదయ సూర్యాస్తమాన వర్ణన, మధుపాన వర్ణన, రాయబార వర్ణన, స్త్రీ వర్ణన, బ్రాహ్మణాది చాతుర్వర్ణముల వర్ణన, చతురంగ సైన్య వర్ణన, వేదాంత విచారణ అని ఉ ండేవి. ప్రస్తుత కాలంలో వర్ణనలు సమాజానికి అతికినట్టుగా ఉండాలి. ఉదాహరణకు నగర వర్ణన చేయవచ్చు. ఆకాశ హర్మ్యాలను వర్ణిస్తూనే కాంక్రీటు జంగిల్స్ బతుకులలో ఉన్న విధానాన్ని చెప్పవచ్చు. అలాగే సరదాగా చెప్పుకోవాలంటే సూర్యోదయం అయినా అలికిడి లేక ఝాము పొద్దెక్కిన దాకా నిద్రించే ఈతరం ప్రజలను అభివర్ణించవచ్చు. ద్యూతము అంటే ప్రస్తుతం ఉన్న పేకాట క్లబ్బులు తద్వారా చితికి పోతున్న జీవితాలు, బెట్టింగులు మొదలైనవి రాయవచ్చు. ప్రాచీన కాలంలో ఉన్న ఆచారాలను ప్రస్తుత కాలంలో ఉన్న ఆచారాలతో సరిపోల్చవచ్చు. నేటి నవనాగరిక సమాజంలో నిద్ర లేచినది మొదలు నిద్రించే వరకూ గల అన్ని సమస్యలు వర్ణించవచ్చు. విద్య, ఆరోగ్యం,

మంచినీరు, కొందరు రాజకీయ నాయకుల దుష్టప్రవృత్తులు, మారుతున్న ప్రజల రుచులు, అభిరుచులు, హద్దుమీరిన సాంకేతికతతో కొని తెచ్చుకుంటున్న విపత్తులు, రోగాలు, ప్రమాదాలు, కార్మిక కర్షక శ్రమదోపిడీ తంతు అన్నీ రాయొచ్చు. కాదేదీ ప్రబంధానర్హం! అంటాన్నేను.

షష్ట్యంతాలు ఉండితీరాలన్న ఛాదస్తం వద్దు గానీ, "అవతారిక" లో కవిగురించి, గురువులు, తల్లిదండ్రుల గురించి అతిశయోక్తులు లేకుండా రాసుకోవచ్చు. ఇష్టదైవ ప్రార్థనలు ఉండవచ్చు. ప్రాచీనమైన, నవీన సుకవులను పొగడవచ్చు. కుకవి నింద అవసరమైన మేరకు చూపించండి. మనం ఎన్నివర్ణలను చేసినా అతికినట్టుగా కాకుండా కథలో అంతర్లీనంగా, పూలమాలలో ఉన్న వివిధ రంగుల పూలలాగా ఉన్నా దారాన్ని విడిచిపెట్టకూడదు. దారాన్ని విడిస్తే అవి పూలే (వర్ణనలే!) మాలలో భాగం కాదు (ప్రబంధం లో భాగం కాదు).

ఇలాంటి సాహసం కత్తిమీద సామే! సందేహం లేదు. కానీ ఏపనికైనా ఎవరో ఒకరు నాంది పలకాలి కదా! ఆశ్వాసాంతంలో దైవ ప్రార్థన పద్య, గద్యాలతో బాటూ ఆశ్వాసాంత వచనంలో కవికి ఉన్న బిరుదులు, తల్లిదండ్రుల పేర్లు రాసుకోవచ్చు. మనకు పద్య రూపంలో భావాన్ని పూర్తిగా వ్యక్తపరచలేమేమో అన్న సందిగ్ధ తావుల్లో.. గద్యంతో లాగించే అవకాశం ఈ చంపూ కావ్యాలలో ఎలాగూ ఉండనే ఉంది. చాలా క్లుప్తంగా 4 లేక 5 ఆశ్వాసాలతో ఆశ్వాసానికి 45-50 పద్యాలతో ముగించవచ్చు. మనం రోజూ రొటీన్ గా రోకటిపాటల్లా రాసే జాతులు, ఉపజాతులు, వృత్తాలు కాకుండా కనీసం 10-15 కొత్త వృత్తాలను పరిచయం చెయ్యవచ్చు. ఆ వృత్తాల ఛందో వివరాలను అనుబంధ రూపంలోగాని, పద్యం క్రిందనే కానీ ఇస్తే కొత్తగా ప్రయత్నించే వారికి ఉపయుక్తం. ఇంకా ప్రజ్ఞ చూపదలుచుకుంటే స్వల్పంగా బంధ, గర్భ కవిత్వ పద్యాలను, నాలుగైదు లైన్ల దండకాలను పెట్టచ్చు. రోజుకు కనీసం రెండు పద్యాల చొప్పున రాసినా 6 నెలలలో ప్రబంధం పూర్తి కావడం ఖాయం.! పద్యకవులారా! ప్రారంభించండి. నడుంకట్టండి. క్రొత్త క్రొంగొత్త పద్యకావ్యాలకు, ఆధునిక ప్రబంధాలకు శ్రీకారం చుట్టండి. శుభం భుయాత్!

టేకుమళ్ళ వెంకటప్పయ్య

అభినందన



ఆచార్య బేతవోలు రామబ్రహ్మం

చరవాణి: 98481 69769

మాన్యశ్రీ టేకుమళ్ళ వెంకటప్పయ్యగారు ఒక అద్భుతమైన కథను పద్యాలలో చెప్పారు. అందునా అపూర్వ కల్పనా మహితమైన కథ. ఆధునిక సామాజిక కథ. అవసరమైన వర్ణలనన్నింటిని రెండేసి మూడేసి పద్యాలకు మించకుండా నాతివిస్తారమన్నట్టు, కథలో పోహళించారు. కథారంభంలో పల్లెటూరి వర్ణన. అదొక సూర్యోదయ సమయం. "మందలు మందలై చనెడు మాలిమి గోవులు గేదెలున్ గనన్" - అంటూ ఉత్పలమాల పరుగులు తీసింది. మాలిమి అన్నారేమిటి? యతి కోసమా? అని ఒక్క క్షణం ఆలోచించాను. పెంపుడు జంతువులు అనే విశేషార్థం స్ఫురింపజేయడంకోసం ఈ పదం వేశారు అని స్ఫురించింది. అహో! అని మురిసిపోయాను.

వీరి పద్యాలన్నీ ధారాశుద్ధితో పరుగులు తీశాయి. ఛందస్సు ఏదైనా వీరికి కూసువిద్యయే! వీరి పద్య నిర్మాణశిల్పంలో నేను గమనించిన మరో గుణం ఏమిటంటే - సంస్కృత వృత్త నియమాన్ని అనుసరించడం. యాతిర్విచ్ఛేద సంజ్ఞక: అంటుంది సంస్కృత ఛందస్సు. దీన్ని వీరు ఉత్పలమాలికాదులన్నిటా శతశాతం పాటించారు. దీనివల్ల పద్యానికి ధారాశుద్ధితో పాటు భావానికి ప్రసన్నత ఇనుమడించింది.

నిద్ర లేవగానే పాతకాలం ఇల్లాలు తాళిబొట్టును కన్నులకు అద్దుకోవడం కద్దు. దీన్ని వీరు కావ్య బద్ధం చేశారు. "తాళికి వందనమాచరించి తమవంతు పనుల్ పొనరింప వేడుకన్ సుందర భామినీ మణులు సొంపుగ" పూనుకొన్నారని వీరి వర్ణన. ఇలాలు గర్భవతి కాగానే "సుందర దేవతా మృదుల శోభిత విగ్రహముల్ లసత్కళాబంధుర కాంచన స్థగిత భద్ర మనోహర రూపరేఖ దృగ్వందిత విగ్రహావళులు" కొనితెచ్చి ఆమె భర్త పడకనిండా అలంకరిచాడట. వెంకటప్పయ్య గారి పరిశీలనా దృష్టికి ఇవి నిదర్శనాలు.

కావ్య కథ ఆధునికము, సామాజికము కనుక నీటి పంపులు, రోడ్డులు, హాస్పిటలు, నర్సులు, కార్పొరేట్ వగైరా పదాలు హాయిగా వచ్చి కూర్చున్నాయి. ధృత ద్విత సంధులు – రోజులొచ్చునిక, దర్శనానికిన్ లాంటి వాడుక రూపాలు వీరి స్వేచ్ఛాప్రీతికి నిదర్శనాలు.

ఈ కావ్య సారాంశంగా మనకు అందించే ఉపదేశం ఏమిటయ్యా అంటే – కోటికి పడగెత్తిన వాడుగాని, కూలి లేక మరణించిన వాడుగానీ మట్టిలో కలిసిపోవడం తథ్యం. వాళ్ళ ఊసు కాలగర్భంలో కలిసిపోతుంది. లోకం వాళ్ళని మరుసటినాడే మరచిపోతుంది. కానీ...

"మంది మేలును గాంచెడి మనిషి ధరణి
దైవ సమునిగ తలుచుట తథ్యమనఘ!
తలుచు ప్రజలెల్ల వానిని తరములెన్నొ
ధర్మదత్తుడు దానికి తారకాణ"

– కావ్య నామధేయానికి సార్థక్యం చేస్తున్న ముగింపు ఇది. ఇంత బందోబస్తుగా "ధర్మదత్తోదయం" కావ్యాన్ని సంతరించినందుకు శ్రీమాన్ టేకుమళ్ళ వెంకటప్పయ్యగారిని బహుధా అభినందిస్తూ పాఠకులకు స్వాగతం పలుకుతున్నాను. సెలవు.

విశాఖపట్నం
20-09-2021

భవదీయుడు
చేతవోలు రామబ్రహ్మం.

"కదంబ ప్రబంధం"

అవధాన భారతి, సాహితీచతురానన,
ఛందోవైవిధ్య నిష్ణాత, స్వర్ణకంకణ,
కవి గండపెండేరపు సత్కారగ్రహీత



విద్వాన్ చక్రాల లక్ష్మీకాంత రాజారావు ఎం.ఏ.,
సంస్కృతోపన్యాసకులు, హైదరాబాదు
(చరవాణి : 9291333880)

"కదంబ ప్రబంధం"

సరస పదాలతో సరళీకృతముగా కవితలల్లు నేటి కవులలో మొదటగా లెక్కింపదగినవారు డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య గారు.

"లేడికి లేచిందే పరుగు"గా – వీరికి కావ్యవస్తువు దొరికితే చాలు, అది వీరి ఆలోచనాస్రవంతిల్ పలువిధాల నీటిపాయలతో కూడిన ప్రవాహమై, భావ పర్వత శిఖరాలనుండి తిన్నగా జారుతూ కాగితమనే భూతలమున అక్షరాలనే పసిడి నేలలపై పారుతూ ఉవ్వెత్తుగా లేచు ధ్వన్యాలంకార వర్ణనాధిశోభిత కథాగమనముతో రసవత్తర కావ్యంగా మారి పాఠకుల హృదయమనే జలనిధినిచేరి తాను తనిసి, పాఠకులను మురిపింపజేస్తుంది. అట్టి అసాధారణ ప్రతిభా వ్యుత్పతులు గల వారు వీరు.

గేయ కవితలు, పద్య కవితలు, వచన కవితలు ఇలా అన్నింటా కవితలల్లగల పండితులు వీరు. వీరిది పండిత వంశము. మహాకవి శ్రీ టేకుమళ్ళ రంగశాయిగారి వంశమున జన్మించిరి. వారివలె కృషి, పట్టుదల, రచనా వ్యాసంగము, వక్తృత్వ భాషణము మొదలగు సాధు లక్షణములు వీరికి అలవడినవి. అందునే వీరే ప్రక్రియలోనైనా కవితలు వ్రాయగలరు.

"ప్రబంధ కావ్య రచన..అందునా నేటి సామాజిక విషయమై కథావస్తువు ఉండవలెనను నిబంధన" అను విషయమై కథలపోటీవలె కావ్యముల పోటీ అని "ప్రజ–పద్యం" అనే సాహితీ సంస్థ ప్రకటించింది. అంతే..వీరి ఆలోచనలో ఒక మెరుపు మెరిసింది. కథా వస్తువు తోచింది. లేఖిని సాగింది. ధర్మదత్తోదయం ఆవిర్భవించింది.

ఇది అయిదు ఆశ్వాసాల ప్రబంధం. ప్రబంధ లక్షణములు సమగ్రముగా నున్న కావ్యం. నన్నయ్య నుండి నేటి వరకున్న కావ్యములలో లేని క్రొత్త ఛందస్సులను వీరు స్వీకరించి, సందర్భోచితముగా రచించి, వీరి పాండితీ ప్రతిభను స్పష్టపరచినారు.

ఇది చదువుదగిన ప్రబంధం. ఒక నేత తనకు చెందిన గ్రామమును నియోజక వర్గమును ఎలా అభివృద్ధిచేయవలెనో, వారి సేవానిరతి ఎలా ఉండవలెనో తెలియజెప్పు కావ్యమిది. చదవండి. కవిని ప్రోత్సహించండి.

చం. సరస రసార్ద్ర శబ్దజలజాత మరందముగ్రోలి భావభూ
ధర శిఖరాగ్ర సీమల ముదాత్మ విహారము సల్పి, పూర్వకా
వ్యరస సుదాబ్ధి వీచికల ప్రస్తుత దివ్య కవీశ భావ భం
ధుర నవమార్గ దృశ్య కవనోధృత రాగ గుణైక రమ్యకా
వ్యరస సరిత్తటమ్ముల వనాంతర పుష్పవికాస దేశ సం
చరణ మొనర్చి తృప్తిగ రసైక హృదిన్ తగు పాండితీ ప్రభా
కిరణ రుచిన్మతింగొని ప్రకీర్ణ మనోహర భావనాకృతిన్
బొరిగొని కావ్యమల్లగల బుద్ధి పటుత్వము నంది గేయముల్
సరస పదాళిసంయుత రసైక కవిత్వ కథా నిధాన సం
భరిత రసజ్ఞ పద్యముల వ్రాయుచు – వ్రాయుచు నేడు నీగతి
వరుస ప్రబంధ కావ్యమును వ్రాయగజాలు సుధీవిశేషముల్
దొరకొని టేకుమళ్ళ బుధలోక విభాసుర భాస్కరుండు భూ
సురమణి వేంకటప్పయ ప్రచోక్ష కవిత్వ విశారదుండు తా
నిరవగు రీతి భవ్యమగు నీ ధరణీస్థలి నాయకుల్ ప్రజా
దరణ మెసంగు కార్యములు ధర్మ యుతమ్ముగ జేయునట్లు స
చ్చరితములున్న నాయకుని ధర్ముని గాథను సృష్టిజేసి ఈ

సరస మనోజ్ఞ కావ్యమును చక్కగ వ్రాసి తెలుంగు వారికిన్
వరమతినిచ్చె దీనిగొని ప్రాభవమొప్ప పఠించి తత్కవిన్
వరుసగ లేఖలందు చరవాణి విధానములందు పల్కరిం
పరె! ముదమూని పాఠకులు - ప్రస్తుతులన్నిడి ప్రోత్సహింపరే!

హైదరాబాదు, బుధజన విధేయుడు
20-09-2021. **చక్రాల లక్ష్మీకాంత రాజారావు**

ధర్మదత్తోదయ కావ్యవైచిత్రి

1.0. ఇది ఒక సామాజిక ప్రబంధం. ప్రజ–పద్యం వారి బహుమతికోసం వ్రాయబడి 32 ప్రబంధాలలో తృతీయ బహుమతి సాధించిన లఘుప్రబంధం. ఈ ప్రబంధం పంచాశ్వాస సమన్వితం. ఈ కావ్యంలో 367 గద్యపద్యాలున్నాయి. ఈ కావ్యంలోని విశేషాలనెన్నిటినో గ్రంధ కర్త వేంకటప్పయ్య తన విపుల పీఠికలోనే ఉటంకించారు. ప్రాచీన కావ్యాలవలె ఈ కావ్యాన్ని శ్రీకారంతో ఏకాక్షర సంభరితమైన శ్రీవృత్తంతో ప్రారంభించడం ఒక విశేషం. ద్వ్యక్షర వృత్తమైన స్త్రీ వృత్తంతో రెండవ పద్యం అలరారుతోంది. కవి ఏమీ వ్రాయలేని నాచే ఈ కావ్యం నిర్మింపజేయుమని స్వామివారి పాద పద్మాల్ని అంటి విన్నవించాడు.

1.1. పూర్వ కవులలాగానే కావ్యాదిని దేవతా స్తుతిలో శివ స్తుతి, గౌరీ స్తుతి, లక్ష్మీ స్తుతి, వాణీ స్తుతి చేశారు. బ్రహ్మ స్తుతి కూడా చేసి ఉంటే త్రిమూర్తులను వారి భార్యలను స్తుతి చేసినట్లుండేది. దేవతాస్తుత్యనంతరం కవిస్తుతి గావిస్తూ నన్నయ, తిక్కన, ఎర్రనలే కాకుండా మొల్లను తరిగొండ వేంగమాంబను స్తుతించడం ఎంతో ముదావహం. పిమ్మట తల్లి, తండ్రి అన్నలను గురువులుగా భావించి స్మరించారు. చిన్ననాటినుండి ఎందరో గురువులున్నా వారందరిని గుర్తుపెట్టుకోలేక పోయానని అందరికి వందనమాచరించారు. దోషాల్ని మాత్రమే గుర్తించి, గుణాలను తలవని వారిని, తప్పులెన్నే తండోపతండాన్నికి వందనాలర్పించారు.

1.2. ఈ ప్రబంధాన్ని శ్రీరామునికి అంకితం చేసినట్టుగా సంభావించాలి ఎందుకంటే షష్ఠ్యంత పద్యాల్ని శ్రీరామునిపై సమకూర్చారు. షష్ఠ్యంతాలు కాబట్టి ఆరు షష్ఠ్యంతాల పద్యాల్నే సమకూర్చడం కానరాని చమత్కృతిగా పరిగణింపవచ్చు. ఆశ్వాసాది పద్యాల్లో శివును, మాధవుడిని, పాండురంగని కీర్తించడం విశేషం.

1.3 సర్వసామాన్యంగా మన తెలుగు ప్రబంధాలు నైమిశారణ్యంలో అక్కడ ఉండే సూతుడు శౌనకాది మునులకు చెప్పినట్టుగా కథా ప్రారంభం కావిస్తారు. ఈ కవి కూడా ఆధునికమైన, సామాజికమైన ఈ ప్రబంధాన్ని కూడా ప్రాచీన ధోరణిలోనే ప్రారంభించారు. ధర్మరాజు వనవాసం చేస్తున్నప్పుడు మార్కండేయ మహర్షి ఏతెంచాడు. అప్పుడు ధర్మరాజు కలియుగంలో ధర్మ మార్గాన నడిచే మానవుడు ఒక్కడైనా

ఉంటాడా? అని ప్రశ్నిస్తాడు. దానికి సమాధానంగా ఈ "ధర్మదత్తోదంతాన్ని మార్కండేయుడు ధర్మరాజుకు వివరించి చెప్పినట్లుగా ఈ కవి పేర్కొనడంలో ఒక పొరపాటు ఉంది. ధర్మరాజు జీవించింది ద్వాపర యుగంలో. మార్కండేయుని అడిగింది కలియుగంలోని వ్యక్తి గురించి. దీన్ని ఆంగ్లంలో "ఎనాక్రానిజం" అని అంటారు. ధర్మానికి రాజుగా పరిగణింపబడ్డవాడు కుంతీపుత్రుడు ధర్మరాజు. ఈకావ్య నాయకుడైన ధర్మదత్తుని తండ్రిపేరు ధర్మాన్ని పాలించే ధర్మపాలుడని పేర్కొన్నారు. ధర్మాన్ని ఇచ్చేవాడు ప్రబంధ నాయకుడైన ధర్మదత్తుడు. ఈ కావ్యంలో ధర్మదత్తుడు ఎన్నో ధర్మ కార్యాలను చేయడంవలన ధర్మానికి ఉదయమైనట్లుగా కథానాయకుని పేరుతో ధర్మానికి ఉదయమైనట్లుగా కథానాయకుని పేరుతో "ధర్మదత్తోదయం" అని కావ్యానికి నామకరణం చేయడం ఎంతో సముచితంగాను, సమంజసంగాను ఉందని చెప్పవచ్చు. ఈ కావ్య నాయకుడైన ధర్మదత్తుడు సామాన్యుడు కాడు. ఈశ్వర వరప్రసాద జనితుడు.

1.4.వర్ణనలు: ధర్మదత్తోదయం అనేది ప్రబంధం కాబట్టి వర్ణనావితమై విరాజిల్లుతోంది.

– కావ్యాదిని వేంగీ పుర వర్ణన కావిస్తూ సూర్యోదయ వర్ణన చేశారు. అంతేగాక వేంగీపురంలోని చాతుర్వర్ణ వర్ణన గావించారు. బ్రాహ్మణులని, వైశ్య, రాజుల్నీ క్రమం తప్పినా రమ్యంగా వర్ణించారు. నాల్గవ వర్ణమైన శూద్రులని ఆ పేరుతో చెప్పకుండా కులవృత్తులను విడువకుండా చేసేవారని పేర్కొనడం రమ్యంగా ఉంది. శూద్ర శబ్దాన్ని వాడలేదు.

– ఈ ప్రబంధంలో రెండు తరాలవారికి పెళ్ళిళ్ళు జరిగాయి. ధర్మదత్తుని తండ్రి అయిన ధర్మపాలునికి అన్నపూర్ణతో వివాహం జరిగడాన్ని వివరించాడు. కావ్య నాయకుడైన ధర్మదత్తునికి అంకితతో పరిణయమవడాన్ని కూడా వర్ణిచాడు. ధర్మపాలుడు అన్నపూర్ణ బందరు వెళ్ళినపుడు, అక్కడ సముద్రాన్ని వర్ణన గావించడం రమ్యంగా ఉంది. వర్ణనలు కథతో మేళవించి ఉన్నాయేగానీ తెచ్చిపెట్టుకొన్నవి కావు.

– గ్రామంలోని ప్రజలు మధుపానాన్ని చేయడాన్ని వివరించాడు. సామాజికదృష్టితో మధుపాన నిషేధానికి ఆ గ్రామ స్త్రీలు ప్రయత్నించినట్లు పేర్కొనడం సముచితంగా భాసిల్లుతోంది.

– ధర్మపాలుని భార్య అన్నపూర్ణ గర్భవతి అయినపుడు ఆ విషయాన్ని వర్ణించాడు. అనంతరం ధర్మపాలుని కుమారుడు ధర్మదత్తుని భార్య అంకిత గర్భాన్ని ధరించడం వర్ణించాడు.

– మండుటెండతో విలసిల్లుతున్న వేసవి కాలం వర్ణన మనోహరంగా ఉంది. ఎండతీవ్రత సంస్కృత సమాస భూయిష్టంగా వర్ణించడం సందర్భ శుద్ధితో అలరారుతోంది.

– ధర్మపాలునికి ధర్మదత్తుడుదయించటాన్ని చెప్పడం వల్ల నాయికాభ్యుదయం వర్ణించినట్లయింది.

1.5 రసం: ధర్మదత్తునికి శంకరుడు స్వప్నంలో కనబడి ఆదేశించగా అతడు వేంగీపురానికి వెళ్ళి, ఆ గ్రామాన్ని దత్తత తీసుకున్నట్లుగా వర్ణించాడు. ఆధునిక కాలంలో ఇతర దేశాల్లో నివశిస్తున్న స్వదేశీయులు తమ తమ గ్రామాల్ని దత్తత తీసుకుని గ్రామాభ్యుదయం చేయటం ఉంది గదా! ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని వేంగీ గ్రామాన్ని దర్శించి ధర్మదత్తుడు ఆ గ్రామంలో వైద్యశాల, పాఠశాల, నీటి పంపులు వేయించడం, ప్రభుత్వ సహాయ సహకారాలతో రోడ్ల నిర్మాణం లాంటి సదుపాయాలు చేస్తాడు. దేవాలయ గాలి గోపురం, గోడలు కూలిపోగా వాటిని పునరుద్ధరించడం మనోజ్ఞంగా ఉంది. ధర్మ కార్యాలనెన్నింటినో గావించిన ధర్మదత్తుని దయార్ద్రహృదయాన్ని గమనించిన ముఖ్యమంత్రి, గవర్నర్‌లు రాష్ట్రపతికి ఒక లేఖ వ్రాస్తాడు. ఈ విషయం తెలిసిన రాష్ట్రపతి బహుమాన పురస్సరంగా అవార్డు ప్రదానం చేసే లోపు ధర్మదత్తుడు ప్రాయోపవేశం చేసి కపాలమోక్షం పొందుతాడు. మహానుభావులకు మాత్రమే ఈ కపాలమోక్షం దక్కుతుంది. ఈ సన్నివేశం కరుణరసప్లావితం.

1.6 ఛందోవైశిష్ట్యం: ఈ కావ్యంలో ఎన్నో ఛందో విశేషాలున్నాయి. శ్రీ, స్త్రీ వృత్తాలు, భుజంగ ప్రయాతాలు, శంఖబంధ చిత్రంతో ఉంది. చంద్రవర్మ, మౌక్తికమాలా వృత్తం, అనుష్టుప్ శ్లోకాలు, సుగంధి, వంశస్థ, అశ్వగతి వృత్తాలు మొదలైనవి ఉన్నాయి. కవి శ్రీకారంతో ప్రారంభించి, మంగళమహాశ్రీ వృత్తంతో ముగించడం విశేషం. ఒక తగణ దండకం కూడా ఉంది.

ప్రాచీన కవులైన నన్నయాదులు ఆశ్వాసాంత పద్య రచనకు ఒక ఒరవడిని పెట్టారు. ఎలాగంటే ఒక కందం, ఒక విశేష వృత్తం, ఒక వృత్త పద్యంతో మూడు ఆశ్వాసాంత పద్యాల్ని రచించేవారు. ఈ కావ్యం ప్రథమాశ్వాసంతంలో భుజంగ ప్రయాతమనే విశేష వృత్తం ఒకటే ఉంది. ద్వితీయ ఆశ్వాసాంతంలో రెండు కంద పద్యాలే ఉన్నాయి. తృతీయ ఆశ్వాసాంతంలో ఒక సీసమే ఉంది. చతుర్థాశ్వాసాంతంలో

భుజంగ ప్రయాతము, తోటకమనే రెండు విశేష వృత్తాలున్నాయి. పంచమాశ్వాసంలో రెండు అనుష్టుప్ శ్లోకాలు కవి గురించి ఉన్నాయి. పిమ్మట మంగళమహాశ్రీతో ముగిసింది. ఈ కావ్యంలో ఐదు పాదాల ఉత్పల మా లికలు రెండున్నాయి.

1.7. శైలీవిన్యాసం: అనవసర పద ప్రయోగాలు లేకుండా శైలి ధారాశుద్ధితో విరాజిల్లుతూ ముగ్ధ మనోహరంగా ఉంది. ధర్మపాలుని రూపాతిశయ వర్ణనతో అల్లసాని పెద్దన ప్రవరాఖ్యుడు జ్ఞప్తికి వస్తాడు.

ఉ. కాముని రూపసంపదను గైకొనియట్లె జయంతు నందమున్
సోముని సత్కళారుచిని చుక్కల కాంతిని తోడుజేసి య
య్యామిని నేలు వాని సొబగంతయు ముద్దగజేసి ధాత యీ
భూమికి “ధర్మపాల” వరమూర్తిగ సృష్టిని జేసె నేర్పునన్ (1-45)

చక్కని చిక్కని ఆటవెలది – పద్యరచనలో అందె వేసిన చేయి అనడంలో అతిశయోక్తిలేదు.

ఆ.వె. విప్రవర్యుల నుండి వేదమ్ము నేర్చెను
మల్లుర దరి నేర్చె మల్లవిద్య
రామకథలు జదివి రాగాత్ముడయ్యెను
భారతమ్ము జదివి వీరుడయ్యె (2-54)

సుమతీ శతకంలోని “అక్కరకు రాని చుట్టము” అనే పద్య భావాన్ని గ్రహించి ఈ కవి ఒక కందాన్ని అందంగా రచించాడు.

కం. ఋణదాత, వైద్య వరుడును
అనువుగ ప్రవహించు నదియు, నవనీసురుడున్
మనియెడు చోట వసించుట
మనుజుని గతజన్మ పుణ్య మహిమయె గాదే! (3-20)

అనువుగ ప్రవహించే నది అని చెప్పటం మనోజ్ఞంగా ఉంది. అనువుగా అంటే జీవనదిలాగా అని అర్థం. ఉధృతంగా ప్రవహిస్తూ వరదలు వచ్చేనది కాదని అర్థం చేసుకోవాలి.

అలతి అలతి పదాలతో, అలతి అలతి వాక్యాలతో ఉన్న ఉత్పమాల పద్యాన్ని మనోహరంగా కూర్చాడు.

ఉ. నేర్పెను దానధర్మముల, నేర్పెను వారికి దొడ్డ బుద్ధులున్
నేర్పెను గౌరవించుటను, నేర్పెను సంఘపు తీరుతెన్నులున్
నేర్పెను తారతమ్యములు, నేర్పెను నాణ్యత కార్యమందునన్
నేర్పెను కర్త్వడే తనకు నేర్పిన వన్నియు పొల్లుబోవకన్ (4-26)

ప్రాచీన కవులవలె పద్యాన్ని సమాపక క్రియతో ఆరంభించడం కూడా ఈ కావ్యంలో ఉంది. "ఉ.కాంచెను ధర్మదత్తుడది కష్టము దోచెను పల్లెబాధలున్" (5-52) అనే పద్యం రమణీయంగా ఉంది. ఈ పద్యాన్ని పఠిస్తుంటే ప్రాచీన కవుల పద్యాలు గుర్తుకు రావడంలో ఆశ్చర్యమేముంది?

1.8.ఆలంకారిక రచన: ఈ కావ్యంలో అంత్యానుప్రాస, వృత్త్యానుప్రాస, ఛేకానుప్రాస, యమకాది శబ్దాలంకారాలు వినసొంపుగా ఉన్నాయి. ఉపమాలంకారం, రూపక, దృష్టాంత, అతిశయోక్తి, అర్థంతరన్యాసాది అలంకారాలు రమ్యంగా ఉండి కావ్యానికి శోభను గూర్చాయి.

1.9.జాతీయాలు/సామెతలిద్యాదులు: భాషా సౌందర్యాన్ని ఇనుమడింపజేసేవి జాతీయాలు. తలలోని నాలుక (1-32), ఎద్దుమువ్వ మ్రోగ (1-39), ఎగ్గుసిగ్గులేక (1-48), నీళ్ళనుజల్లిరి ఆశపై (1-49), చాకలి పద్దుకే చదువు ముగిసిపోయి (1-41), తోకలు లేని కోతులు (2-7), పనిమంతురాలు (2-34), కాసునందె జగతి ఊసులాడు (2-34), బిడ్డలు లేని గొడ్రాలు (3-44), చిల్లిగవ్వయు లేదాయె చేతిలోన (3-11), వేదము నమ్మువారలకు వేదనలుండెనె ఇజ్జగంబునన్ (3-43), తల్లిమనసుకు చిక్కని తనయుడెవడు? (3-56), కంటికి రెప్పగ జూచుచుండె (4-7), గందరగోళముల్ (4-32), గాడినితప్పెను (4-32), గొల్లు గొల్లున ఏడ్చెను (4-20), పొల్లుబోవక (4-26), దిమ్మెరపోయిరి (5-50), ఏండ్లు పూండ్లు (5-51), మున్నగునవి కావ్య శోభను పెంచాయి. చెల్లెను రోజులింక (4-49), చేతులు గాలెను (4-49), పొర్లిదొర్లేడ్చెను (4-54), వంకలు జెప్పగా వలదు (5-6), గీచిన రాతలు తప్పవెన్నడున్ (5-17), పీల్చిరి యూపిరి సంతసమ్మునన్ (5-25), కపాలమోక్షము పొందటం (5-71).

1.10.వ్యాకరణ విశేషాలు: కావ్యం గ్రాంధికభాషలో నేర్పరచితమైనా, కొన్ని వ్యాకరణ విశేషాలు దర్శనమిస్తున్నాయి. అవి 1. నన్నెచోడునిలాగా యువర్ణ ధాతువునకు తకారం

రావటం విశేషం. (భజనసేతు – సేయు 1–6), 2. ఉదంత నామాలకు షష్టీ కువర్ణం పరమైనపుడు నగాగం వచ్చిన రూపాలు కూడా ఉండడం విశేషం. అలా రాని రూపాలు కూడా ఉండటం విశేషం. (శ్రీరామునకున్ 1–18): (మహిమాన్వితునకున్ 1–15): ధర్మపాలుకున్ (1–50), ఇలాంటి ప్రయోగాలు నన్నయ, నన్నెచోడుని పద్యాల్లో ఉన్నాయి. 3. ఇకారాంత నామాలకు పాల్కురికి సోమనాధునివలె సంధి జరిగిన రూపాలు ఈ కావ్యంలో దర్శనమిస్తున్నాయి (వాకిలి –అందె – వాకిలందె 2–30) దిష్టి–అని – దిష్టని 2–47). 4. క్వార్థకానికి సంధి వచ్చిన రూపం ఉంది చిక్కె –ఇటు – చిక్కిటు 3–65) 5. తృతీయా విభక్తి ప్రత్యయాలుగా తోడుత (4–3): తోడుతన్ (1–44) ఈ కావ్యంలో కనబడుతున్నాయి.

ఈ సామాజిక ప్రబంధం గ్రాంధిక భాషలో రచితమైనా కొండొకచో వ్యవహారిక భాషారూపాలు మనకు దర్శనమిస్తున్నాయి. సంభవిస్తుంది (4–31) జరిపిస్తాడు (4–31).

1.11. ఆంగ్ల పదాలు: ప్రాచీనతెలుగు కావ్యాల్లో సంస్కృత ప్రాకృత పదజాలం విరివిగా ఉంది. నేటి తెలుగు భాషలో కొన్ని చోట్ల ఆంగ్లపదజాలాన్ని ప్రయోగించవలసిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ కావ్యంలోను క్వాచిత్కంగా ఆంగ్ల పదాలు కనబడుతున్నాయి. ఆంగ్ల పదాలు కూడా తత్సమ, తద్భవాలు రెండు రకాలుగా కనబడుతున్నాయి. మైకు (1–38): గిల్టు (2–4): కారు (3–12): ఆసుపత్రి (3–21): ఆఫీసు (3–21): చెక్కు (3–23): ఆస్పత్రి (3–28): ఇంజనీరు (5–27): పంపులన్ (5–33), (5–60): కార్పొరేటు (5–45): సీటు (5–46): నర్సులున్ (5–50): తారు (5–53): రోడ్డు (4–60, 5–55).

1.12.తెలుగు సంస్కృతికి దర్పణం: ఈ సామాజిక ప్రబంధం ఆధునిక తెలుగు సమాజంలోని సంస్కృతికి దర్పణం పడుతోంది. ఈ కావ్య కథలోని కొన్ని సన్నివేశాలు, సంఘటనలు నేటి సమాజంలో మనకు దర్శనమిస్తున్నాయి. కవి డా.టేకుమళ్ళ వేంకటప్పయ్యగారికి సమాజావగాహన మెండుగా, దండిగా ఉందనడం స్వభావోక్తి భాసితం.

బుధజన విధేయుడు

ప్రాచార్య లింగంనేని బసవశంకరరావు

చెన్నై – 600 005. ఫోను 044–2844321

గమనిక

పై "ధర్మదత్తోదయకావ్య వైచిత్రి" లో ప్రాచార్య శ్రీ ఎల్.బి.శంకరరావుగారు 1.3 లో ***"ఈ ధర్మదత్తోదంతాన్ని మార్కండేయుడు ధర్మరాజుకు వివరించి చెప్పినట్లుగా ఈ కవి పేర్కొనడంలో ఒక పొరబాటు ఉంది. ధర్మరాజు జీవించింది ద్వాపర యుగంలో. మార్కండేయుని అడిగింది కలియుగంలోని వ్యక్తి గురించి. దీనిని ఆంగ్లంలో 'ఏనాక్రానిజం' అంటారు"*** అని వ్యాఖ్యానించారు. రచయితగా నాకు జవాబు చెప్పవలసిన అవసరం ఉంది కనుక నా సమాధానం పరిశీలించవలసినదిగా వారిని, మరియూ రసహృదయులైన పాఠకులను సవినయంగా ప్రార్థిస్తున్నాను.

నన్నయభట్టు రచించిన ఆంధ్రమహాభారతం ఆరణ్యపర్వం చతుర్థాశ్వాసములో (2.4.284) ఈ ఘట్టం ప్రారంభమవుతుంది. "మునీంద్రా! భవత్ప్రసాదంబున నత్యద్భుత కథశ్రవణ పరితోషితుల మైతిమి కలియుగంబున సకలధర్మలోపంబగునని చెప్పుదురు, తత్ప్రకారం బెరింగింపవే'' అన్న ధర్మరాజు కోరికపై మార్కండేయమహర్షి ''కృతయుగమునందు ధర్మువు'' (2.4.285) తో ప్రారంభించి ''అంత గలియుగాంతంబునందు భువన విదితంబయిన శంబళ గ్రామంబున కల్యాత్మకుండైన విష్ణు యశుండైను బ్రాహ్మణుడు జనియించి." (2.4.308) తో కలియుగంలో జరిగే అన్యాయాలు అక్రమాలు 25 గద్య పద్యాలలో వివరిస్తాడు మహర్షి. ఇంకో విషయం గమనించవలసినదేమంటే..మార్కండేయ మహర్షి చిరంజీవి. అనేక యుగాలను చూసిన వాడు. కృత, త్రేతా, ద్వాపర, కలియుగాలనేవి ఒక సారి మాత్రమే జరిగేవి కాదని సవినయంగా మనవి చేస్తున్నాను. ఇప్పటి వరకు 27 కలియుగాలు గడిచి 28 కలియుగంలో ఉన్నాము. ఈ మహాయుగంలో కృత, త్రేత, ద్వాపర యుగాలు గడిచి ఇప్పుడు కలియుగంలో ఉన్నాం. సృష్టి ప్రారంభమై ఇప్పటికి 195 కోట్ల 58 లక్షల 85 వేల 106 సంవత్సరాలు అయ్యింది. స్వాయంభువ మన్వంతరం నుండి 6 మన్వంతరాలు గడిచాయి. ప్రస్తుతం "వైవస్వత మన్వంతరం" కలియుగం ప్రథమ పాదంలో ఉన్నాము. కనుక నా గ్రంథంలో ప్రాచార్యులు పేర్కొన్నట్లుగా "ఏనాక్రానిజం" (తరువాతి కాలంలో జరిగిన సంఘటనను ముందు పేర్కొనడం) ఏమీ లేదని సవినయంగా మనవి చేస్తున్నాను.

పీఠిక

01. నామౌచిత్యము: పూర్వం ప్రబంధాలకు పేరు "స్వారోచిష మనుసంభవము", "నర్మదా పురుకుత్సీయము" అని పేరులోనే కథ ఏమిటో తెలిసేటట్టు పెట్టేవారు. మరి సాంఘిక ప్రబంధములోని వ్యక్తులు పురాణములలోని వ్యక్తులు కాదు. కానీ కొంతవరకైనా కథను తెలియజే విధంగా "ధర్మదత్తోదయం" అని పెట్టాను. మొదట "ధర్మదత్తోపాఖ్యానం" అని పెడితే ఉపాఖ్యానం అంటే చిన్న కథ అనీ, ఔచిత్యం ఉండదేమో అన్న అనుమానం కొందరు వ్యక్తం చేయగా, ఈ "ధర్మదత్తోదయం" అన్న పేరు ఖాయం చేశాను. "ఉదయం" అనగా పుట్టుక అనే మామూలు అర్థం కాకుండా బహుజనపల్లి సీతారామయ్య గారి "శబ్దరత్నాకరం" (1912) నిఘంటువులో "ఉన్నతి" అనే అర్థము, అలాగే కొట్రా శ్యామలకామశాస్త్రి గారి నిఘంటువు "ఆంధ్ర వాచస్పత్యము"లో (1953) "ఔన్నత్యము" అని, జి.ఎన్.రెడ్డి గారి (1979) "తెలుగు నిఘంటువు" లో "ఫలసిద్ధి" అని ఉన్నవి. ఆ విధంగా ధర్మదత్తుని ఔన్నత్యము, ఫలసిద్ధి, ఉన్నతిని తెలియజేసే విధంగా ఉంటుందన్న తలంపుతో ఈ పేరు పెట్టడం జరిగింది. ధర్మదత్తుడు ప్రబంధ నాయకుడగుట వలన నీకావ్యమునకుఉ "ధర్మదత్తోదయం" అను నామధేయము అన్వర్థమై యొప్పుచున్నది.

02. కథా సంవిధానము: సంవిధానం అంటే కల్పనము, ఏర్పాటు, విధానం అనే అర్థాలు ఉన్నాయి. ఆ అర్థాలను బట్టి, మరియూ నాచన సోమన తన "ఉత్తర హరివంశం" లోని ఆశ్వాసాంత గద్యలలో తనను గూర్చి "సంవిధాన చక్రవర్తి" అని చెప్పుకొనడాన్ని బట్టి చూసినట్లైతే కథను చెప్పే విధానంలో ఒక విలక్షణతను చూపడం సంవిధానం అని అనవచ్చును. సోమన చిత్ర-శబ్దాలను అలా వుంచితే, ఆయన తన కావ్యంలో సృష్టించిన శబ్ద-చిత్రాలు సామాన్యమైనవి కావు. నేను కూడా కథను అటు ప్రాచీన ప్రబంధ రీతులలోనే నడిపిస్తూనే, "ప్రజ-పద్యం" వారు ఇచ్చిన అవుట్ లైన్ కథా చట్రాన్ని విడిచిపెట్టకుండా, "నేల విడిచి సాము" చేయకుండా, మంచి "మెలోడ్రామా"తో నడిపించ యత్నించాను. నేను ఎంతవరకు కృతకృత్యుడనైనదీ న్యాయ నిర్ణేతలు తేల్చువలసినదిగా ప్రార్థన. ఇక కథా సారాంశాన్ని వివరిస్తాను.

ప్రథమాశ్వాసము: ప్రాచీన ప్రబంధ విధానమును అనుసరించి "అవతారిక" వ్రాయబడినది. ఇందులో ఇష్టదేవతా స్తుతి, శివ స్తుతి, విష్ణుస్తుతి, గౌరీస్తుతి, లక్ష్మీ స్తుతి, సుకవి స్తుతి, గురుస్తుతి, కుకవి నింద, షష్ఠ్యంతములు, తర్వాత కథా ప్రారంభ సన్నివేశము (గద్యము) మహాభారతమునందలి అరణ్యపర్వము చతుర్థాశ్వాసములో మార్కండేయ మహర్షి, ధర్మరాజు కోరికపై కలియుగ ధర్మాలు క్షీణించే విధానాన్ని (పద్యము 285 నుండి 311 పద్యం వరకు) తెలియజెబుతాడు. ఆ వృత్తాంతానికి అనుగుణంగా నేపథ్యంగా నేను ఈ "ధర్మదత్తోదయం" చెప్పడం జరిగినది. ధర్మరాజు మార్కండేయ మహర్షిని "కలియుగంలో అందరూ పాపాత్ములేనా? ఒక్కడైనా పుణ్యాత్ముడు ఉన్నట్లైతే ఆ పుణ్యాత్ముని దివ్య చరిత్రను తెలుసుకోవాలని ఉన్నద" ని కోరగా మహర్షి ఈ "ధర్మదత్తుని వృత్తాంతం" చెప్పినట్లు రచించాను.

ప్రబంధమున కాలవాలము నాయికా నాయకులు. నాయకుడు సాధారణముగా ధీరోధాత్తుడు (చతుర్విధ నాయకులలో నొకడుడు) గా ఉండును. ఇందులో నాయకుడు "ధర్మదత్తుడు" ధీరోదాత్తుడు. "ధీరశ్చ అసౌ ఉదాత్త:" అని విగ్రహము. ధీరత్వము, ఉదాత్తము గలవాడు ధీరోదాత్తుడు. ధీరుడనగా గ్లేశములను సహించువాడు. ఉదాత్తుడనగా నాత్మశ్లాఘ లేని వాడు. కృపాళువు. ధర్మదత్తునికి యట్టి ధీరోదాత్త లక్షణము లనేక చోట్ల ఆపాదింపబడినవి. భార్య అంకితయును ఉత్తమ నాయిక "స్వీయ" తో పోల్చదగును. ఋజుశీలము అనగా పాతివ్రత్యము గలిగి, అగ్ని సాక్షిగ వివాహమాడి " శ్లో? కార్యేషు దాసీ, కరణేషు మంత్రి, రూపేచ లక్ష్మీ, క్షమయా ధరిత్రీ, భోజ్యేషు మాతా, శయనేషు రంభా, షట్కర్మ యుక్తా కుల ధర్మపత్నీ" అన్న లక్షణాలను పుణికిపుచ్చుకున్న స్త్రీ. ఇట్టి నాయికా నాయకులతో సాగినదే "ధర్మదత్తోదయము".

కథా ప్రారంభము "ఉ. శ్రీలలరారు వాటికది సిద్ధుల నాగుల వాసమద్ది, స/చ్ఛీలత రాజులేలిరి విధేయత ధర్మము రాజిలంగ, న/క్కాలము మారిపోయె కలికాలమధర్మము పాదమూనె, భూ/పాలుర వృత్తిమారె పురవాసుల బాధల శక్యమై చనెన్" (1-20) కలికాలము లో అధర్మము పాదమూనినదని చెప్పే పద్యంతో ప్రబంధం ప్రారంభమౌతుంది. నాగులు, యక్షులు, సిద్ధులు మరియు శబరులవంటి ఇతర వనవాస జాతులు ప్రధానంగా భాషాపరంగా, కలసినందువలన ఆంధ్ర లేదా తెలుగు జాతి రూపుదిద్దుకొందన్న విషయము పెద్దలకు విదితమే!

ఆ తర్వాత విజయవాడ పురవర్ణన, కృష్ణవేణి నదీ వర్ణనతో సాగి, వేంగిపుర పల్లె వర్ణన, సూర్యోదయ వర్ణన, పల్లెటూరులో ఉదయము పశువులు మేతకు వెళ్ళడం, అక్కడి వర్ణనలు, అత్త– క్రొత్త కోడండ్ల వర్ణనల అనంతరము చాతుర్వర్ణ వర్ణనలు (ఎవరినీ నొప్పించని రీతిలో) ఉన్నాయి. ఆరోజులలో కృష్ణానదీ పుష్కరములు వస్తాయి. నదీ స్నానానికి వేంగి పుర వాసులు బండ్లు కట్టుకుని వెళ్తారు.

స్నానానంతరము, దుర్గామాతను దర్శించుకొని యుండగా ఆ గుడిలో వేంగి వాసులకు ఒక బాలుడు తల్లిదండ్రులనుండి తప్పిపోయి బిగ్గరగా ఏడుస్తూ కనబడతాడు. పేరు ధర్మపాలుడని మాత్రమే చెప్తాడు. ఆ బాలుని తల్లిదండ్రుల కొరకు చాలసేపు వెదకి చివరకు తామే పెంచవలెనని నిశ్చయించుకుంటారు. ఊరికి తీసుకొని వెళ్ళి ఒక దాదికి అప్పజెబుతారు. అనంతరమామె ముదుసలియై మరణిస్తుంది.

యుక్తవయస్కుడైన ధర్మపాలుని అందమును చూచి ఆ వూరి ఆడపిల్లలు మరులు కొనగా కులగోత్రములు తెలియని వానిని పెండ్లి యాడుటకు వీలుకాదని, వారల తల్లి దండ్రులు మందలించి, అన్నపూర్ణ అను ఒక అనాధ పేదరాలైనప్పటికీ అందాలభరిణె, ఆమెతో వివాహం జరిపిస్తారు. నూతన దంపతులు పుణ్యక్షేత్ర సందర్శనార్థమై, కాళహస్తి, తిరుమల దర్శించి కాణిపాకం చేరుతారు. అక్కడ వారు వంశాన్ని నిలిపే పుత్రునిమ్మని ప్రార్ధన సలిపి ఒక చెట్టు నీడలో కూర్చొని యుండగా ఒక దైవ సంఘటన జరుగుతుంది. ఒక ఏనుగు ఎక్కడనుండో ఘీంకరిస్తూ వచ్చి, చెట్టుపైనున్న ఒక పూల కొమ్మను విరిచి, ధర్మపాలాన్నపూర్ణల ఒడిలోనుంచి, తొండమునెత్తి వారి శిరసులను తాకించి, ముందు రెండు కాళ్ళను ఎత్తి ఘీంకరించి ఆశీర్వదించినట్లు కొద్ది సేపు నిలబడి గబగబా వెళ్ళిపోగా, చూచిన వారందరూ "కలయా వైష్ణవ మాయయా?" అని ఆశ్చర్య పడతారు. ఆ సమయములో పూజారులు విఘ్నేశ్వర దండకము (ఒక చిన్న "త"గణ దండకము రాయబడినది - 1-57) చదువగా అది విని ధర్మపాలుడు నవ్వుమోముతో అన్నపూర్ణను చూస్తాడు. ఒక విశేష వృత్తమైన భుజంగప్రయాతము (1-60) ఆశ్వాసాంతమున దైవ ప్రార్థనతో మొదటి ఆశ్వాసము ముగుస్తుంది.

ద్వితీయాశ్వాసము: ఒకనాటి తెల్లవారుఝామున ధర్మపాలునికి బందరు పాండురంగస్వామి కలలో కనుపించగా దర్శనార్థం వెళ్తాడు. పూజానంతరం గిల్టు నగలకు కేంద్రమైన చిలకలపూడి వెళ్ళి నగలు కొనుటకు ద్రవ్యము లేకపోవుటచే అక్కడ భార్యకు ముక్కుపుడక మాత్రమే కొంటాడు. బందరు సముద్రతీరం దర్శించాలన్న కోరికతో సముద్ర తీరానికి వెళ్తారు. అక్కడ సముద్ర వర్ణన ఉంటుంది. సముద్రంలో ఈతలాడుతూ ఒక పిల్లవాడు అలల మధయలో చిక్కుకొనగా, వాని తల్లిదండ్రులు గగ్గోలు పెట్టగా ధర్మపాలుని భార్య భర్తను ఆ పిల్లవానిని కాపాడగా కోరుతుంది. అక్కడ " కం.అమ్మను నమ్ముడు శు భమగు!/ లెమ్మిక కాపాడబూనరే! జాగేలా?/ పొమ్మిక బాలుని తెమ్మిక/ నమ్మిక యుండంగ వలయు నారాయణిపై (2-12)" అన్న మాటతో వెళ్ళి బాలుని రక్షిస్తాడు. ఇలా ఉండగా వేంగిపురములో ఒక ప్రజానాయకుడు మద్యము అమ్ముటకు ఊరిచివర పాకలను వేస్తాడు. వారు పురుషులను ఆకర్షించడానికి రకరకాల పన్నాగాలు వేస్తూ ఉంటారు. "కం. సురలసురులు వారి స/ ద్గురువులు-నేతలు-సచివులు-గొనకొని తృప్తిన్/ సురద్రాగి రతుల దేలిరి/ తరుణుల మెప్పులను గొనిరి - తనసిరి సురచే (2-17) అంటూ రెచ్చగొడుతూ ఉంటారు. కలిపురుషుడు చెప్పిన మానవ నాశన హేతువులలో నొకటిగా నెరింగి ఆ పల్లెలోని స్త్రీలు అన్నపూర్ణను నాయకురాలిగా ప్రకటించి రాజధానికి వెళ్ళి, మంత్రులను కలుసుకుని విన్నవించగా, ముఖ్యమంత్రి సచివులతో చర్చించి, మద్యనిషేధం ప్రకటిస్తాడు.

రాజధాని నుండి సంతోషంతో వచ్చిన అన్నపూర్ణ కనులు తిరిగి పడిపోవగా, భర్త వైద్యుని పిలిపించి విషయమడుగగా ఆమె గర్భవతి అన్న శుభవార్త చెప్తాడు. వైద్యశాలలు లేని ఆ ఊరిలో మంత్రసాని పురుడు పోయగా మొగ పిల్లవాడు జన్మిస్తాడు. ఆ ఊరిలోని పూజారులు వేదవేత్తలు పుట్టిన పిల్లవాడు ఊరిని ఉద్ధరిస్తాడని మహాపురుషుడవుతాడని జాతకం చెప్తారు. ధర్మదత్తుని భారసాల సమయమున గొప్ప శంఖద్వానం వినవస్తుంది. టఇక్కడ ఒక శంఖ బంధ పద్యం - బంధ కవిత్వం (2-41) అదృశ్యరూపుడైన శంకరుని వాక్కులను విని జనులు సంతోషపడతారు. ధర్మదత్తుని శైశవ దశ ఆనందంగా గడుస్తుంది. అక్కడ పాఠశాలలు లేనందున పూజారి వద్ద వేద, వేదాంగాలు, ధర్మాలు, తాలింఖానాలో మల్ల విద్యలు నేర్చుకుంటాడు. ధర్మదత్తుని నాయక లక్షణాలను నిలబెట్టే రీతిలో సాగుతాయి పద్యాలు. ఆరోజులలో నొకనాడు

అన్నపూర్ణ పొలమునకు పరిగ ఏరుకొనుటకు వెళ్ళి వడదెబ్బ తగిలి హటాత్తుగా మరణిస్తుంది. అన్నపూర్ణ చితాభస్మాన్ని గంగలో కలపడానికి ధర్మపాల ధర్మదత్తులు కాశీ క్షేత్రానికి వెళ్తారు. వారు అన్నపూర్ణ గురించి మిక్కిలి దు:ఖిస్తారు. వారిరువురూ తిరిగి తమ ఊరికి ప్రయాణమయి బయలుదేరుతారు. ఆశ్వాసాంత పద్యాలు కాశీ విశ్వేశ్వరుని స్తుతిస్తూ సాగుతాయి. ద్వితీయాశ్వాసం ముగుస్తుంది.

తృతీయాశ్వాసము: ధర్మదత్తుడు రైలులో తల్లి అన్నపూర్ణను గురించి పరిపరి దు:ఖిస్తూ, ఈ విధంగా మళ్ళీ తిరిగి వేంగిపల్లె కు వెళితే ప్రయోజనం శూన్యమని, వ్యాపారము చేసి గొప్ప ధనవంతుడు కావాలనీ, లోకోపకారి కావాలన్న ఉద్దేశ్యంతో, నడిరేయి, తండ్రి రైలులో నిద్రించుచుండగా, అతనికి చెప్పకుండా బలార్షా అనే ఊరిలో దిగుతాడు. అక్కడి బండ రాళ్ళపై నిద్రించి తెల్లవారగనే లేచి పట్టణంలోకి వస్తాడు. అక్కడ ఒక సంత జరుగుతూ ఉంటుంది. భరించలేని క్షుద్బాధతో ఉచిత అన్నదాన సత్రము ప్రక్క వీధిలో ఉన్నదని తెలిసి వెళ్ళుటకు రోడ్డు దాటుచుండగా, ఒక కారు వచ్చి గుద్దగా క్రింద పడిపోతాడు. గుద్దిన వ్యక్తి భయపడి కారు తలుపు తీయడు. జనం గుంపులుగా మూగి ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తుండగా పోలీసులు రంగప్రవేశం చేసి పిల్లవానిని దగ్గరలో గల ఒక పెద్ద ఆసుపత్రిలో చేరుస్తారు. కారుతో గుద్దిన వ్యక్తి, పిల్లవాని ప్రాణములు కాపాడబూని ఆసుపత్రిలో ప్రవేశించగా అక్కడి వారు ఆయనను నగరంలోని కోటీశ్వరుడైన గోవింద కర్వాడే (కర్వాడే అనగా మహారాష్ట్రలో సనాతన బ్రాహ్మణ కుటుంబము) అని గుర్తెరిగి ఆసుపత్రి " పెద్ద డాక్టరు" ను తీసుకుని వస్తారు. కర్వాడే ఆయనకు సంతకం మాత్రమే చేసి, చెల్లించవలసిన మొత్తం పూరించకుండా ఖాళీ చెక్కు ఇచ్చి కాపాడమని వెళ్ళిపోతాడు. డాక్టర్లు పిల్లవానిని కాపాడగా, కర్వాడే అక్కడకు వచ్చి పిల్లవానిని చూడగోరుతాడు. ధర్మదత్తుని చూడగానే ఏదో అనురాగ భావం కలిగి ఎవరు నీవు? అని అడిగి వివరములు తెలిసికొని, తల్లి చనిపోయినదని తెలిసికొని అనపత్యుడైన గోవింద కర్వాడే భార్య అహల్యాబాయికి చరవాణిలో ఇలా చెప్తాడు. "తే.గీ. వినుమహల్య! నెమ్మది తోడ, వేడ్క మీర/ నేను చెప్పెడి విషయమ్ము నీకు ప్రియము,/శాంతి సంపద లందించు, జింత మాన్పు,/నింటి గౌరవమ్మును పెంచునే - లతాంగి! (3-40) మరియూ ఆ బాలుడెట్టివాడనిన "ఉ. కాంచితి ధర్మవీరునిట, కాంచితి సుందర రూపునిచ్చటన్/ కాంచన దేహమాతనిది,

కారణ జన్ముడు ధర్మదత్తుడున్/కాంచగ వంశగౌరవము గాచెడి బాలుడు వారసుండడనన్ పంచును మంచినెల్లడల పాపము పుణ్యము నెంచునేతయౌ" (3-41) అని తెలియజేగా సంతసించిన అహల్య వెంటనే ఆసుపత్రి కరుదెంచి బాలుని గాంచి పరవశమంది, వానిని ఇంటికి తీసుకొని వెళ్ళి ఉపనయనాది సంస్కారములు గావించి, "బిడ్డ లేనట్టి గొడ్రాలు" పిలుపు మాసెనని ఆనందపడుతుంది. ఆ తర్వాత విద్యలను నేర్చుకుని తండ్రి కర్వాడే కు వ్యాపారములో సహాయపడుచుండెను. ధర్మదత్తుని యుక్త వయస్సు రాగా, తగిన సంబంధము కొరకు విచారణ చేయగా, ధర్మదత్తుడు దత్త పుత్రుడే కానీ స్వంత పుత్రుడు కాజాలడని, ఆతని వంశ విషయము ప్రస్తావనకు రాగా కర్వాడే కోపించి "మారాడక పొండు, శ్రీరామసముండు ధర్మచిత్తుడు" అని వాళ్ళను పంపివేస్తాడు.

తర్వాత తల్లి అహల్యాబాయి ధర్మదత్తుని మనసు తెలిసికొన గోరి ప్రశ్నించగా "కం. అమ్మా! బ్రాహ్మణ కన్యను/ తెమ్మా! యింటికి వెలుగును తెచ్చెడి వనితన్/ నెమ్మది మిము సేవించుచు/ సమ్మానించెదము సతము సత్యము తల్లీ!" (3-57) అనగా తల్లి మిక్కిలి సంతసించి అందరినీ సంప్రదించి అంకితాబాయి అను ఒక కన్య చిత్రపటమును చూపగా ధర్మదత్తుడు వల్లె యనెను. పెండ్లికి ముందుగా ధర్మదత్తుడు తన కన్న తండ్రి ధర్మపాలుని రావించగోరి కొందరిని వేంగి పల్లెకు పంపగా తండ్రి మరణించిన వార్త తెలియగా, చింతించు ధర్మపాలుని కర్వాడే ఓదారుస్తాడు.

ధర్మదత్తుని పెండ్లి చూపుల ఘట్టము అనంతరము వివాహము అంగరంగ వైభోగంగా జరుగుతుంది. వివాహానంతరం "శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం" జరుగుతుంది. ఆ స్వామి ప్రార్థన ఆశ్వాసాంత పద్యములుగా తృతీయాశ్వాసము ముగుస్తుంది.

చతుర్థాశ్వాసము: ధర్మదత్తుని భార్య అంకిత అంకితభావముతో అత్తమామలను సేవిస్తూ ఉంటుంది. ధర్మదత్తుడు కూడా గోవింద కర్వాడే ననుసరించుకొని సహాయపడుతూ, వ్యాపారాన్ని బాగా అభివృద్ధి చేస్తాడు. అంకితాబాయి గర్భవతియై, ఇద్దరు మగ పిల్లలకు జన్మమిస్తుంది. కర్వాడే ముదుసలితనంతో వ్యాపారాలకు దూరంగా ఉండగా ధర్మదత్తుడు పూర్తి వ్యాపారభారం వహిస్తాడు. ఒకనాడు కర్వాడే యింటిలో గడప దాటుచుండగా కాలు జారిపడి హఠాన్మరణం చెందుతాడు. అనంతరము ధర్మదత్తుడు కుమారులిద్దరినీ ఒక సంవత్సరము పాటు స్వంత సంపాదన చేసుకుంటూ దేశాంతరం చేసి రమ్మని పంపుతాడు. "తే.గీ. ధర్మదత్తుని పేరును దలచకుండ/ స్వంత పాదమ్ములన్

నిల్చి స్వార్జితముగ/ వేతనమ్ముల నార్జించు విధము నేర్వ/వలయు పేరాశ పడకుండ వగవ కుండ"(4-28) అని చెప్పి పంపుతాడు.

ధర్మదత్తుని వ్యాపారంలో కొంతమంది స్వార్థపరులై ద్రవ్యమును అన్యాయముగా అపహరించగా ధర్మదత్తుడు ఆ ప్రాంతమునకు వెళ్ళి వారికి తగిన బుద్ధి చెప్పి పరిస్థితిని సరిదిద్దుతాడు. ఆ సమయములో చిన్నతనంలో వేంగి పల్లెలో ఉన్న స్నేహితుడు శీను కనిపించి మాట్లాడి, ఊరి పరిస్తితి చాలా ఘోరంగా ఉందని వచ్చి చూడమని కోరుతాడు. అలాగే అని వెళ్ళిపోతాడు ధర్మదత్తుడు. ఆ విషయం వెంటనే మరచిపోతాడు. ఇంతలో ధర్మదత్తుని కుమారులు దేశాంతరానంతరము తగిన జ్ఞానము సంపాదించి తిరిగి వస్తారు. "వివిధ ఆదాయ మార్గముల్ వెదకు మనుచు కొన్ని పనులను వారిని కూడి చేయ ఆనతీయ సుతద్వయ మనుసరించె". ఇది ఇలా ఉండగా ఒకరోజు స్వప్నంలో ధర్మదత్తునికి పరమశివుడు అగుపించి "కోట్లకు పడగెత్తి కూడబెట్టిన నీవు/ సతియు సుతుల తోడ చల్లగుండ/కూటికి లేనట్టి కోట్లాది ప్రజలెల్ల/కడుపులు నిండక కమిలె బ్రతుకు" (4-46 లో ఒక భాగము) అనగా జ్ఞానోదయమయి, కర్తవ్య దీక్షతో వేంగిపల్లెకు చేరువై శివార్లలో ఉండగా, ముక్కుపచ్చలారని ఒక బాలుడు కడుపు నొప్పితో చనిపోయెనని దు:ఖిస్తూ అతన్ని ఖననం చేస్తూ ఉంటారు. ఆ దృశ్యం ధర్మదత్తుని హృదయం కలిచి వేస్తుంది. ఊరికి వెళ్ళి పెద్దలతో మాట్లాడి అక్కడ వలసిన వసతులను సమకూర్చగలనని కొద్దికాలము వ్యవధి అడిగి అక్కడి శివాలయమునకు వెళ్ళి ప్రార్ధనలు సలుపుతాడు. విశేష వృత్తము భుజంగప్రయాతము (4-66) మరియూ తోటకము (4-67) తో ఆశ్వాసాంత పద్యాలతో చతుర్ధాశ్వాసం ముగుస్తుంది.

పంచమాశ్వాసము: ఇదే చివరి అధ్యాయము. ధర్మదత్తుడు ఇంటిలో అన్యమనస్కుడై ఉండగా భార్య కారణం అడుగుతుంది. ఆమెకు శంకరుడు కలలో కనిపించిన విషయం వివరిస్తాడు. నేను పల్లెకు వెళ్ళి బాగోగులు చూసెదనని భర్త పలుకగా అంకిత రామునితో సీతవలె నేనూ వచ్చెదనని తెలిపి, కుమారులకు మంచి సంబంధాలను చూసి వివాహములు గావించి కొడుకులకు వ్యాపారం అప్పగించి పల్లెకు పయనమవగా కొడుకులు కోడళ్ళు దిగులు పడగా వారికి తత్త్వం బోధిస్తాడు. వారికి నీతి బోధ జేసి ఏపని నిర్వహించినా తాత గోవింద కర్వాడే పేరు ప్రతిష్ఠలు నిలిపే విధంగా ఉండాలని చెప్పి పల్లెకు వెళ్తారు. అక్కడ వారికి ఘన స్వాగతం లభిస్తుంది. అక్కడ కూలిన

దేవాలయమును పునరుద్ధరణ గావించి, పాఠశాల, ఆసుపత్రి నిర్మించి, ప్రజల దాహార్తికై మంచినీటి పథకము ప్రవేశ పెడతాడు. వేంగి–హేలాపురి రహదారి నిర్మాణానికి ద్రవ్యం భారీ ఎత్తున ఖర్చవుతుందని భావించి ప్రభుత్వ సహాయం అడుగగా ముఖ్యమంత్రి అందజేస్తాడు. ముఖ్యమంత్రి గవర్నర్ మరియూ రాష్ట్రపతులకు ధర్మదత్తుని సేవలను వివరించి ఘనసన్మానము అవార్డు ఇవ్వవలసిన అగత్యము ఉందని ఉత్తరం రాయిస్తాడు. ఇలా కొంత కాలం గడచిపోగా ఒకనాడు ధర్మదత్తునికి శివరాత్రి ముందురోజు రాత్రి ఒకవిచిత్ర స్వప్నం రాగా, కులగురువైన ఖండోబాకు స్వప్న వృత్తాంతాన్ని ఫోనులో వివరించగా.. ఆయన విస్మయమునంది ధర్మదత్తుని మరణకాలం ఆసన్నమయినదని, మోక్షప్రాప్తి యని, మరుజన్మ ఉండదని చెప్తాడు.

శివరాత్రి రోజు ధర్మదత్తుడు ప్రాయోపవేశం రీతిలో మౌనదీక్షలో కూర్చుని ఉండగా, లింగోద్భవ సమయమున కపాల మోక్షం (బ్రహ్మ రంధ్రం గుండా ప్రాణములు పోవుట) జరుగుతుంది. శవ దహనమునకు ఊరి శివార్లలోకి వెళ్తుండగా కొన్ని కార్లు ఎదురుగా వచ్చి నిల్చి ధర్మ దత్తుని ఇంటికి మార్గము చెప్పమని అడుగగా, జరిగిన ఘోరం విన్నవిస్తారు. వారు రాష్ట్రపతి అవార్డు వచ్చినదని తెలియజేసి ఆయన భార్యను దిల్లీకి వెళ్ళి తీసుకోమని చెప్పి వెళ్తారు. ఊరి ప్రవేశంలో ధర్మదత్తుని పేర ఒక ఒక ఆర్చి, ఒక కాంస్య విగ్రహం ప్రతిష్టిస్తారు. మార్కండేయ మహర్షి ధర్మదత్తుని వృత్తాంతం చెప్పి, ఈ కథను విన్నవారు కలియుగంలో ఆయురారోగ్య ఐశ్వర్యాలతో జీవిస్తారని ఫలశ్రుతి చెప్పి వెళ్తాడు. కవి గురించిన అనుష్టుప్ తో, చివర ఒక మంగళ మహాశ్రీ వృత్తంతో కావ్యం ముగుస్తుంది.

03. ఛందస్సు - విశేష వృత్తములు: కావ్యారంభమును శుభఫలప్రదము, మంగళ ప్రదము, సర్వదోష హరమగు “శ్రీ” కారముతో శ్రీ వృత్తము (1-1) తో ప్రారంభించబడినది. కావ్య వస్తువు ఆధునికమైనను సత్సంప్ర దాయమును పాటించుట యుత్తమ పద్ధతి. కావ్యము పఠితలకును, యర్థము జేసికొనువారికిని సులభ పఠనీయమై యుండుటకు, కొన్ని విశేషస్థలములందు దప్ప సర్వత్ర ఉత్పలమాల, చంపకమాల, శార్దూలము, మత్తేభవిక్రీడితము, కందము, తేటగీతి, ఆటవెలది, సీసములను వాడితిని. విషయము విస్తారముగా చెప్పుటకు గానీ, సూక్ష్మముగను చెప్పుటకు కూడా అవకాశ

మున్నందున, కొన్ని తావులలో మంజరీ ద్విపదను తీసుకొన్నాను. ఆశ్వాసముల చివర వాడిన వృత్తములు భుజంగ ప్రయాతము 1-60, 4-66) తోటకము (4-67) అనునవి, ఆశ్వాసముల చివర కొన్ని చోట్ల కంద పద్యములు, సీస పద్యములు కూడా దైవప్రార్థనగా వాడబడ్డాయి. ఇఉక నాయా విశేష స్థలములయందు రసానుకూలముగా, నాయకుడు ధర్మశాస్త్రములు చదివిన విధానమును చంద్రవర్మ (2-55) లోను, శంకరుడే మంచి సుగుణములిచ్చెనని తెలుపుచూ మౌక్తికమాల (2-58) లో, గోవింద కర్తడే ధర్మదత్తుని దత్తత సమయమున సుగంధి (3-45), యుక్త వయసు వచ్చిన ధర్మదత్తుని వర్ణనగా వంశస్థ (3-52), సమయోచితముగా వాడబడినవి. గర్భకవిత్వమును పూర్తిగా స్వీకరింపలేదు. బంధ కవిత్వము శంకరును స్తుతిస్తూ "శంఖ బంధము (2-41) వాడితిని. ఒక దండకమును రచించితిని (1-57). కావ్యం చివర కవి గురించిన కావ్యం గురించిన అనుష్టుప్ ఛందాలు రెండు ఉన్నవి (5-80,81). అలాగే కావ్యం మంగళ మహాశ్రీ వృత్తం (5-83) తో ముగుస్తుంది. విశేష వృత్తములన్నింటికీ ఆశ్వాసములోనే పద్యాలక్రింద అప్పకవీయ సూచిక ఇవ్వబడినది.

మంగళం మహాశ్రీ:

మంగళము స్వర్పతికి, మంగళము సూర్యునకు, మంగళము రేమగనికిన్ స
న్మంగళము నీటికిని, మంగళము వహ్నికిని, మంగళము వాయువునకున్ స
న్మంగళము నింగికిని, మంగళము ధాత్రికిని, మంగళము వేల్పుతతికిన్ స
న్మంగళము ప్రాకృతిక మంజుల మనోజ్ఞతకు, మంగళము జీవతతికెల్లన్.

(ధర్మదత్తోదయం 5-83)

సీసపద్యముల రచనలో, శ్రీనాథుడు పెట్టిన యొరవడిలోనే సమాంతరవాక్య విన్యాసము గల పెద్దపాదములు నాలుగింటిని బూరించి, పిమ్మట గీతపద్యమును/ ఆటవెలదిని జతపరచు పద్ధతిలోనే కలమును సాగించితిని. అప్పకవీయము కేవలము విశేష వృత్తములకు మాత్రమే ప్రామాణికమని నిబంధనలో ఉన్నది. నేను ప్రాస విషయములో కూడా అప్పకవి విధానమునే అనుసరించితిని. "న" "ణ" లను ఉభయప్రాసముగా అప్పకవి అంగీకరించెను (అప్పకవీయం 3-337) కనుక 3 పద్యములలో వాడితిని.

మ.	ఘనకల్లోల తరంగ భంగములతో – గర్జోరు నాదాలతో
మునుకల్వేయుచు పైకిలేచి బలిమిన్ – మొప్పల్ త్రుటిన్స్ఫోర్చి వే
మునుకల్వేసెడు మీన సంతతులతో బొంగారు ఫేనమ్ముతో
ఫణిరాడ్భూషణుడైన రుద్రుగతి విభ్రాజిల్లు నా తోయధిన్

కం.	ఋణదాత వైద్య వరుడును
అనువుగ ప్రవహించు నదియు నవనీసురుడున్
మనియెడు చోట వసించుట
మనుజుని గతజన్మ పుణ్యమహిమయె గాదే!

మ.	కనియెన్ దత్తుడు చంద్రమండల ముఖిన్ కల్యాణ భావైక రా
గ నిధిన్ సుందర కంబుకంఠిని బృహత్ గందేభ కుంభస్తనిన్
ప్రణుతాంభోజ దళాయ తాక్షిని లసత్ లక్ష్మీ కళోద్భాసినిన్
వనితా లోక నుతాప్త ధర్మ చరితన్ భద్రోరు శీలాంకితన్

ఆ) అలాగే అప్పకవి 'ళ'కార 'ల' కారములకు ప్రాసమైత్రి అప్పకవి అంగీకరించెను (అప్పకవీయం 3-279, 280) గనుక ఒక పద్యములో వాడితిని.

ఉ.	బాలుని వైద్యశాలకును బ్రాణము నిల్పగ వేగిరమ్మునన్
తోలిరి మూగియాగినటు త్రోవకు నడ్డగు పాదచారులన్
జాలిదలిర్ప బాలుగని సత్వరమట్టుల వాహనమ్మునన్
వైళమ వానిగొంచుమొగి పర్వులు దీసిరి వెజ్జుజూడగన్

'గద్యపద్యమయం కావ్యం చంపూ రిత్యభిధీయతే' అను లాక్షణికవచనానుసారముగా గద్యములును పద్యములును గల కావ్యమునకు 'జంపువు' అను పేరుండుట యుక్తము. కాని మన తెలుగుకవులు ఆపేరును బెట్టుకొనలేదు. "ప్రబంధము" లేక "కావ్యము" అని మాత్రమే పేర్కొనుట ఆనవాయితీగా సాగుచున్నది. బహుశః తెలుగుభాషలో చకారము తాలవ్యము ఉండుటచేత ప్రజల వ్యవహారమున 'చంపు' అనుటకు బదులు (kill) అని యగునను భయముచేత వదలియుందురని భావింతును.

కనుక పద్యకావ్యమునందే యవసరమని తోఁచినప్పుడు వచనములనుగూడఁ ఆనవాయితీగా చేర్చుచున్నప్పటికీ, తత్ప్రయుక్తమగు "చంపూ కావ్యము" అను నామకరణమును మాత్రము వదలుచు వచ్చిరి. ఇందులో అక్కడక్కడ గంభీర విషయముల చర్చించునప్పుడు సంస్కృతపదభూయిష్ఠములగు దీర్ఘసమాసములతో పాటు అచ్చతెలుఁగుపలుకుల కూర్పులును, 90 శాతము అలఁతియలఁతి పదము లుభయ భాషలయందును శబ్దార్థచిత్రములు గూర్ప బడినవి.

04.వర్ణనలు: "ధీరోదాత్త నాయకుడును, వీర, శృంగారాది రసప్రధానములును, పంచమాశ్వాస పరిమితములును ఐన కావ్యములు ఆలంకారిక శైలిలో వ్రాయబడినవి ప్రబంధములని పేరు" అని దివాకర్ల వేంకటావధానిగారన్నారు. తెలుగు ప్రబంధాలకు ఆనాటి సమకాలీన స్థితిగతులను కాక కవుల ఊహాలోకాలనే అద్దంపట్టాయన్న అపప్రధ ఉన్నా చాలామంది పండితులు, చరిత్రకారులు వీటికి చరిత్ర రచనలో ఎంత ప్రాధాన్యత ఉందో, ఆనాటి స్థితిగతులు ప్రబంధాల్లో ఎలా ప్రతిబింబించాయో వివరించారు. ప్రబంద యుగంగా వర్ధిల్లిన విజయనగర సామ్రాజ్య కాలంలోని ఆచారాలు, వ్యవహారాలు, జీవనశైలి వంటివాటికి ప్రబంధాలు ప్రతిబింబాలుగా నిలిచాయి. విజయనగర సామ్రాజ్యంలో 15-16 శతాబ్దుల కాలంలో పర్యటించిన పలువురు విదేశీ యాత్రికులు నమోదుచేసిన చరిత్రలో సంస్కృతికి సరిపోలని విషయాలు కొన్ని ఉన్నప్పటికిన్నీ, స్పష్టత కావాల్సివచ్చినప్పుడు వారేమి సూచిస్తున్నారో అర్థం చేసుకునేందుకుమాత్రం ప్రబంధాలు పనికివచ్చాయి.

ప్రబంధాల్లో జలక్రీడల వర్ణనం, సుగంధ ద్రవ్యాల వినియోగం, వారకాంతల వివరాలు, జాతరలు - మొక్కుబళ్ళు, సైనిక ప్రయత్నాలు వంటివాటి వర్ణనలు సామాజిక చరిత్ర నిర్మాణంలో ఉపకరిస్తున్నాయి. వాటినే అష్టాదశ వర్ణనలని అన్నారు లాక్షణికులు. ఈనాడు మనం అష్టాదశ వర్ణనలలో వారకాంతలను, విప్రలంభ శృంగార వర్ణనలు చేయాల్సిన అగత్యంలేదు. ఈనాటి సమకాలీన వాతావరణాన్ని ప్రతిబింబించే విధంగా ఉండడం చాలా అవసరం. అందుకే రక్షకభటుల (పోలీసువారు) వర్ణన, డాక్టర్ల వర్ణన, పల్లెవర్ణనలో భాగంగా అత్తాకోడండ్ల వర్ణన, పశువులు కసువుకరుగు వర్ణన, చాతుర్వర్ణ వర్ణన, ప్రసవము జేయు వర్ణన వంటివి తీసుకున్నాను.

కొన్ని పురాణ పద్ధతిననుసరించి తీసుకోవడం జరిగింది. అవి యేమన:
1. నగరము (విజయవాటిక), 2. సముద్రము (బందరు సముద్రము), 3. సూర్యోదయము (వేంగి పల్లెలో) 4. మధుపానము (వేంగిలో మద్యమమ్ముట), 5. వివాహము (ధర్మదత్తుని వివాహము), 6. కుమారోదయము (ధర్మదత్తుని జన్మము) 7. నాయకాభ్యుదయము వర్ణింపబడినవి.

వీనిలో కొలది కొన్ని ఉదాహరణల నిచ్చెదను.

1. పల్లెలో గోవులు ఉదయము ఆహారమున కరుగు సమయమున:

ఉ. మందలు మందలై చనెడు మాలిమి గోవులు గేదెలున్ గనన్
బంధుర భావనైకతకు మైత్రికి నియ్యవి చిహ్నమన్న హృత్
మందిరమందు నొక్క రసతత్త్వ విచారము గోచరించుచున్
సుందర దృశ్యమాలికలు చూడగ వచ్చును పల్లెసీమలన్

2. వేంగిలో బ్రహ్మణులు ఎలా ఉన్నారంటే:

ఉ. వీడరు సత్యధర్మములు, వీడరు వేదచయమ్ము శాస్త్రమున్
వీడరు సంధ్యలెన్నడును, విజ్ఞత నేర్చిన బ్రాహ్మణోత్తముల్
వీడరు దేవతార్చనము, వీడరు వృత్తిని భక్తితత్త్వమున్,
చూడరు తప్పు చెప్పరు, విశుద్ధ విచారులు జ్యోతిషమ్మునన్

3. మద్యపానము:

కం. సురలసురులు వారి స
ద్గురువులు–నేతలు–సచివులు–గొనకొని తృప్తిన్
సురద్రాగి రతుల దేలిరి
తరుణుల మెప్పులను గొనిరి – తనిసిరి సురచే

4. వైద్యుని వర్ణన:

కం. ఋణదాత వైద్య వరుడును
అనువుగ ప్రవహించు నదియు నవనీసురుడున్
మనియెడు చోట వసించుట
మనుజుని గతజన్మ పుణ్యమహిమయె గాదే!

5. ధర్మదత్తుని పెండ్లి చూపుల ఘట్టము:

మ. కనియెన్నంకిత చంద్రమండల ముఖున్ గంభీర మేఘస్ఫురత్
స్వన కంఠున్ సరసాబ్జ నేత్ర విలసత్ భద్రాధి రూఢాప్త దే
హుని కల్యాణ గుణాభిరాముని సుకార్యోదీర్ణ సంభావనా
త్ముని సద్ధర్మ పథాను వర్తనుని సత్యోత్కంఠునిన్ దత్తునిన్

6. ధర్మదత్తుడు పిల్లలకు విద్యాబుద్ధులను జెప్పుట:

ఉ. నేర్పెను దానధర్మముల, నేర్పెను వారికి దొడ్డ బుద్ధులున్
నేర్పెను గౌరవించుటను, నేర్పెను సంఘపు తీరుతెన్నులున్
నేర్పెను తారతమ్యములు, నేర్పెను నాణ్యత కార్యమందునన్
నేర్పెను కర్తడే తనకు నేర్పిన వన్నియు పొల్లుబోవకన్

7. ధర్మదత్తుడు గట్టించిన వైద్యశాల వర్ణన:

ఉ. దేశము నంతకున్ మిగుల దీటగు వైద్యము పల్లెయందు హృత్
పేశలమున్నవైద్యులను, ప్రేముడి చూపెడునట్టి నర్సులున్
ఆశయ సిద్ధికై నిలిపె నచ్చట దత్తుడు సర్వవేళలన్
దేశము నేలు నేతలును దిమ్మెర వోయిరి వేంగి గాంచుచున్

ఇంకా చాలా చాలా వర్ణనలున్నవి. గమనించగలందులకు ప్రార్థిస్తున్నాను.

05. ధర్మదత్తోదయం-అలంకారచాతురి: "అలంకరోతేతి అలంకార:" అంటారు. అంటే అలంకరింపబడుతున్నాయి కాబట్టి అలంకారాలు అని ఉత్పత్తి. అలంకార సాంప్రదాయమునకాద్యుడు భామహుడు. ఉద్భట,రుద్రటులు ఈమతమునంగీకరించిన ఆలంకారికులలో ముఖ్యులు. అలంకారం అన్న పదం యొక్క వివరణ ఎస్.ఎస్.నళిని వ్రాసిన సాహిత్య పదాల నిఘంటువు లో " పాఠకుల మనస్సులకు ఆహ్లాదం కలిగిస్తూ, కావ్యానికి అందాన్నిచ్చేది అలంకారం. వస్తువును పాఠకులకు క్రొత్తగా అందించడం, వ్యంగ్యంగా అందించడం, అలంకారం. పాఠకులను ఆకర్షించి వారిమీద ప్రభావం చూపేలా చేయగలిగే భాషాప్రయోగంగా కూడా భావించవచ్చు. ఎప్పటికప్పుడు పాత పద్ధతులకు భిన్నంగా చెప్పడం వల్లనే రచన వైవిధ్యంతో ఉండి నిలుస్తుంది.

అయితే ఇవి సందర్భానుగుణంగా, సహజంగా ఉండాలేగానీ కృత్రిమంగా కాదు. ఆధునిక కాలంలో అలంకారమే భావచిత్రంగా రూపొందిందంటారు. ఒక అందమైన కావ్యానికి అలంకారాలు శోభను కలిగిస్తాయి. ముమ్మటుడు శబ్దపరివృత్తిని సహింపనిచో అవి శబ్దాలంకారాలని, సహిస్తే అవి అర్థాలంకారాలవుతాయని చెప్పాడు. ఈ ధర్మదత్తోదయంలో ఉన్న వివిధ అలంకారాలను పరిశీలిద్దాం. ఇవన్నీ సమయోచితమైనవే గానీ అలంకారములు వ్రాయాలి అని రాసినవి కాదని మనవి. విజ్ఞుల పరిశీలనలో మరికొన్ని అలంకారములు బయల్పడగ వచ్చు.

01.ఉపమాలంకారము (2-6), 2.అంత్యానుప్రాస (1-21, 1-53, 2-17, 2-52, 2-55, 2-71, 3-73, 3-75, 4-19, 4-21, 4-40, 5-44). 3. పరికరాలంకారము (3-15, 3-45, 3-62), 4.ఉల్లేఖాలంకారము (1-45, 3-50), 5.వృత్యానుప్రాసము (1-35, 1-51). 6. స్వభావోక్తి (1-27, 1-28, 2-9, 2-35, 3-10, 3-13, 3-29, 4-10, 4-15, 5-51, 5-55, 5-56. 7. రూపకాలంకారము (2-61, 3-44, 4-20). 8. దృష్టాంతాలంకారము (2-69). 9. అర్థాంతరన్యాసలంకారము (3-2, 3-43). 10. ఛేకానుప్రాసము (3-30, 3-33) 11.యమకాలంకారము (2-77, 5-61). 12. అతిశయోక్తి (5-25). 13.సమాజ సహజత్వము (4-34). 14.పద్య సౌందర్యము (4-26)

6. జాతీయములు, నానుడులు:

ఈ ప్రబంధంలో ఉన్న కొన్ని జాతీయములను, నానుడులను చెప్పి ముగిస్తాను

జాతీయములు: 1.తలలోని నాలుకై (1-32), 2. ఎద్దు మువ్వ మ్రోగ (1-39) 3.నీళ్ళను జల్లిరి యాశపై (1-49), 4.తోకలు లేని కోతులు (2-7). 5. కాసునందె జగతి ఊసులాడు (2-34), 6 బిడ్డలు లేని గొడ్రాలు (3-44), 7. దిమ్మెర వోయిరి (5-50), 8. ఏండ్లు పూండ్లు (5-51),

నానుడులు: 1.ఎగ్గున్ సిగ్గున్ (1–48), 2.దన్నును కోలుపోతిమి (2–67)

7. అన్యభాషా పదములు: తెలుగు భాషపై అన్యదేశ్యాల ప్రభావం ఎక్కువగా ఉన్న భాష ఆంగ్లం. చాలా ఆంగ్ల పదాలు తెలుగు పదాలేమో అన్నంత సహజంగా మన భాషలో ఇమిడిపోయాయి. వేరే పదం వాడితే గుర్తుపట్టలేని స్తితి. సర్వసాధారణంగా వాడే ఇంగ్లీషు మాటలను మాత్రమేతీసుకోవడం జరిగినది. ఇష్టంతో కాకుండా అయిష్టంతో స్వీకరించాను. క్షంతవ్యుడను. ఈ గ్రంథంలో ఉన్న ఆంగ్ల పదాలను గమనిద్దాం.

"మైకు" (microphone) లోన పేరు మరి మరి జెప్పించె (1–38), "గిల్టు" (gilt -gold covering jewellery) నగలకు (2–4), అంతలోన "కారు" (car) హతవిధీ!(3–12), ఆసుపత్రిలోని "ఆఫీసు" (office) జనమెల్ల (3–21), "చెక్కు" (cheque) చేవ్రాలు మాత్రమే చేసి యిచ్చె (3–23), గొప్పగు "ఇంజినీరు" (engineer) లట (5–27), చక్కటి "పంపులన్" (pumps) గనుచు (5–33) "కార్పొరేటు" (corporate) బడుల ధాటిగాను నిల్చు (5–45), సీటు (seat) నిమ్మని కోరగ (5–46) ప్రేముడి చూపెడునట్టి "నర్సులు"న్ (nurses) (5–50), "తారు రోడ్డు" (tar road) నేసి దారిని మంచిగా (5–53).

8. ముగింపు: మనిషిలోని వ్యధలకు, వైరుధ్యాలకు, ఆనందాలకు ప్రతిస్పందనగా మనసులో రూపుదిద్దుకునే కళే ఈ కవిత్వం. అయితే కవిత్వంలో చుట్టూ ఉన్న సమాజ ప్రభావాలు ప్రస్ఫుటంగా దర్శనమిస్తాయి. గతాన్ని, వర్తమానాన్ని ప్రతిబింబిస్తూనే తన గతానుభావాలను చిత్రించడానికి ప్రయత్నిస్తాడు కవి. అయితే కవితల్లో వ్యక్తిగత ముద్ర ప్రస్ఫుటమైనప్పుడే ఆ కవి స్వంత గొంతు సాధించుకున్నాడని గుర్తు. స్వంత గొంతు సాధించుకోడానికి ప్రతి కవీ తనకు తాను ఒక ప్రత్యేక వ్యక్తిత్వాన్ని, భాషను సృష్టించుకోవలసిన అవసరం ఉంది. ప్రతి కవీ తన అస్థిత్వం కోసం ఈ పోటీ తప్పని సరిగ్గావలసి ఉంటుంది. ప్రతి పదంలోను, ప్రతి పధంలోను వైరుధ్యం చూపాలనే యత్నించాను. నేను ఎంతవరకూ కృతకృత్యుడైనదీ తేల్చవలసినదిగా పాఠకులను ప్రార్థిస్తున్నాను.

పూర్వం ప్రబంధ యుగంలో గ్రంధాలను ఏండ్ల తరబడి రచిస్తూ ఉండేవారు. కానీ ఈ ప్రబంధ పోటీ కేవలం 5-6 నెలలో ముగింపు పలకవలసి వచ్చినది. కనుక నా దృష్టికి రాని తప్పులు ఉండవచ్చు. ఎక్కడైనా అలా కనిపిస్తే సహృదయంతో మన్నిస్తారని భావిస్తున్నాను.

చివరగా... "ఆనందాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయంతేబీ ఆనందాద్ధ్యేవ జాతాని జీవంతి: ఆనందం ప్రయాం త్యభిసంవింశతి" (తైత్తరీయోపనిషత్) అంటూ ముగిస్తూ "ధర్మదత్తోదయం" లోకి ప్రవేశించవలసినదిగా కోరుతున్నాను.

టేకుమళ్ళ వెంకటప్పయ్య

ధర్మదత్తోదయము

ప్రథమాశ్వాసము

అవతారిక

ఇష్టదేవతా స్తుతి

శ్రీవృత్తము:

శ్రీ
వి
ఘ్నే
శా! 1

(పాదమునకొక గురువు - అప్పకవీయం - క్ర.సంఖ్య - 1)

స్త్రీ వృత్తము:

దేవా!
నీవే
ప్రోవన్
రావా! 2

(పాదమున 2 గురువులు- ప్రాస ఉన్నది -అ.క. క్ర.సంఖ్య -2)

కం. ఏమీ వ్రాయగలేనని
స్వామీ నీ పదములంటి సాష్టాంగమునన్
నామమ్ముల బలుకగనే
ధీమతినై సాగుచుంటి తిరుగేలేకన్! 3

శివస్తుతి

చం. అభయమునిచ్చి ప్రోచు కరుణామృతమూర్తి వటంచు సన్మతిన్
శుభములనివ్వ మ్రొక్కితిని చొక్కిశివా! పరమేశ్వరా! హరా!
విభవములిమ్ము నాకనుచు వేడగబోవను నన్ను నమ్ముమా
శుభములనిచ్చి నా రచన సూనృతమై నిలుపంగ వేడెదన్! 4

గౌరీ స్తుతి

ఉ. అమ్మలగన్న యమ్మవని, అమ్మలు గొల్చెడి ఆదిమాతవై
కొమ్మలు వేడినంతమరి కోరిక దీర్చెడు కొంగుబంగరై
నమ్మిన వారి వారి కాత్మవయి నాదవినోదిని వైన గౌరి! బల్
కమ్మని కావ్య ధారలును, గమ్యము దప్పని బాటజూపుమా! 5

విష్ణు స్తుతి

కం .మాధవ కేశవ యనగా
బాధల తొలగించబూను పరమాత్మా! నీ
గాధలనే వచియించుచు
శ్రీధర నీ భజన సేతు చిత్తమునందున్ 6

లక్ష్మీ స్తుతి

కం. అమ్మా జననీ గైకొను
మమ్మా మావందనములు మాధవు రాణీ
ఇమ్మా అగణిత సుఖముల
రమ్మా మా సదనమునకు రయముగ లక్ష్మీ! 7

వాణీ స్తుతి

కం. కవిగా కలమును బట్టితి
నవ భావనలిచ్చి నన్ను నడుపుము వాణీ
కవనములో నా కలమున
నివసింపుము ననవరతము నిన్నే కొలుతున్. 8

సుకవి స్తుతి

ఉ. నన్నయ తిక్కయజ్వకవి నాచనసోమన యెఱ్ఱనాదులున్
పొన్ను కవిత్వధీనిధులు పోతనయున్ కవి సార్వభౌముడున్
ఎన్నగ నన్నెచోడుడు కవీంద్రుడు రాయలు పెద్దనాదులున్
అన్నుల మిన్న మొల్లయు రసార్ద్ర వచోనిధి వేంగమాంబయున్ 9

ఉ. ఎందరొ ఎందరో సుకవులేర్పడ జేసిరి కావ్య వృక్షముల్!
విందులు జేయుచుంటిమిల వేడుక మీరగ తత్ఫలంబులన్
పొందిక తోడ నాంధ్రులటు పొందిరి కావ్యరసానుభూతులన్
గ్రంధములన్నియున్ మిగుల గౌరవ కారణమాంధ్ర జాతికిన్ 10

గురు స్తుతి

ఆ.వె. తల్లి, తండ్రి, అన్న దాక్షిణ్యవార్నిధై
చదువు జెప్పె నాకు ముదము తోడ
గురువు లెంత మందొ గుర్తేమి లేదయా
వారికెల్ల మిగుల వందనమ్ము 11

కుకవి నింద

తే.గీ. పద్య రచనన్న తెలియని బంధు జనులు
గొప్ప బోధలు జేయంగ గుందు మనసు
తప్పులెన్నుటె ఘనమను తత్త్వమున్న
వారి కెల్లర జేయుదు వందనములు 12

షష్ఠ్యంతములు

కం. శ్రీరామునకున్ సీతకు
శ్రీరామానుజులకున్ హరీంద్రునకు స
ద్ధీరుడు పవన సుతునకు
శ్రీరామాయణ కవికిదె చేయుదు వినతుల్ 13

కం. అరవింద లోచనునకున్
దరికిన్ జేరగ శరణిడు ధర్మాత్మునకున్
వరకరుణామృత మూర్తికి
కరమున కోదండమున్న ఘనవీరునకున్ 14

కం. ఇనకుల వంశాబుధునికి
ఘన పాపమ్ముల కడిగెడు గంగ సమునికిన్
జనకుని ప్రియ జామాతకు
మనమున సీతనె జపించు మహనీయునకున్ 15

కం. కామితము దీర్చు వానికి
తామస కల్మషములడచు దైవ సమునికిన్
భూమీశ వినుత గుణునకు
నామతి శోభించి నిలుపు నఖిలేశ్వరుకున్. 16

కం.	రవికులవంశోద్భవునికి
కవికుల వాల్మీకి కావ్య కారణ జనికిన్
చవులూరించుచరితకు నె
లవుగను తా నిల్చినట్టి లాలిత్యునకున్ 17

కం.	రామునకున్ సుగుణాలయ
రామునకున్ఆశ్రితజన రక్షాగ్రణికిన్
భామా జానకి మానస
సీమాచోరాగ్రగణ్య శ్రీరామునకున్ 18

అంకితంబుగా నే రచియింపబూనిన “ధర్మదత్తోదయంబను సామాజిక జీవన ప్రబంధ కథా క్రమంబెట్టిదనిన...

వ. ద్వాపరంబున పాండవులు వనవాస క్లేశమ్ములనుండ నొకనాడు మార్కండేయమహర్షి అవ్వనంబున కేతెంచి, అర్ఘ్యపాద్యాదులు స్వీకరించి సుఖాసీనుడై, ధర్మరాజుతో ద్వాపరమ్మునకు భరత వాక్యము, కలియుగమ్మునకు నాందీ వాచకము పలకబడే రోజులు సమీపించుచున్నవని మిక్కిలి వాపోయెను. ధర్మజుని కోరిక మేరకు మహర్షి చూచిన అనేక కలియుగములలోని విశేషములను తెలియజేయగా, ధర్మజుడు విచలిత మనస్కుడై, మహర్షీ! కలియుగంలో ధర్మమార్గాన నడిచే మానవుడు ఒక్కడైనా ఉండడంటారా? అనగా, మహర్షి అలాంటి ధర్మాత్ములు కొంతమందైనా ఉండడం వలననే కలియుగంలో ధర్మం కనీసం ఒంటికాలితోనైనా కుంటుతూ నడవగలుగుతున్నదని విచారక్రాంతుడై సెలవిస్తాడు. పాండవాగ్రజుడు మహర్షీ! కలియుగంలో ఉన్న అలాంటి మహనీయుల గురించి తెలియజేయవలసినదని కోరగా, మహర్షి చిరునవ్వునవ్వి ధర్మజా! చిత్తశుద్ధి, దైవబలం ఉంటే కలియుగంలో సైతం మానవులు కలిబారిన పడకుండా ధర్మవర్తనులుగా జీవించవచ్చునని, మోక్షప్రాప్తియును పొందవచ్చునని తెలియజేసే, ఈశ్వర వరప్రసాదుడైన ధర్మదత్తుని చరిత్రను అవశ్య మెఱింగించెదను. అలాంటి మహనీయులున్న ప్రదేశానికి

కలిపురుషుడు తొంగిచూడడానికి కూడా భయపడతాడు. ఆ ధర్మదత్తుని చరిత్రను మీకు సాంగోపాంగముగా నెఱింగించెదను, సావధాన చిత్తులై వినవలసినదని కోరి ఒక్కసారి కనులు మూసికొని మనోనేత్రాలతో పరంధాముని దర్శించి ఈవిధముగా చెప్పదొడంగెను. 19

కథా ప్రారంభము

ఉ. శ్రీలలరారు వాటికది సిద్ధుల నాగుల వాసమద్ది, స
ఛ్చీలత రాజులేలిరి విధేయత ధర్మము రాజిలంగ, న
క్కాలము మారిపోయె కలికాలమధర్మము పాదమూనె, భూ
పాలుర వృత్తిమారె పురవాసుల బాధల శక్యమై చనెన్ 20

విజయవాటిక వర్ణన

తే.గీ. ఇంద్రకీలాద్రి ప్రజలకు నిహము పరము
కనక దుర్గమ్మ కొలువున్న కలిమికొండ
మల్లికార్జునుడున్నట్టి మహిత నగము
అమ్మ పెద్దమ్మ భక్తుల కండదండ 21

ఉ. జలజల పారుచుండునది చల్లని తల్లిగ సేదదీర్చెడున్
కలిమిని పెంచు తీరుగను కర్షకపాళికి కల్ప వృక్షమై
బలిమిని గుండె నిబ్బరము బాయక నిచ్చెడి కృష్ణవేణియై
పలుపలు రీతులన్ జనుల బాధల తీర్చెడు దివ్యతీర్థమై. 22

వేంగీపుర వర్ణన

తే.గీ. విజయవాటిక విశ్వంబు విదిత మయిన
శక్తిపీఠము దాపున చక్కగాను
ఎనిమిదామడ దూరంబు నెంచి చూడ
వేంగిపురమను గ్రామంబు వెలసి యుండె 23

తే.గీ. రాజ నరేంద్రుడేలిన రమ్య పురము
పాడిపంటల తులతూగు పల్లె యనఘ!
పేదలుధనికులను భేదవృత్తిని వీడి
ప్రేమ భావ మార్గాన వర్తింత్రు జనులు 24

సూర్యోదయ వర్ణన

ఉ. భానుడు తూర్పుదిక్కునొక బంతిగ తామ్ర సువర్ణ రూపుడై
పూనిక వెల్గుచుండె తన పోడిమి వేడిమి పంచుచున్ లలిన్
చేనికి నీరువెట్ట తమ చేతుల కఱ్ఱల గొంచు రైతులున్
దీన ముఖమ్ములన్ బయలు దేరిరి పట్టెడు పొట్టకూటికై 25

తే.గీ. అత్త సణుగుడు ధాటికి నదరిపడుచు
కొత్త కోడళ్ళు భయపడి చిత్తమనుచు
మగని కౌగిలి వీడిరి మత్తువదలి
భర్త నెత్తిన మొట్టుచు బయట పడిరి 26

ఉ. మందిర ఘంటికారవము మంజులతన్ జెవిసోక, తాళికిన్
వందనమాచరించి తమవంతు పనుల్ పొనరింప వేడుకన్
సుందర భామినీ మణులు సొంపుగ వాకిట ముగ్గుతోడ క
న్విందులు చేయుచుంద్రు రమణీయ గుణోన్నతి పల్లెసీమలన్ 27

ఉ. మందలు మందలై చనెడు మాలిమి గోవులు గేదెలున్ గనన్
బంధుర భావనైకతకు మైత్రికి నియ్యవి చిహ్నమన్న హృత్
మందిరమందు నొక్క రసతత్త్వ విచారము గోచరించుచున్
సుందర దృశ్యమాలికలు చూడగ వచ్చును పల్లెసీమలన్ 28

చాతుర్వర్ణ వర్ణన

ఉ. వీడరు సత్యధర్మములు వీడరు వేదచయమ్ము శాస్త్రమున్
వీడరు సంధ్యలెన్నడును విజ్ఞత నేర్చిన **బ్రాహ్మణోత్తముల్**
వీడరు దేవతార్చనము వీడరు వృత్తిని భక్తితత్త్వమున్
చూడరు తప్పు చెప్పరు విశుద్ధ విచారులు జ్యోతిషమ్మునన్ 29

ఉ. అమ్మరు గొప్పలాభముల కమ్మరు పుచ్చిన నాసివస్తువుల్
నమ్మిన వారికెల్లరికి నాణ్యత కల్గిన మేటి వస్తువుల్
నమ్మిక నమ్ముచుందురు వినమ్రత **వైశ్యకులేశు**లప్పురిన్
తిమ్మిని బమ్మిచేయరు వినీతి విధానమె వారి భాగ్యమౌ! 30

ఉ. రాజ్యము లంతరించినను **రాజుల** వంశములుండె వారిదౌ
భోజ్యపు భోగముల్ సమసి భోజన శాలలు దివ్యధామముల్
పూజ్యము లాయెసంపదలు పోయెను ద్రొక్కె మరొక్క మార్గమున్
రాజ్యము గోలుపోయినను భ్రాంతి తథాగతి నుండె వారికిన్ 31

తే.గీ. **కులము వృత్తులు** వీడక తలపు చెడక
ధనము వచ్చిన రాకున్న దైన్యపడక
జనుల తలలోని నాలుకై మనెడువారు
కలరు ధర్మార్థ భావ సంకలితులచట. 32

వ. ఆరోజులలో కృష్ణవేణీ నదీ మహాపుష్కరములు రాగా. 33

వేంగి ప్రజలు కృష్ణవేణీ పుష్కరములకరుగుట

ఉ. వేంగిజనావళుల్ గలిసి వేడుక మీరగ నెడ్లబండ్లపై
పొంగిన భక్తితోడ మరి పూనిరి పుష్కర మందుస్నానమున్
చెంగట ఘట్టముల్ దిగిరి, చేరిరి దాపున దుర్గకొండకున్

అంగడి బొమ్మలన్ గొనుచు నందరు సాగిరి దర్శనానికిన్ 34

తే.గీ. పసుపు మెట్లకు బూసి సద్భక్తి తోడ
మెట్టు మెట్టుకు కుంకుమ బొట్టు పెట్టి
అమ్మవారిని దర్శించి ఐదువలకు
వాయనములిచ్చి మ్రొక్కిరి వనితలలరి. 35

కనకదుర్గ గుడిలో ధర్మపాలుడను తప్పిపోయిన బాలుడు దొరకుట

తే.గీ. పాద రక్షలు దాచు ప్రాంతమ్ము చెంత
బావురనుచు నేడ్చుచునుండె బాలుడొకడు
తల్లిదండ్రుల గానక తల్లడిల్ల
నరసి వేంగి ప్రజావళి దరికినేగి 36

తే.గీ. "ఎవరు నీవారు చెప్పుమ? యేడుపాపి"
"తెలియదేమియు నాకని" తిరిగి యేడ్చె
మూడు గంటల కాలమ్ము ముగిసె నటుల
దేవులాడిరి జనులెల్ల దేవళమున 37

ఆ.వె. ధర్మపాలుడనుచు తనపేరు మాత్రమే
ఎనిమిదేళ్ళ బాలు డెరుగజేసె
మైకులోన పేరు మరి మరి చెప్పించె
జాడ తెలియరాదు ఝాముదాటె 38

ధర్మపాలుని వేంగిపురమునకు తీసుకొని వెళ్ళుట

ఆ.వె. వేంగి పెద్ద దిక్కు వీరయ్య దొర చూచి
మనమె పెంచుటెంతొ మంచిదనియె
బాబు నెత్తుకొనిరి బాటను బట్టిరి
ఎద్దు మువ్వ మ్రోగ నేడుపాగె 39

తే.గీ. పిల్ల పాపలు లేనట్టి పేద దాది
సాక సాగెను బాలుని చక్కగాను
మంచి బుద్ధులు నేర్పించె, మమత బంచె
వేంగి సీమకు ఆమె ఓ వెలుగునింపె 40

ఆ.వె. చదువ బడియు లేక చాకలి పద్దుకే
చదువు ముగిసి పోయె సాగ కుండ
మంది మనసు గెలిచె మంచిగ నచ్చుట
అన్నిపనుల యందు అంది వచ్చె 41

తే.గీ. ధర్మపాలుని సుగుణ సంపదను జూచి
దొడ్డ వాడని మెచ్చిరి తోటి జనులు
సెంటు భూమియు లేకున్న చెనటి వయసు
దానితో బాటు కాంక్షలు దాగునెట్లు? 42

ఆ.వె. వయసు మీద పడగ వరుసగ జబ్బులన్
నడుము వంగె నంత నలిగె నొడలు
దగ్గి దగ్గి దాది ధరణిని వీడంగ
చేయ దగిన కర్మ చేసినాడు 43

ధర్మపాలుని యౌవనమున పల్లెలోని బాలికలు మరులు గొనుట

ఉ. కోడెవయస్సు కోరికలగూడని పెద్దలు చెప్పుచుందురా
కోడె వయస్సు ధర్మునికి కోరిక లీరిక లెత్తుతోడుతన్
పోడిమి చూపె మీసముల పొందిక యౌవన శోభచాటె పూ
బోడుల చూపులందు బడి మోహము తాపము రేపె మెల్లగన్ 44

ఉ. కాముని రూపసంపదను గైకొనియట్లె జయంతు నందమున్
సోముని సత్కళారుచిని చుక్కల కాంతిని తోడుజేసి య
య్యామిని నేలు వాని సొబగంతయు ముద్దగజేసి ధాత యీ
భూమికి "ధర్మపాల" వరమూర్తిగ సృష్టి ని జేసె నేర్పునన్ 45

తే.గీ. వాని కుర్రమీసాలకు, వాని కొంటె
చూపులకు, వాని చిరునవ్వు సోకులకును,
వాని మధుర భాషణముల, వాని రూప
మునకు, మోహమందని యట్టి ముదిత లేదు 46

ఆ.వె. వాని చూపు కొరకు బ్రతికెడు వనితలు,
వాని చూపు కొరకు బ్రతుకు యువతు
లెందరో గలరట, స్వేచ్ఛాను వర్తన
కేళికైన, పెళ్ళి తాళికైన 47

కం. ఏ యింటి కన్నె ధీరత
నాయింటి జనాళితోడ నెగ్గున్ సిగ్గున్
దాయక ప్రక్కల జూచుచు
తీయగ తన వాంఛితమ్ము తెలుపగ వారల్ 48

కులగోత్రములు లేని ధర్మపాలునికి ఊరిపెద్దలు అన్నపూర్ణతో వివాహము గావించుట

చం. తనయల రాగభావమును తన్మయతన్ గమనించి వారు ధ
ర్మని కులగోత్రముల్ బ్రతుకు పోడిమి ధీగణి యిద్ది మే
ల్పని యెటుతాను బందుగుల పంచన చుల్కన కామె? వద్దు వీ
ని నియతి పెండ్లియాడుటని నీళ్ళను జల్లిరి యాశపై. 49

ఉ. పెద్దలు రచ్చబండ జని పేదగు కొమ్మను భార్యజేయగన్
సిద్ధము జేసిరొక్కరిని శీఘ్రమె జేయగ పెండ్లి వానికిన్
ముద్దుగ బెంచగా తనయ మోహము పేరిట జాతిమారకన్
సద్దును జేయకన్ బిలిచి సంగతి దెల్పిరి ధర్మపాలుకున్ 50

ఆ.వె. అన్నపూర్ణ యనెడి యందాల భరిణెను
కట్ట బెట్టిరంత గుట్టుగాను
ఆపె సుగుణ శీలి యాదర్శ మహిళంచు
వేంగి వాడ యంత విశద మాయె 51

ధర్మపాలుడు భార్య అన్నపూర్ణతో కలిసి పుణ్యక్షేత్రములకు జనుట

వ. ధర్మపాలుడామెను గొని సమీప పుణ్యక్షేత్రములకు జనియె. 52

ఉ. చేరిరి వేంకటేశ్వరుని చిత్తము నందున కోటికోర్కెలన్
దారిన కాళహస్తిదిగ దక్కెను వారికి రాహుపూజలున్
తీరుగ కాణిపాకమున దిక్కని మ్రొక్కిరి విఘ్ననాయకున్
కోరిరి వంశ పుత్రకుని కోవిదునిమ్మని భక్తిభావనన్ 53

ఉ. ఎవ్వనికేది యీయవలె నెట్టుల నీయవలెన్ ఫలమ్ములా
ముువ్వురు వేల్పులా తరుణమున్ గమనించుచు నిచ్చుచుందురా
ముువ్వురి వేల్పులాత్మ కడు మోదము జెందెను వీరిభక్తికిన్
నెవ్వగ తీర్పనెంచిరి వినీత సుబుద్ధి నొకింత నేర్పునన్ 54

కాణిపాక క్షేత్రమున జరిగిన దైవ సంఘటన

మం.ద్వి. కాణిపాక క్షేత్ర గణపతిన్ జూచి
వివిధార్చనలతోడ వేల్పును గొలిచి
పూనిన భక్తితో పూజ్యభావాన
గోవులం పూజించి గుడి చుట్టు తిరిగి
ఒక చెట్టు నీడలో నొదిగి కూర్చుండ
ధర్మ పాలుని వాని దార నమ్రతను
గుడికి వచ్చిన భక్తకోటి దర్శించి
ఆదర్శ దంపతులనురాగ భరిత
జీవనులంచు సచ్చిత్తాన దలచి
కైమోడ్పు లిడుచుండ క్రమ భావాన
వారునున్ వందించి భగవంతునాత్మ
సంధాన మొనరించి సన్నుతుల్ సేయ
సమయాన నెటునుండొ సామజమ్మొకటి
గబగబా నటువచ్చి గణపతింజూచి
ఘీంకార మొనరించి కెరలి యిటు వచ్చి
ధర్మపాలుని జూచి తలయూచి తనిసి
చెట్టు కొమ్మను పూల చెండుతోబాటు
త్రుంచి వారల యొడినుంచి తొండమున
వరమిచ్చినట్లుగా వారి శిరమ్ము
తాకించె తొండమ్ము దైవలీలగను
ముందుకాళ్ళను ఎత్తి మోకరిల్లంగ
ఆ వింత కందరు నాశ్చర్య పడిరి

మ.	కలయా! వైష్ణవ మాయయా! విబుధ సంకల్పార్ధ భావమ్మ! అ
ట్టుల మాతంగము వచ్చుటేమి? సుమమిట్టుల్ పంచి, శీర్షమ్ములన్
లలి తొండమ్మున తాకుటేమి? యనుచున్ భక్తుల్ నుతుల్ సల్ప వా
రలు సత్పూత మనమ్మునన్ గణపతిన్ శ్రద్ధావిధిన్ గొల్చుచున్ 56

తగణదండకము. శ్రీపార్వతీ శంకరాత్మీయ పుత్రా! లసత్ సూర్య చంద్రాను రూపాభి
శోభాది దిగ్మండలవ్యాప్త పర్యాప్త నేత్రా! బృహద్ధీ గురుత్వార్థ విద్వాంస
పాండిత్య సుశ్లోక సంస్తుత్య పాత్రా! స్ఫురత్ దివ్య గాత్రా! పవిత్రార్థ
కార్యాధిభూతా! నమో విఘ్న రాజా! నమస్తే నమస్తే నమ:
57

కం.	అని విప్రుల నుతియించెడి
గణపతి దండకము వినుచు గణనాథునెదన్
కొనియాడుచు తనకాంతను
వనజముఖిన్ గాంచె ధర్మపాలుడెలమిన్ 58

ఆ.వె.	మగని చూపులోని మర్మమ్ము గుర్తించి
మొలక నగవు లొలుక పొలతి మిన్న
తనదు భాగ్య గరిమ తలపోసి సంతృప్తి
భర్తృ పదములంటె భక్తి మెరయ 59

ఆశ్వాసాంత పద్యము

భు.ప్ర.	సరోజాక్ష! సంగీత సాహిత్య వాజ్మా!
ధురీ పానలోలా! హితోర్వీ నృపాలా!
కరీంద్రార్తి దూరా! సుకర్మాధికారీ!
హరీ! భక్త రక్షా క్రియానంద మూర్తీ! 60
(య,య,య,య యతి 1-8 - అప్పకవీయం - క్ర.సంఖ్య - 84)

ఆశ్వాసాంత గద్యము: ఇది శ్రీవాధూలస గోత్ర పవిత్ర టేకుమళ్ళ హనుమాయమ్మా సుబ్రహ్మణ్యాఖ్య చతుర్థ పుత్ర, సహృదయ, కవిమిత్ర, శ్రీ పరమాత్మ గురు కటాక్ష వీక్షణా లబ్ధ సారస్వతమర్మ వేంకటప్పయ్యశర్మ ప్రణీతంబైన ధర్మదత్తోదయంబను ప్రబంధంబునం ప్రథమాశ్వాసంబు సమాప్తము.

❊ ❊ ❊

ద్వితీయాశ్వాసము

కం. శ్రీరామా! జనపాలక!
కారుణ్యామృత రసార్ద్ర కమనీయ గుణా!
మేరువు తీరుగ నీదయ
కోరుచునుంటిని శుభముల గూర్చుము దేవా! 1

వ. ఒకనాటి తెల్లవారుఝామున ధర్మపాలునికి బందరు పాండురంగ
స్వామి స్వప్నంలో సాక్షాత్కరించగా. 2

ధర్మపాలుడు బందరు పాండురంగ క్షేత్రమునకు జనుట

తే.గీ. పాండురంగని కోవెల పరమ భక్తి
చేరి పూజాసమర్చనల్ చేసి వారు
గొప్ప గుణములు కలిగిన కొడుకు నిమ్మ
టంచు ప్రార్థనల్ సల్పిరి యమిత భక్తి 3

తే.గీ. గిల్టు నగలకు ఘనమగు కేంద్రమనుచు
ధనము చాలక కొనుటకు దడిసి వార
లన్ని యంగళ్ళ తిరుగుచు నలసి పోయి
ముక్కు పుడకలు కొనినంత మురిసిపోయె 4

బందరు పట్టణమందలి సముద్ర తీరమునకు జనుట

ఉ. సాగర శోభలన్ గనగ సంతస మౌనని చెప్పగా జనుల్
సాగిరి దంపతుల్ జరుగు సందడి జూడగ సంధ్యవేళకున్
మూగిరి గొప్పగా జనులు ముచ్చటలాడుచు తీరమందునన్
దాగని కాంక్షలన్ దడిసె దంపతులప్పుడు తీపిభావనల్ 5

సాగర వర్ణన

మ. ఘనకల్లోల తరంగ భంగములతో – గర్జోరు నాదాలతో
మునుకల్వేయుచు పైకిలేచి బలిమిన్– మొప్పల్ త్రుటిన్నోర్చి వే
మునుకల్వేసెడు మీన సంతతులతో బొంగారు ఫేనమ్ముతో
ఫణిరాడ్భూషణుడైన రుద్రుగతి విభ్రాజిల్లు నా తోయధిన్ 6

ఉ. భీకర శబ్దఘోషణల భీషణరూపము గాంచి నిల్వగా
పోకిరి పిల్లలాదరిని పూనిరి గొప్పగ నీదులాడుచున్
తోకలు లేనికోతులుగ తోచిన రీతిగ ఈతలాడుచున్
కేకలు వేయుచున్ మిగుల కేళిగ నాడుచు ముప్పుదల్చకన్ 7

సముద్ర విహారములో పిల్లవాడు అలలలో జిక్కుకొనుట

తే.గీ. అంతకంతకు నేపుగా నలలు పెరిగి
తాళ వృక్షపు టెత్తును దాట సాగె
భయము జెందిన పిల్లలు బయటబడగ
అర్భకుడొకండు విధిలీల నందు జిక్కె 8

ఉ. చేతుల నూపుచు న్నరచి చెంతకు రమ్మని సైగచేయుచున్
ఊతము నీయగా పిలిచె నూపిరి యాడక నీటమున్గుచున్
భీతిలి తల్లిదండ్రులును బిగ్గర గానెలుగెత్తి యేడ్చుచున్
మాతలరాత మార్చుమని మాతకు మ్రొక్కిరి దీన చిత్తులై 9

అన్నపూర్ణ ధర్మపాలుని పిల్లవానిని రక్షింపమని కోరుట

వ. ధర్మపాలుడది గాంచి దిక్కుదోచక యుండగా భార్య యిట్లనెను 10

ఉ. ఈతల యందుసాటియని యెల్లరు గుండెలు తట్టి పల్కిరే
మాతకు శోకమార్పుమిక మౌనము వీడుము కార్యశీలివై
నాతరమౌ నొకో యనుచు నాన్చగ రాదుగ యిట్టివేళలన్
భూతలమందునన్ జనుల పూనిక గాచెడి వాడె దేవుడౌ! 11

కం. అమ్మను నమ్ముడు శుభమగు!
లెమ్మిక కాపాడబూనరే! జాగేలా?
పొమ్మిక బాలుని తెమ్మిక
నమ్మిక యుండంగ వలయు నారాయణిపై 12

ఉ. మంగళ సూత్రమున్ తడిమి మాతను వేడెను మౌనమూని భ
ర్తం గనె ధర్మపాలుడు స్వధర్మ విధిందలపోసి ధీరతన్
చెంగున వార్ధిదూకి వెస జేరెను తీరము పిల్లవానితో
మ్రింగిన నీరు వెల్వడగ మెల్లగ బొట్టను నొక్కె వేగమే. 13

తే.గీ. తల్లిదండ్రులు ఏడ్చుచు దండమిడుచు
వేయి విధముల, బొగడుచు వెడల వారు
అన్నపూర్ణను గాంచగ నభయ మిచ్చు
గౌరి రూపున తలపించె కనులకపుడు 14

వేంగిపురమున మద్యమమ్ముటకు పాకలు వేయుట

వ.   ఇట్లుండ ఆ దినములలో నొకనాడు   15

తే.గీ.   రండు! రారండు! జనులార! రక్తి శక్తి
సుఖము సంతోష మిడునట్టి సురను గ్రోల
ననుచు సురనమ్ము వారలు పుణికి పుణికి
వాడ వాడల నరచుచు పలికిరిట్లు   16

కం.   సురలసురులు వారి స
ద్గురువులు–నేతలు–సచివులు–గొనకొని తృప్తిన్
సురద్రాగి రతుల దేలిరి
తరుణుల మెప్పులను గొనిరి – తనసిరి సురచే   17

మ.ద్వి.   అనుచు సురను గూర్చి యనువగు రీతి
పరమ బోధ సలుపు వారి వెన్వెనుక
పరుగులెత్తు జనుల హరుసమ్ము జూచి
మురిసిరి సురనమ్ము నరులు లోలోన   18

ఉ.   వేంగి శివార్లలోనొకడు వేసెను పాకలు మద్యమమ్మగన్
చొంగలు గార్చి పూరుషులు చొక్కిరి బానిసలైరి దానికిన్,
భంగము నాయె సర్వమని భార్యలు శోకపయోనిధి మున్గి, యె
బ్భంగి దరింపనోపుదుమె పాడు సురాబ్దిని మున్గ భర్తలన్!   19

అన్నపూర్ణ మద్యమమ్ము విషయమున విషాదము ప్రకటించుట

వ. పడతులటులింటింటికీ కరపత్రములు పంచి, ఆ సాయంత్రవేళన
ధర్మపాలుని భార్య అన్నపూర్ణతో గలిసి రచ్చబండ వద్ద విచారణ
జరిపింపగా... 20

ఉ. భారతజాతి నాశనము భాగవతమ్మున జెప్పె వ్యాసుడున్
మారణ హోమహేతువుల మద్యమె నిల్చెడు దానిముందు నే
కారణ మెర్గియున్ జనులు కాంక్షల వీడరదేమి చోద్యమో
వేరొక యోచనల్ గనక వేగమె నాపరె వేంగి బాగుకై 21

ఉ. శాసన సభ్యుడే యిటులశాంతికి కారణమన్న వార్తతో
మోసపు చర్యలన్నిలుచు మూర?పు మూర్తిని దల్చిబాధతో
మేసిన సొమ్ము చాలకయె మీరిన యాశకు విస్తుబోవుచున్
వేసిరి కేకలన్ సతులు వేదన గద్గద ఖిన్నకంఠులై. 22

ఉ. పెద్దలు గొప్పగన్ మనుచు పేదల కష్టము కొల్లగొట్టుచున్
సుద్దులు సెప్పువారలకు సోకునె? పేదల ఈతిబాధలున్
మిద్దెల మేడలన్నిలిపి మ్రింగుటె ధ్యేయము నంచునిల్చినన్
గద్దెను దింపగా వలయు గార్దభ నేతల సత్వరంబునన్ 23

అన్నపూర్ణను వేంగివాడలో నాయకురాలిగా ప్రకటించుట

వ. అవ్విధంబున దలంచి స్త్రీలకు అన్నపూర్ణను వేంగివాడలో
నాయకురాలిగా ప్రకటించి 24

ఉ. వాడల వాడలన్ దిరిగి వంచన తీరుల నెండగట్టుచున్
కూడిరి యొక్కమాటగను కోమలులందరు వేంగి ప్రోలునన్
వేడిరి నాయకామణుల వేదన దీర్చగ రోదనమ్ముతో
పాడిరి పాటలన్ జనుల బాగును గోరుచు పల్లెపల్లెలన్ 25

ఉ. చేరిరి రాజధానికిని చెప్పిరి సర్వము నేతనేతకున్
కోరిరి కల్లుపాకలను కూల్చగ శాసన సభ్యులందరన్
చేరిరి ముఖ్యమంత్రికడ చేసిరి చర్చలు వచ్చె దీర్పిటుల్
భారము నార్థికస్థితికి పాలనమేగతి జేయగావలెన్ 26

ముఖ్యమంత్రి మద్యపాన నిషేధము ప్రకటించుట

వ. ముఖ్యమంత్రి వారికినిట్లు జెప్ప దొడంగెను 27

తే.గీ. నేత జనులకు సౌఖ్య విభూతి గూర్చి
వారి రక్షణకై పాటు పడగ వలయు
ధనమె ముఖ్యమ్ము గారాదు ధరణియందు
పొదుపు పాటింప సరియౌను పూడు లోటు. 28

తే.గీ. సుదతి మాటకు విలువిచ్చి సుఖము నెంచి
మద్యపాన నిషేధమే మంచి దనుచు
ఆజ్ఞ నిచ్చెను సత్వర మమలు జరుప
వనితలానంద మెల్ల నంబరము దాకె 29

అన్నపూర్ణ గర్భవతియగుట

తే.గీ. అలసి సొలసిన దేహాన యన్నపూర్ణ
పల్లె జేరెను సంతోష పర్వ మనుచు
గడప లోనను నడుగిడ కళ్ళు తిరిగి
వ్రాలె పెనిమిటి భుజముల వాకిలందె 30

వ. అంత ధర్మపాలుండు మిక్కిలి ఆవేదనా పరుండై 31

తే.గీ. పల్లెవైద్యుని బిలిపించె భయము నిండ
నాడి బట్టిన నిమిషమే నవ్వి తాను
నెలను దప్పిన విషయంబు నెఱుక పరచె
సంతసముపండ వెలుగుల కాంతి నిండ 32

ఆ.వె. గర్భవతిగ దాను గండమ్ములనుదాటె
బిడ్డ మేలు కొరకు వెతను మోసె
చిక్కి శల్యమాయె చీకాకు లెక్కువై
నెలలు నిండె నంత నెలతకపుడు 33

అన్నపూర్ణ ధర్మదత్తుని ప్రసవించుట

ఆ.వె. వైద్య శాలలు లేనట్టి వాడ వేంగి
మంత్రసానియె పని మంతురాలు
ఐదువంద లీయ నడుగిడె నింటికి
కాసునందె జగతి యూసులాడు 34

ఆ.వె. మంత్రసాని చమురు, మారేడు తెప్పించి
పూర్ణ చెంత జేరి పొలుపు గాను
చమురుపూసి బిడ్డ సాగంగ దువ్వుచు
కాన్పు చేయసాగె గరుణతోడ 35

ఆ.వె. బాష్ప జలము గార్చె భార్య బాధనుగాంచి
పేదతనము దలచి ఖేదమందె
దబ్బ పండు వంటి తనయుండు జన్మించ
ఘనము దల్చి వారు గర్వపడిరి 36

తే.గీ. శుభ సమయము గ్రహగతి శుభమటంచు
భోగ భాగ్యాల తులతూగు బిడ్డడనుచు
విప్ర వర్యులు పంచాంగ వప్రమరసి
నొక్కి పలుకంగ దంపతుల్ మ్రొక్కులిడిరి 37

ధర్మదత్తుడు మహాపురుషుడగునని వేదవేత్తలు బల్కుట

ఆ.వె. ప్రజల మేలు దలుచు పరిపూర్ణుడగునని
వేద పండితుండు విశదపరచ
ఊరు సంతసించె నుప్పొంగె నెంతయో
జనగణాళి జగతి మనసు విరిసె 38

తే.గీ. బాలసారెను జరిపించె పల్లెయందు
ధర్మ పాలుని రూపును దాల్చి నట్టి
సుతుని యందమ్ము శ్లాఘించి శుభము లరయ
"ధర్మదత్తుండ" నెడిపేరు పేర్మి నిడియె 39

ధర్మదత్తుడు భారసాల సమయమున ఈశ్వర వరప్రసాదియని బల్కుట

ఉ. వీనుల విందుగా నపుడు వెల్వడె నచ్చట శంఖనాదమున్
దానికి భక్తితో జనులు దండముపెట్టిరి శంకరాయనిన్
కానగ నెవ్వరున్ గనుల కన్పడ కుండుట గొప్ప వింతయౌ
దానిని దైవలీలయని దల్చిరి వేంగిని పల్లెవాసులున్ 40





సీ. శ్రీపార్వతీ పతీ! శ్రీజగద్రక్షకా!
శ్రీచంద్రశేఖరా! చిద్విలాస!
కోపానలాంబకా! గురులింగ రూపకా!
గుణ గాన తోషకా! క్షోభ భంగ!
శ్రీపార్థ పూజితా! శ్రీలోక నాయకా!
శ్రీరామ సేవితా! చిత్తవాస!
మాపాలి దేవరా! మాపాలి శంకరా!
మాంపాహి! మాంపాహి! మౌని వినుత!

తే.గీ. మమ్ము చూడంగ వచ్చితే మాన్యదివ్య
రూపమెత్తుచు కృపతోడ రుద్ర! భద్ర!
నీలకంఠ నమామి! మమ్మేలు కొనుమ!
నీదు దాసాది దాసులనాదుకొనుము. 42

తే.గీ. అనుచు ప్రార్థించు ధర్మపాలుని మొగమ్ము
మందహాసాంబుజాత మరంద బిందు
శీకరావృతనేత్ర వశీకరణ ద
యార్ద్ర వీక్షణమ్ములగొని హర్షమ్ము గొని 43

తే.గీ. ధర్మదత్తుని గనుచు సద్ధర్మరతుడు
సత్య వాక్పాలకుండు సౌజన్య శీలి
నవసమాజ నిర్మాణ నిర్ణాయకుండు
జనన మందెను యనిపల్కె ఫణిధరుండు 44

తే.గీ. అటులదృశ్య రూపమ్మున హరుడు మధుర
భాషణమ్ములు వచియించి బాలునెడద
కెత్తుకొని హత్తుకొని సేసలిడుచు శిరము
నిమురుచున్ తల్లి దరిజేర్చి నెనరు జూపి. 45

వ. అదృశ్య రూపుధరుడైన శంకరుని పలుకులాలించిన
పల్లెవాసులందరు సాక్షాత్ శంకరవర ప్రసాదియని భావించిరి. 46

ధర్మదత్తుని శైశవ దశ

ఉ. అందరి బిడ్డగా దలచి యాటల పాటల బెంచుచుండగన్
సుందర రూపునిన్గనగ సోకును దిష్టని దల్చివేదనన్
పొందిక దిష్టి దీయకను పోరడినీయదె, అందరందరున్
చందురుడంచుచున్ బొగడ చక్కగ నవ్వును ధర్మదత్తుడున్ 47

ఉ. బాలుని యందచందములు బాగని మెచ్చిరి వేంగియంతటన్
మేలిమి పైడియన్నటుల మెత్తని బుగ్గల ముద్దులాడుచున్
మాలిమి యయ్యెనందరికిం మామలె యత్తలె యెల్లవారలున్
పాలను స్తన్యమీయనని పల్కెడు తల్లిని గానమచ్చటన్ 48

తే.గీ. బోర్ల పడగాను పోసిరి భోగి పండ్లు
పాకినంతనె పెట్టిరి పాయసమ్ము
దత్తు మోకాళ్ళ దోగాడ నెత్తుకొనుచు
అడుగు లేయగ మురిసిరి యచటి జనులు 49

ఉ. కాలము రివ్వునన్ దిరిగె కానగ వేంగిన మార్పులేదులే!
బాలల పాఠశాలలును ప్రాణము నిల్పెడి వైద్యశాలయున్
మేలగు కార్యసాధనలు మేకొని చేయరు నాయకోత్తముల్
వాలుగ విత్తముంగొనెడు ప్రాభవ నైపుణి వారినైజమౌ! 50

ధర్మదత్తుని విద్యాభ్యాసము

శా. వేదాభ్యాసమె నిత్యవృత్తిగ, సదా వేదాంత శాస్త్రార్థముల్
వాదార్థోపదగా, గృహస్థ విధులే రమ్యైక భాగ్యాలుగా
బోధాద్యాయమె దైవ సత్క్రియగ సమ్మోదమ్ముతో నెంచు భా
వోదారుల్ విధివంశజుల్ గలరు సత్యోపాసకప్రోన్నతుల్ 51

ఉ. వేరొక దారిలేదనుచు విప్రుల సన్నిధినుంచె పుత్రునిన్
వారును ధర్మదత్తునికి వైదిక విద్యలు శాస్త్ర విద్యలున్
గూరిమి నేర్ప దత్తుడు నకుందిత విలాస వైఖరిన్
నేరిచె నొక్కపెట్టున వినీతులదే కద వేదసంపదల్ 52

ఆ.వె. రాగ విద్యలివ్వి రాజలాంఛనునకు
సత్య ధర్మ నీతి సంగతమ్ము
వేదశాస్త్ర చయము వినయ స్వభావమ్ము
స్వార్థ రహిత బుద్ధి భద్రవాక్కు! 53

ఆ.వె. విప్రవర్యుల నుండి వేదమ్ము నేర్చెను
మల్లుర దరి నేర్చె మల్లవిద్య
రామకథలు జదివి రాగాత్ముడయ్యెను
భారతమ్ము జదివి వీరుడయ్యె 54

చంద్రవర్త్మ వృత్తము:
ధర్మశాస్త్ర విధి తత్త్వము నేర్చెన్
కర్మకాండ విధి కర్మలు నేర్చెన్
మర్మభావ గత మార్గము తోడన్
ధర్మదత్తుడొక జ్ఞానిగ దోచెన్ 55
(ర,న,భ,య 1-7 యతి, ప్రాస ఉన్నది - అప్పకవీయము - క్రమ సంఖ్య 96)

తే.గీ. కూలి నాలిని జేయుచు కూడు తినుచు
దినము గడిపెడి బ్రతుకులు తెలియు మీకు
ధనము గలిగిన వారికే ధరణి విద్య
కష్ట నష్టాల నలుగుటె కర్షకుండు 56

వ. అని బదులిచ్చిన ధర్మపాలుని అనునయించి యూరివారలు
శంకరుని భాషణమ్ములను, ధర్మదత్తుని విద్యావైదుష్యమును
వివరించి. 57

మౌక్తికమాల వృత్తము:

శంకరుడే తాను స్వయముగా ని
శ్శంకత తెల్పెన్ సుజనహితుండున్
బొంకని వాడున్ బ్రణుత గుణుండున్
పొంకముగా నింట బొలుచునంచున్ 58

(భ,త,న,గ,గ 1–7 యతి, ప్రాస యున్నది – అప్పకవీయము క్రమ సంఖ్య 77)

కం. కొమరుని విద్యాబుద్ధులు
కొమరుని సాధుత్వ బుద్ధి, కొమరుని నీతిన్
గమనించి తల్లిదండ్రులు
తమమనసుల హాయిగొనిరి దైవబలమిదే! 59

అన్నపూర్ణ వడదెబ్బకు అస్వస్థతయై మరణించుట

తే.గీ. కాలమొకరీతి గడవదు గణన సేయ
దాని ధర్మమ్ము దానిదే తత్త్వమిదియె
దినము వారాలు ఋతువులు తిరుగునట్లు
దేహతత్త్వమ్ము గ్రహగతి తిరుగుచుండు 60

మ. చటులోద్యత్ ఖచరోగ్రమండల బృహత్సామ్రాజ్య భోగీంద్ర ధృత్
నిటలాక్షేక్షణ భీమ వహ్ని విశిఖా దేదీప్య భానుప్రభల్
జటిలంబై వసుధాంతరస్థితి జలోల్లాసమ్ము నుష్ణోగ్ర సం
కట సతప్తము చేయ ప్రాణిచయముల్ గాసిల్లె దాహార్తతన్ 61

తే.గీ. పంట పొలములు పడినట్టి పరిగ గింజ
లను వడిగ దెచ్చి వండి ముద్ద లగను జేయ
దలచి అన్నపూర్ణ వెడలె ధరణి తీక్ష్ణ
కాంతి లెక్కసేయక పరిగలను వెదుక 62

కం. కలగింపు నెండ తగులము
తలనొప్పిడ జెమట కార్చ దాహము పెంచన్
కలగుండు వడక ధారత
పొలమున పరిగలను పెద్ద మూటగ జేసెన్ 63

ఆ.వె. పాపమామె కపుడు వడదెబ్బ తగులంగ
తూలిపోయి నేల గూలబడియె
పల్లె వెజ్జు వచ్చె వైద్యమ్ము చేయంగ
నాల్క జూచె చేయి నాడి జూచె 64

తే.గీ. పిచ్చి చూపులు జూచుచు పిలుపులేక
అన్నపూర్ణమ్మ భర్తను ననుగు సుతుని
చుట్టు నున్నట్టి మిత్రుల చుట్టములను
వారి వీరిని జూచి కన్నీరు విడిచి 65

తే.గీ. చేతులూపుచు మ్రొక్కుచు శివుడు పిలిచె
నన్ను ననుచు చేతుల సైగ విన్నవించి
పోవుచుంటిని సుఖముగ దేవు నరయ
సెలవు సెలవంచు మలిమ్రొక్కు చేసెనపుడు 66

ఉ. ఉన్నత శీలమున్ దలచి యూపిరి యాగిన పల్లెకాంతలున్
మన్నన లందుచున్ మహిళ మంచికి తోడ్పడు బుద్ధిదల్చుచున్
పిన్నిగ దల్చిపిల్చితిమి పేర్మిగ నుంటిమి యింతకాలమున్
దన్నును కొలుపోతిమని దైన్యము నందిరి యంగనామణుల్ 67

తే.గీ. కన్న తల్లికి బట్టిన కర్మ గాంచి
ధర్మ దత్తుడు విలపించె తలచి తలచి
కర్మ కాండలు సలుపంగ కాసులేదు
జనుల సాయంబు తోడుత జరిగె తంతు. 68

ఉ. తిండిని ముట్టకన్ దిరుగు తీరుకు జేరెను ధర్మపాలుడున్
బండగ మారెనాతడును భగ్గున మండిన బాధతోడుగన్
గుండెల యందునన్నిలిచి గూడును గట్టిన భార్యవీడగన్
పుండగు మేని యేరికిని బూనగ నింకను మానదెన్నడున్! 69

అన్నపూర్ణ చితాభస్మమును గంగలో కలుపుట

వ. కర్మకాండల యనంతరము విప్రుండు అన్నపూర్ణ చితాభస్మమును,
శల్యములను జూపి 70

చం. సుగతికి అన్నపూర్ణ జను సుస్వరమున్ బలుకంగ దీవెనన్,
తగిన విధంబు దెల్పగను తప్పక యంచును వారలిద్దరున్
దిగులును మ్రింగి సాగిరి నదీతటముల్దిరుగాడి రంతటన్
మిగిలిన సొమ్ముతో జనిరి మీరిన శ్రద్ధగ వారణాసికిన్ 71

వ. కాశీ క్షేత్రముంజేరి ధర్మపాలుడిట్లు విలపించసాగెను 72

తే.గీ. గంగ తీరంబు జేరిరి కనుల నీట
అన్న పూర్ణగ పేరున్న అమ్మ నీవు!
మాకు తోడును విడదీయ మర్మమేమి?
జీవితంబులు మోడయె చినిగె బ్రతుకు 73

తే.గీ. ధర్మదత్తుడు ధరణిని తల్లి లేక
బతుకు నీడ్చెడి కర్మంబు బాధ గాదె!
వాని లాలన పాలన వైన మేమి?
దిక్కు దూరము జేసిన దేవుడనుచు 74

ఉ. కన్నుల వెల్లువై నుబికె గాల్వలు గట్టెను బాష్పమంతటన్
పెన్నిధి గోలుపోతిమని పెద్దగ నేడ్చిరి గంగసాక్షిగా
సన్నని రోదనల్ చెలగ శల్యములన్ బసుమమ్ము గంగలో
తిన్నగ భక్తిమై కలిపి దీనత శంకరు జూడ వెళ్ళగన్ 75

వ. అనంతరము విశ్వేశ్వరుని దర్శించి ధర్మపాలుండు తన పుత్ర
సహితుడై తన యూరికి బయనమయ్యెను. 76

ఆశ్వాసాంత పద్యములు

కం. హరునకు భవహరునకు కుం
జరవర వాంఛానుమేయ చర్మధరునకున్
వరదునకున్ భక్తి వశం
కరునకు శంకరునకు శుభకరునకు జేజే! 77

కం. కాశీ విశ్వేశ్వరునకు
శ్రీశైల పురాధివాయులింగ ధరునకున్
శ్రీశైల రాజతనయా
వైశిష్ట్య మనోధిరాజ్య పాలకు జేజే! 78

ఆశ్వాసాంత గద్యము: ఇది శ్రీవాధూలస గోత్రపవిత్ర టేకుమళ్ళ హనుమాయమ్మా సుబ్రహ్మణ్యాఖ్య చతుర్థ పుత్ర, సహృదయ, కవిమిత్ర, శ్రీపరమాత్మ గురుకటాక్షవీక్షణాలబ్ధ సారస్వతమర్మ వేంకటప్పయ్యశర్మ ప్రణీతంబైన ధర్మదత్తోదయంబను ప్రబంధంబునం ద్వితీయాశ్వాసంబు సమాప్తము.

❊ ❊ ❊

తృతీయాశ్వాసము

ధర్మదత్తుడు తల్లిని గూర్చి దు:ఖించుట

కం. శ్రీవారణాసి వాసా!
ప్రోవగ వెలసిన శివుడవు పూనిక తోడన్
జీవుల బాధల నెఱిగియు
కావగ లేవా? ప్రజలను కష్టములందున్ 1

ఉ. అమ్మను కోలుపోతినిక నాకలి దీర్చెడి వారలెవ్వరో!
ఇమ్ముగ బుజ్జగించి సహిష్ణుత గూర్చెడి తల్లిలేదయా!
కమ్మని మాటలన్ హృదయ కష్టము మాన్పెడు మాతలేదయా!
నమ్మిన వారకెల్లరకు నష్టము చేయుట పాడిగాదయా! 2

వ. అని తలపోయుచు, మిక్కిలి బాధనొందుచు, ధర్మదత్తుడు నిద్రపట్టక
రాత్రి రైలుబండి యందు పరిపరి విధముల దు:ఖించుచు 3

ఆ.వె. నాన్న పాద మంటి మన్నన నందించి
తప్పు గావు మనుచు రెప్పలార్చి
జీవితమున జనుల జీవిక బాగుకై
గొప్ప వాడి నగుట తప్పదనుచు 4

తే.గీ. పల్లె పట్టుల నుండిన బ్రతుకు లెండు
పరిగ నేరుచు బ్రతికెడి పథము వలదు
గొప్ప వ్యాపార మార్గంబు గోరిద్రొక్క
జీవితంబున సుఖమగు చింత దొలగు 5

ఉ. అర్థము ధర్మ మార్గమున నందగ బూనిన ఉత్తమంబగున్
వ్యర్థపు సంపదల్ మరిగి వ్యాకుల మందగ చిత్తమొప్పునా?
ఆర్థిక బాధలన్ దొలగ నాగునె కోర్కెలు మానవాళికిన్
అర్థము నందగా జనులు వ్యర్థపు బర్వులు సేయ ధర్మమా? 6

నడిరేయి మార్గ మధ్యమున బలార్షాలో రైలుబండి దిగుట

వ. నడిరేయి రైలుబండి బలార్షా స్టేషనులో నాగగా 7

ఆ.వె. బండి దిగెను తాను మండిన గుండెతో
తండ్రి నిదుర నుండ తప్ప కపుడు
కనుల నీరు నిండి కారగ ధారగా
అదుపు జేసి కొనుచు నాతడంత 8

వ. అయ్యర్ధరాత్రంబున స్టేషను నందలి బండలపై నిదురించి,
తెల్లవారగనే బయటకు రాగా ఒక పెద్ద సంత కనిపించెను. 9

ఉ. తెల్లగ తెల్లవారెనట దిక్కులు పిక్కటిలంగ సంభ్రమల్
వెల్లువ పోటునన్ జెలగు రీతిగ వేలము వెట్టికేకలన్
చిల్లువడంగ వీనులటు చెప్పెడి వారల గోలదల్చుచున్
అల్లన వచ్చి నిల్చె మది నచ్చెరువందగ వింతగానగన్ 10

తే.గీ. సంత కేకల వినుచును సందు తిరుగ
కడుపు టాకలి మంటలు ఘనము దోచె
చిల్లి గవ్వయు లేదాయె చేతిలోన
ఆకలేరీతి తీరునో యనుచు నడచి 11

క్షుద్బాధను తీర్చుకొనుటకు సత్రమున కరుగు సమయమున ప్రమాదము జరుగుట

ఆ.వె. సందు మలుపు లోన సత్రంబు గలదని
బాట సారి చెప్ప బయలుదేరె
అంతలోన కారు హతవిధీ! ఆగక
గుద్దు కొనగ పెద్ద సద్దు జేసె! 12

ఆ.వె. కనులు తిరిగి కూల, కారెను ధారలై
రక్తమంత నేల సిక్త మాయె
దిమ్మ తిరిగి పడిన తీరును జూచిన
బండి నడుపు వాని గుండెలదిరె 13

ఉ. మూగిరి రోడ్డుపై జనులు మున్నుగ తప్పును నెట్టి కారుపై
ఆగని గుండె చప్పుడుకు ఆగము జేసెడి వారిగాంచుచున్
దాగెను కారులో నతడు తల్పుల దీయకె నిల్చెనంతటన్
వేగిర పాటుతో నటకు వెన్కనె వచ్చిరి రక్షకాధిపుల్ 14

తే.గీ. అద్ది గద! జనరక్షణార్యవరుల పని!
ఎవరికేదైన జరిగిన నెటుల నున్న
వారి రక్షింప వచ్చెడి ప్రాథమికపు
జర్య దలప వారే సమాజ హితవరులు! 15

ఆ.వె. వారు లేక యున్న ధారుణీ తలమున
శాంతి యేది న్యాయ కాంతి యేది?
కాని, వారి వైపు కారుణ్య భావాన
చూచు ప్రభుత యేది? ప్రోచునేది? 16

కం.	ఉద్యోగ సంఘమందున
ఖద్యోతులు వీరెసుమ్ము కానీ బ్రతుకుల్
చోద్యము జీతము తక్కువ
సాధ్యము గానట్టి పనులు సలుపగ వలయున్ 17

రక్షకభటులు ధర్మదత్తుని వైద్యశాలకు తీసికొని వెళ్ళుట

ఉ.	బాలుని వైద్యశాలకును బ్రాణము నిల్పగ వేగిరమ్ముగన్
తోలిరి మూగియాగినటు త్రోవకు నడ్డగు పాదచారులన్
జాలిదలిర్ప బాలుగని సత్వరమట్టుల వాహనమ్మునన్
వైళమ వానిగొంచుమొగి పర్వులు దీసిరి వెజ్జుజూడగన్ 18

వైద్యుల ఘనతను శ్లాఘించుట

కం.	ధరణిన్ దేవతలెవ్వరు?
పౌరిప్రాణము రక్షణసేయు పూతాత్ములు, సా
ర రసార్ద్ర చిత్తులు సహన
పరులు విబుధ మాన్యులు మన వైద్యులె సుమ్మీ! 19

కం.	ఋణదాత, వైద్య వరుడును
అనువుగ ప్రవహించు నదియు, నవనీసురుడున్
మనియెడు చోట వసించుట
మనుజుని గతజన్మ పుణ్య మహిమయె గాదే! 20

ఆసుపత్రికి గోవింద కర్వాడే యేతెంచి బాలుని ప్రాణములు కాపాడమని ధనమిచ్చుట

ఆ.వె. ఆసుపత్రిలోని ఆఫీసు జనమెల్ల
వచ్చినట్టి వ్యక్తి వంకజూచి
కోట్ల ధనము గలుగు గోవింద కర్వాడే
వచ్చె ననుచు భ్రాంతి పడిరి వారు 21
(కర్వాడే అనునది మహారాష్ట్రలోని ఒక సనాతన బ్రాహ్మణ వంశము)

ఆ.వె. భ్రాంతి కాదతండు భద్ర సంపన్నుండు
తనదు కారు వలన ధరణి బడిన
బాలు గాంచి వాని వైద్యంపు ఖర్చుకై
వచ్చినట్టి సత్య వర్తనుండు. 22

తే.గీ. ముఖ్య వైద్యుండు దిగివచ్చి మోకరిల్లి
కార్యమేమని ప్రార్థించె కరములెత్తి
బాలు గాపాడు బాధ్యత పడయుమనుచు
చెక్కు చేవ్రాలు మాత్రమే చేసి యిచ్చె 23

వ. గోవిందకర్వాడేతో మాప్రాణములొడ్డి కాపాడెదమని చెప్పి సాగనంపి,
ఆ వైద్యుడు తన వారితో 24

ఉ. బాలుని శ్రద్ధగా గనెడు పద్ధతులన్నియు బోధజేయుచున్
కూలును గొప్పపేరు మరి కూడని మందుల నీయరాదయా!
వీలగు మంచిమందులను వెంటనె వాడుడు జాగుచేయకన్
మేలగు వైద్యశాల గని మెత్తురు పెద్దలు సంఘమందునన్. 25

తే.గీ. గంట గంటకు బాలుని గాంచు చుండి
వెంట వెంటనె వైద్యమ్ము వేగ పరచి
బాలు కాపాడి రందరు బాధ్యతెరిగి
కనులు తెరిచిన బాలుని కాంచిరంత. 26

బాలుని స్వస్థత యనంతరము గోవింద కర్వాడే ఆసుపత్రికి వచ్చుట

వ. విషయ మరసిన గోవిందకర్వాడే ఆసుపత్రికి నేతెంచెను. 27

కం. బాలుండు కన్నులు దెరచుచు
వాలుగ నాస్పత్రి వారి పరికింపంగన్
వైళమ గోవిందు దరికి
వాలుచు నీవార్త తెలుప వడి నాతండున్ 28

కం. వడివడి యడుగులు వేయుచు
తడబడుచున్ పరుగులిడుచు తత్తర పడుచున్
కడుకొని బాలుని చూడగ
నెడంద దడదడ వేయ నేతెంచె తృటిన్ 29

ధర్మ దత్తుని సౌందర్యమునకు గోవింద కర్వాడే ముగ్ధుడైన విధానము

ఆ.వె. వాని దేహ పటిమ వాని రూపోన్నతి
వాని ధీర గుణము వాని సౌరు
వాని వినయ భూతి వాని వర్ణచ్ఛాయ
వాని కనుల కాంతి మేను చూచి 30

శా. ఔరా! ధాత్రు వినోదలీల! బురదన్నౌన్నత్య భావస్ఫురత్
సారోదీర్ణ పరీమళాంచిత లసత్పద్మమ్ము బుట్టించు చూ
పారం జేసెడునట్టి లీబుడుత దా బర్యావలోకాన నా
మారున్ గెల్చెడు నందచందముల జన్మంబిచ్చె బేదింటహో! 31

తే.గీ. వీని జూడగ నెమ్మది లోన నేదొ
రాగభావమ్ము పుట్టె! నేప్రాంతమందు
వాసమో? ఇటుకేల దా వచ్చె? నేమి
పనియొ? పేరేమొ? అడిగెద యని తలంచి. 32

వ. అని వాని చెంతకు వెడలి – వానింజూచి 33

ధర్మదత్తుడు తనను గురించి తెలియజేయుట

తే.గీ. "ఎద్ది నీపేరు? తలిదండ్రులెవరు నీకు?"
తెలియ జెప్పుము నాకని పలుక వాడు
"ధర్మ దత్తుండు నా పేరు తల్లిలేదు
వేంగి ప్రాంతంబు నాదని" వివరమిచ్చి 34

చ. చదివితి ధర్మ సూక్ష్మములు చక్కగ వేద పురాణ శాస్త్రముల్
చదివితి మాన్య సత్కథలు సభ్యసమాజము దానిపోకడల్
చదివితి మంచిచెడ్డలు విలాస వినోద విహార సాహితీ
సుధలిడు నవ్యగాథలను జొక్కితి నాత్మవిశేష తృప్తితో 35

ఆ.వె.	కాని యేమి సేతు కరవు ప్రాంతము నందు
పేద వాని యింట ప్రేమ లేక
పుట్టువిచ్చె బ్రహ్మ – పొడవదు మాయింట
ప్రొద్దు – సతము తమము ముద్దులాడు	36

తే.గీ.	తల్లిదండ్రులిరువురు మేనెల్ల వంచి
కూలి నాలి చేయుచు నాకు కూడు గుడ్డ
లందజేసి చదువు సాము లమర జేసి
రయ్య! పెద్దయ్య! వందన మయ్య మీకు!	37

ఆ.వె.	నన్ను గన్న తల్లి అన్నపూర్ణాదేవి
నాదు వృద్ధి చూచు నవ్య చరిత
కన్నుమూసె – నాన్న కడలేని దు:ఖాబ్ధి
ముంచె – కస్తి కడలి ముంచె నన్ను.	38

అని చెప్పగా గోవింద కర్వాడే ధర్మదత్తుని దత్తత తీసుకొనదలచి భార్య అహల్యాబాయికి చరవాణిలో చెప్పుట

వ.	గోవింద కర్వాడే ఆలోచనా నిమగ్నుడై, చరవాణిలో భార్య
అహల్యాబాయితో	39

తే.గీ.	“వినుమహల్య! నెమ్మది తోడ, వేడ్క మీర
నేను చెప్పెడి విషయమ్ము నీకు ప్రియము,
శాంతి సంపద లందించు, జింత మాన్పు,
నింటి గౌరవమ్మును పెంచునే – లతాంగి!”	40

ఉ. కాంచితి ధర్మవీరునిట, కాంచితి సుందర రూపునిచ్చటన్
కాంచన దేహమాతనిది, కారణ జన్ముడు ధర్మదత్తుడున్
కాంచగ వంశగౌరవము గాచెడి బాలుడు వారసుండనన్
పంచును మంచినెల్లెడల పాపము పుణ్యము నెంచునేతయౌ. 41

ఆ.వె. అనగ వినిన భార్య నరుదెంచె నప్పుడే
బాలు గాంచి తాను పరవశించి
బెంగ వలదు తండ్రి బెంబేలు వలది%శీ%క
అన్ని నీకు మేమె అమ్మ నాన్న. 42

దత్తత విషయము విని ధర్మదత్తుడు కృతజ్ఞత తెలియజేయుట

ఉ. పాదములంటి వారికిని బాధగ నేడ్చెను గుక్కపెట్టుచున్
వేదన దీరి సంతసము విచ్చెను వంశపు వృద్ధి దల్చుచున్
మోదమునందె వారలును ముద్దుల బాలుని దత్తతందగన్
వేదము నమ్మువారలకు వేదన లుండునె యిజ్జగంబునన్? 43

సీ. గోవింద కర్తృడే కోరిక మేరకు
పురమునందున్నట్టి పౌరహితులు,
వేదవేత్తలు చేరి వేదఘోషల మధ్య
దత్తత కార్యంబు తగిన రీతి
ఉత్తరాయణమందు ఉపనయనంబును
జరిపిరి ఘనముగ శాస్త్రవిధిగ
చక్కని సంస్కార సంపన్ను జేసిరి
యజ్ఞోపవీత విన్యస్త ఫణితి.

తే.గీ. దైవ మహిమగ జరిగెను దత్తతనుచు
"బిడ్డ లేనట్టి గొ(డ్రాలు" పిలుపు మాసె
ననెడి ఆనంద వీచిక లచట విరిసె
వేద వేత్తలు వారి దీవించి రెలమి. 44

సుగంధి వృత్తము:

దైవలీల గాదె యిద్ది ధర్మదత్తుడిట్టులీ
కోవ కర్హడే ధనాఢ్యు కూర్మి పుత్రుడై మనెన్
శ్రీవసుంధరాధిపుండు సేవకుండు కాగ నా
సేవకుండు భూపుడౌను శ్రీమహేశు దృష్టులన్ 45
(ర,జ,ర,జ,ర, 1-9 యతి, ప్రాస ఉన్నది- అ.క. క్ర.సం.126)

ఉ. కన్నుల నీరునిండగను కాళ్ళకు మ్రొక్కుచు వారికప్పుడున్
దన్నుగ నిల్చితీరుమరి దత్తత గైకొని పేదవానినిన్
మిన్నగ మీ సువంశమును మించిన దీక్షగ గాచినిల్చెదన్
పెన్నిధి మీరునాకనుచు పెద్దగనేడ్చెను ధర్మదత్తుడున్ 46

ఆ.వె. ఆంగ్లవిద్య యందు అందరినోడించె
గణిత విద్య యందు ఘనత బొందె
సర్వ శాస్త్ర గతులసరిసాటి లేదని
వరుస నుతులనిడిరి గురువులెల్ల 47

ఆ.వె. సర్వ జీవులందు సౌజన్య మూర్తిగా
పట్టణమ్ము నందు ప్రతిభ పెరిగె
గౌరవమ్ము బెంచు ఘనుడని గోవిందు
పొంగిపోయె మదిని మురిసిపోయె 48

తండ్రి గోవింద కర్వాడే వ్యాపార విషయములలో సహాయపడి పేరు తెచ్చుకొనుట

సీ. వార్ధక్య భారమ్ము వారిని తాకగా
గోవింద కర్వాడే కొంత క్రుంగె
తండ్రికి తోడుగా దక్షత తోడను
వ్యాపార విషయాల పద్దు నేర్చె
సర్వ కార్యములందు చతురత స్ఫూర్తితో
మేటిగ నిలుచుచు మెప్పునందె
ఆబాల గోపాల మచిర కాలము నందె
పంక్తిలో ఘనుడను వాసికెక్కె

తే.గీ. నగర వాణిజ్య సంఘంబు నాయకుడుగ
దేశ సంబంధ బాంధవ్య దిశలనెరిగె
వసుధ గోవింద కర్వాడే వారసుండు
యోగ్యుడని జనుల్ మెచ్చునట్లొప్పె నచట 49

ధర్మదత్తుని యుక్త వయస్కుడగుటచే వివాహ ప్రస్తావన

తే.గీ. కోర మీసాల కుఱ్ఱాడి గుణ వితతికి
మన్మథాకార పుష్టికి మనసు కదల
పంచ బాణుని శరముల వాడి వేడి
కల్లలాడిరి యువతులు కాంచి వాని 50

తే.గీ. ధర్మ దత్తునిఘన సౌమ్య ధనగుణమ్ము
తెలిసి వ్యాపారవేత్తలు దేశదేశ
ములను దాటి వచ్చిరి తమ ముద్దు కూతు
నీయగా బంధుతా బంధ మేర్పడంగ 51

వంశస్థ వృత్తము:

ఘనాఘనోద్దీపిత గాత్ర శోభితున్
మనోనుకూలాంచిత మన్మథాధిపున్
వినీత వర్తున్ సువివేక ధామునిన్
గనుంగవన్ గాంచి ఘనాత్మ మెచ్చుచున్ 52

(జ,త,జ,ర, 1–8 యతి, ప్రాస ఉన్నది. అప్పకవీయం –క్ర.సం. 87)

ధర్మదత్తుని కులగోత్ర ప్రస్తావన వచ్చుటచే కర్వడే ఆగ్రహించుట

ఆ.వె. అడిగిరిట్లు వారలా తల్లిదండ్రులన్
వింటిమేము మీర లింటి వార
సునిగ స్వీకరించి రనుచు నిద్ది నిజమ?
ఐన నితని కులము గుణాంకమేది? 53

కం. వారల మాటకు గోవిం
దు రోష కలితుండయి తగదురొకో మీరల్
మారాడక పొందు నతులు
శ్రీరామ సముండు ధర్మ చిత్తుడు వీడొ! 54

వ. వారు వెడలి పోగా 55

తల్లి ధర్మదత్తుని మనసు నెరింగి వివాహ విషయము నడుగుట

తే.గీ. చిన్ని నవ్వులు నవ్వుచు సిగ్గు పడుచు
ధర్మ దత్తుండు దిక్కులు ధరణి జూడ
తల్లి మనసుకు చిక్కని తనయుడెవడు?
పిలిచి యడుగంగ తనకోర్కె తెలిపె నిట్లు 56

కం. అమ్మా! బ్రాహ్మణ కన్యను
తెమ్మా! యింటికి వెలుగును తెచ్చెడి వనితన్
నెమ్మది మిము సేవించుచు
సమ్మానించెదము సతము సత్యము తల్లీ! 57

వ. అని ధర్ముడు పలుకంగ అహల్యాబాయి లోకోద్ధారకుడైన వానిని పుత్రునిగా జేసినందులకు భగవంతునికి నమస్కరించి భర్త గోవింద కర్హాడేను సంప్రదించి 58

అహల్యాబాయి కుమారుని వివాహమునకు పూనుకొనుట

తే.గీ. వాడ వాడల గాలించి వైన మెరిగి
పేదరాలైన గుణముల పేటికైన
కన్య నొకరిత గాంచి తక్షణమె మెచ్చి
వనిత చిత్రమ్ము గొని వచ్చి పతికి జూపె. 59

కం. గోవింద యయ్యువతి స
ల్లావణ్యము గాంచి మెచ్చి లాలన తోడన్
రావయ్య! దత్త! చూడుమ
యీ వనితపటమ్ము హృద్రసేక్షణ తోడన్ 60

వ. ఆ అమ్మాయిపేరు అంకితాదేవి యని తల్లి అహల్యాదేవిచెప్పగా 61

కం. చిరునగవు సిగ్గు దొంతర
వరుసగ దాన్ బటము గొంచు పరి పరి గతుల
న్నరసెను నెమ్మది క్రొవ్విరి
విరియగ దత్తుండు ప్రేమ వీక్షణ తోడన్ 62

వివాహ సమయమున దండ్రి ధర్మపాలునికై కబురంపుట

వ. అదే సమయంబున తన కన్న తండ్రి ధర్మపాలుడు గుర్తునకు వచ్చి 63

తే.గీ. వేంగి పల్లియ వెదికించె వేగు నంపి
ధర్మ దత్తుండు వాడట్లు తరలి వెదకి
అతడు మరణించె ననువార్త నాలకించి
వచ్చి తద్వార్త తెలిపె పెన్వగపు తోడ 64

శా. అమ్మాటల్ విని ధర్మదత్తుడు వగన్ హా! తండ్రి! క్షంతవ్యుడన్
మిమ్మున్ మీ యనురాగ బంధమును మీ మేలైన వాక్యమ్ముల
నమ్మాలన్ బడవైచి మిమ్ము విడి నే స్వార్థప్రభాకర్ష భూ
తమ్ముంజిక్కిటు వచ్చితిన్ మిమ్ము సదాత్మన్ భావన% జేయుచున్ 65

ఆ.వె. జనని దూరమయ్యె జనకుండు సతిజూడ
స్వర్గసీమ జేరె వసుధ యందు
నేనొ యొంట రైతినే దైవమా! యిటు
లండ లేక పోయె నంచు వగవ 66

కన్న తండ్రి ధర్మపాలుని మరణవార్త విని కర్వడే దత్తునోదార్చుట

ఆ.వె. కన్న తండ్రి వార్త కర్వడే కనుగొని
పుట్టు జీవి యెల్ల గిట్టు ననుచు
ఇద్ది ధర్మ మనుచు నిలలోన దెలిసిన
వేద మెరిగినట్టి విదుడ వీవు 67

వ. అనుచు పరిపరి విధముల నోదార్చెను. 68

ఆ.వె. అటుల కొంతకాల మట్లేగ నొకనాడు
దత్తు గాంచి తల్లిదండ్రులెలమి
పెళ్ళిమాట నెత్త పెనుభక్తి వారల
పదములంటి వాడు వల్లె యనియె. 69

తే.గీ. పేదరాలిని గోరెడు పిచ్చి దనుచు
కోరి వచ్చెడి కోట్లను కూడదనెడి
తల్లి లోకంబు గలదొకో తరచి చూడ
పలుకు వారల మాటలు పట్టనట్టు 70

ఆ.వె. పేద వారె గొప్ప పేర్మిని బంచెడి
మంచి వారలనెడి మంది మాట
వినగ వలయు ననుచు వివరణ నిచ్చుచు
దేవ దేవు నమ్మి తీర్పు జెప్పె 71

ధర్మదత్తుని పెండ్లి చూపుల ఘట్టము

వ. దత్తుడు తల్లి దండ్రులతో గలిసి అంకితాబాయిని జూచుటకు
వారింటికి వచ్చెను. అప్పుడు పెద్దల యెదుట వరినొకరినొకరు
చూచుకొనిరి. అపుడు 72

మ. కనియెన్నంకిత చంద్రమండల ముఖున్ గంభీర మేఘస్ఫురత్
స్వన కంఠున్ సరసాబ్జ నేత్ర విలసత్ భద్రాధి రూఢాప్త దే
హుని కల్యాణ గుణాభిరాముని సుకార్యోదీర్ణ సంభావనా
త్ముని సద్ధర్మ పథాను వర్తనుని సత్యోత్కంఠునిన్ దత్తునిన్ 73

వ. అటులనే ధర్మదత్తుండు కూడా 74

మ. కనియెన్ దత్తుడు చంద్రమండలముఖిన్ కల్యాణ భావైక రా
గ నిధిన్ సుందర కంబుకంఠిని బృహత్ గందేభ కుంభస్తనిన్
ప్రణుతాంభోజదళాయతాక్షిని లసత్ లక్ష్మీ కళోద్భాసినిన్
వనితాలోక నుతాప్త ధర్మ చరితన్ భద్రోరు శీలాంకితన్ 75

ఆ.వె. యువకు వాడి చూపు యువతి వాల్చూపులు
నొకరి నొకరి దాక నోర్వగలదె?
మనసు తనువు భావ మధురిమ లెగయగ
వయసు లట్లు చేయ పడచులందు. 76

చం. అదియును గాక కట్టెదుట అందము చిందెడు మూర్తిమత్వమున్
పదిలము గొన్న యౌవన విమాన విహారము వాడి చూపులున్
గుది గొని గ్రుచ్చుచుండ నెఱి గూర్చెడు పంచశరుండు బాణముల్
వదలక వేయుచుండ మది పాడదె మోహన రాగ గీతికల్ 77

ధర్మదత్తుని వివాహ ఘట్టము

సీ. కొమరుని గుణమెంచి గోవింద కర్తాడే
మురిసెను మనసంత ముదము నిండ
కల్యాణ ఘడియలు కమనీయ రీతిలో
అంగరంగపుశోభ అమరె నచట
ఆదరించిరిప్రేమ నాహూత గణములన్
ధర్మ దత్తుని శోభ ధరణి మించె
అంకిత–ధర్ముల అన్యోన్య తనుజూచి
అక్షతల్ జల్లిరి ఆదరమున
తే.గీ. తల్లి దిష్టిని తీయుచు తనయు గాంచి
కులము నిల్పెడు వానిని గుణము గలిగి
మనుమ నిమ్మని కోరెను మమత తోడ
జనత ఆశీస్సు లిచ్చుచు జల్లె సేస 78

వ.   క్రొత్త దంపతులిరువురు వివాహానంతరము శ్రీసత్యనారాయణ స్వామి వ్రతమాచరించి, యీవిధంబున ప్రార్థించిరి. 79

ఆశ్వాసాంత పద్యములు

సీ.   శ్రీసత్య రూపాయ! శ్రీసత్య నాథాయ!
సత్య పాదాయ! శ్రీ సత్య దేవ!
శ్రీ సత్య మేధాయ! శ్రీ సత్యధీశాయ!
సత్య సద్భావాయ సత్య దీప్త!
శ్రీ సత్య వాక్యాయ! శ్రీ సత్య కమలాయ!
సత్యాధి రాజాయ! సత్య ధర్మ!
శ్రీ సత్యమోహాయ! శ్రీ సత్య సింహాయ!
సత్య సంవృత్తాయ! సత్య గుప్త!

తే.గీ.   మూలతో బ్రహ్మ రూపాయ! ముఖ్య రూప!
మధ్య భాగ మహేశాయ! మాన్య రూప!
విష్ణురూపాయ! వాక్యాయ! విష్ణు తేజ!
శ్రీ త్రయీ రమ్య రూపాయ చిద్విలాస! 80

ఆశ్వాసాంత గద్యము: ఇది శ్రీవాధూలస గోత్రపవిత్ర టేకుమళ్ళ హనుమాయమ్మా సుబ్రహ్మణ్యాఖ్య చతుర్థ పుత్ర, సహృదయ, కవిమిత్ర, శ్రీపరమాత్మ గురు కటాక్షవీక్షణా లబ్ధ సారస్వతమర్మ వేంకటప్పయ్యశర్మ ప్రణీతంబైన ధర్మదత్తోదయంబను ప్రబంధంబున తృతీయాశ్వాసంబు సమాప్తము.

-000-

చతుర్థాశ్వాసము

కం. శ్రీమాధవ! మధుసూదన!
నామదిలోబూర్ణ భక్తి నమ్మిక తోడన్
ఏమరకను సన్నుతించెద
పావన భావాళులిడుమ భద్రార్ద్ర హృదిన్ 1

ధర్మదత్తుని భార్య అంకిత అంకితభావముతో అత్తమామల సేవించుట

వ. ధర్మదత్తుని భార్య అంకితాబాయి సుగుణము లెట్టివనిన 2

సీ. అత్తమామల హృదయాంతర భావాల
కనువుగా మెలగుచు పనులు చేయు
పెనిమిటి సేవలే పెన్నిధిగానెంచి
శ్రద్ధ తోడుత పరిచర్య చేయు
దాన ధర్మములందు దాక్షిణ్యమున్ జూపి
పూత చిత్తాన గోపూజ చేయు
సేవక గణముల సేమమ్ము నరయుచు
అర్హతా కార్యములంద జేయు
తే.గీ. అత్తమామల కమ్మగా నగుచు, పతికి
తగిన ఇల్లాలుగ మనుచు, తలపులందు
వంశ సంస్కృతి నింపి తద్వర్తనమ్ము
సలుపు లక్ష్మిగా నిల్చె వలపు పంచె 3

ఆ.వె. కాసులాస పడక కమల ప్రియం దెచ్చె
నింటి కోడఱికము నిచ్చి తనదు
బిడ్డవోలె జూచె ప్రేముడి పెంపార
ననుచు నూరి వారహల్య గాంచి 4

తే.గీ. పలుకు చుండంగ విని మది పరవశించి
యేను నొక యింటి బిడ్డనే - యీడు వచ్చి
యిటుల కోడలనైతిని - యిదియె ధర్మ
మాత్మ సుతయె కోడలు నాకంచు మురిసి 5

కం. మాయింటి దివ్వె వెలుగగ
మాయింటికి వచ్చినట్టి మహిళను మేమున్
మా యీడుగ గనవలదా
రాయిడుటల్ భావ్యమగున రాతిరి పగలున్ 6

చం. అని తన యాత్మనందున నహల్య తలంచుచునింటికోడలిన్
కనుగవ ప్రేమ నింపి తనకంటికి రెప్పగ జూచుచుండె న
ప్పెను లలిజూచి యంకితయు వేమరు భావన చేసె నేను భా
గ్యనిధిని అత్తమామలిటు లమ్మగ నాన్నగ నుండి రెప్పుడున్ 7

అంకిత గర్భంబు దాల్చుట

అశ్వగతి: కుంకుమ ధారిణి గౌరి సుకోమల దేహధరన్
పొంకముగా బతిశక్తి విభూషణ వర్జితమౌ
నుంకువ గర్భము దాల్చెడి నున్నత శోభిత భా
వాంకిత గా నొనరించగ నంకిత సిగ్గు పడెన్ 8
(భ,భ,భ,భ,భ,గ - ప్రాస యున్నది యతి 1-10 అప్పకవీయం క్ర.సం. 138)

ఆ.వె. మట్టిగోడలందు చుట్టుముట్టి పలుకు,
పుల్లనైన కాయ, ఉల్లమలర
తినగనెంచె వాని తెమ్మంచు బతిగోరె
సిగ్గు దెసలు నిండ స్నిగ్ధ బుద్ధి 9

ఉ. సుందర దేవతా మృదుల శోభిత విగ్రహముల్, లసత్కళా
బంధుర కాంచన స్థగిత భద్ర మనోహర రూప రేఖదృక్
వందిత విగ్రహావళుల పంక్తులుగా గదినిండ బెట్టె తా
నందగ నట్టి సంతు సుగుణాన్విత సుందర గాత్ర వంతులన్ 10

తే.గీ. ఇద్ది మన పూర్వ జనుల సమీక్షణమ్ము
గర్భవతి చిత్తమెపుడు గనగ వలయు
సత్యధర్మైక మూర్తుల సరస మతుల
రమ్య చిత్రమ్ములా నంద రాగ ఫణతి 11

అంకిత ఇద్దరు మగ బిడ్డలకు జన్మమిచ్చుట

ఉ.మా. పూచిన పూర్వ పుణ్యమున పుట్టిరి యిద్దరు బిడ్డలామెకున్
చూచిన వారలందరకు చూపులు నిల్చెడి గొప్పరూపులై
వేచిన కర్వడే కపుడు వేదన తీరెను వంశ వృద్ధియై
నోచిన నోములున్ వ్రతము న్యూనత నొందునె భాగ్యదాయిగా
వీచుగ సౌఖ్య సంపదల ప్రేముడి వాయువులన్ గ్రమంబుగా 12

ధర్మదత్తుడు వ్యాపార భారమును మోయుట

వ. ధర్మదత్తుడును అదే రీతిలో 13

సీ. గోవింద కర్వాడే కోరిన రీతిగా
నడచుచు గృహకీర్తి కిడియె దీప్తి
వ్యాపార మంతయు వ్యాప్తిని గావించి
దిగ్గజ వ్యాపారి నగ్గలించె
సత్య ధర్మమ్ముల నిత్యానువర్తియై
తలలోని నాల్కగా తనరి నిల్చె
సంప్రదాయమ్ములు సద్భక్తి పాటించి
చుట్టాల రాగమ్ము చూరగొనియె
తే.గీ. ధర్మ దత్తుండు జనతాళి దారి నెరిగి
తాను నాదారి నడిచె విజ్ఞాన మెసగ
నవ్య సూత్రాలు తలపోసి నవక మెసగ
ముఖ్య నేతగ పేరందె పురమునందు 14

గోవిందకర్వాడే వయోభారమున కృంగుట

ఉ. కాలము నొక్కరీతిగను గాంచము మాయల లోకమందునన్
మేలగు కాలముల్ ముగియ మిథ్యగ దోచును జీవితమ్మునన్
తూలును దేహమంతయును దూసరమైచను శక్తిమేనిలో
మూలము గాంచగా జరయె! మూలము నేరికి కాలమందునన్ 16

ఉ. కోరిన గొప్పవైద్యమును గూర్చుచు వారికి కంటిపాపయై
తీరగు సేవలన్ జరిపి దేవుని దల్చుచు నత్తమామలన్
పేరము లెట్టుచున్ దిరిగి పెన్నిధి యాయెను వారికంతకున్
వేరగు భావనల్ గనక వెన్నెల నిచ్చుచు సాగునక్కటా! 17

గోవింద కర్వాడే మరణించుట

వ.　ఇట్లుండ నొకనాడు గోవిందకర్వాడే　18

చం.　గడపను దాటుచుండగను కాలును జారగ నేలపై బడెన్
విడిచెను ప్రాణమచ్చటనె వింతగ దోచెను జూచువారికిన్
హడలిరి అంకితాసతి నహల్యయు మూర్ఛను బోయిరచ్చటన్
జడిసిన సేవకుల్ కబురు చల్లగ జెప్పిరి ధర్మపాలుతోన్　19

తే.గీ.　పరుగు పరుగున కారులో నరుగుదెంచి
దిక్కు వీడిన నొంటరి దీనుడవగ
గొల్లు గొల్లున ఏడ్చుచు కూలె నచట
శోక సాగర మాయెను లోకమంత　20

ఉ.　ఏమని చెప్పగా వలయు ఏమగునోనని తల్లడిల్లుచున్
ఏమియు మాటలాడకయె ఏడ్చుచు నిల్చెను తల్లిముందరన్
మోమును కాళ్ళపై నదిమి మూగగ రోదన జేయుచుండగన్
గోముగ లేవనెత్తుచును గూడిన వారలవైపు గాంచుచున్　21

ఆ.వె.　"కన్న కొడుకు కంటె ఘనమైన వాడవు
ధర్మ మెరిగి నట్టి ధర్మ రవివి
కర్మ కాండ జేయ కర్తవ్య మీదయ్యె
దైవ లీల" యనుచు ధైర్యమిచ్చె　22

ఆ.వె. వేల జనము వచ్చి వీక్షించి దు:ఖాన
మంచి మనిషి యనుచు మంది బొగడె
అతని సేవలెపుడు ఆదర్శ వంతమౌ
ననుచు నఖిల జనులు అంజలిడిరి 23

తే.గీ. దాన దక్షిణ లిచ్చెను దండిగాను
అస్థి కలనెల్ల గలిపెను తానన్ని నదుల
శాంతి హెూమాల జరిపించి సకల విధుల
విబుధ జనులకు బంచెను వెండి పసిడి 24

ధర్మదత్తుడు తన కుమారులకు సద్బుద్ధులను నేర్పించి, దేశసంచారమున కంపుట

ఉ. పిల్లలు పెద్దవారయిరి పేర్మిగ నేర్చిరి ధర్మ సూత్రముల్
చల్లని నీడతీరుగను చక్కగ జెప్పెను వారికన్నియున్
మల్లెల తావిరీతిగను మంచిని వీడక గొప్ప బాటలో
మెల్లగ నిచ్చెనెక్కగను మేలగు మార్గము నేర్పెవారికిన్ 25

ఉ. నేర్పెను దానధర్మముల, నేర్పెను వారికి దొడ్డ బుద్ధులున్
నేర్పెను గౌరవించుటను, నేర్పెను సంఘపు తీరుతెన్నులున్
నేర్పెను తారతమ్యములు, నేర్పెను నాణ్యత కార్యమందునన్
నేర్పెను కర్తడే తనకు నేర్పిన వన్నియు పొల్లుబోవకన్ 26

ఆ.వె. తల్లిదండ్రులెటుల ధర్మాత్ములగుదురో
బిడ్డలటులె నడచి పృథివి యందు
మంచి కీర్తి తోడ మనుగడ సాగింత్రు
వంశ వృద్ధి జరుగు వాసి పెరుగు. 27

సీ. తనయుల బిలిపించి ధర్మదత్తుండంత
మీ జీవితమ్ముల మేలు దలచి
విషయంబు దెలిపెద వేగిర పడకను
ఆలకించుడు మాట ఆదరమున
మీరొక్క వర్షంబు మీరక నామాట
నేబంపు తావున నిలువ వలయు
స్వార్జిత కష్టంబు సాధక బాధక
విషయాల నెరిగెడి విధము నరయ

తే.గీ. ధర్మ దత్తుని పేరును దలచకుండ
స్వంత పాదమ్ములన్నిల్చి స్వార్జితముగ
వేతనమ్ముల నార్జించు విధము నేర్వ
వలయు పేరాశ పడకుండ వగవ కుండ 28

తే.గీ. బాగు గోరెడి వాడను బాధ వలదు
ఒక్క ఏడాది కాలమ్ము నోర్చుకొనుము
సర్వ సామాన్యు లుగ మీరు సంచరించ
కాసు విలువను గ్రహియింప కలుగు సుఖము 29

తే.గీ. అనుచు వారల బంపింప నంకితకును
నచ్చ జెప్పెను పథకపు నంతరమును
ధనము నేమాత్ర మీయక తలను దాల్చి
సుతుల బంపుము లాలించి శుభములరయ. 30

వ. అని సుతులను వేరు రాష్ట్రములకు బంపించిన యనంతరము కొద్దిరోజులకు అహల్యాబాయి మరణము సంభవించగా, కర్మకాండలు సక్రమముగా జరిపిస్తాడు. 31

స్వార్థపరులు వ్యాపార రంగమున దోచుకొనుటను దత్తు దడ్డుకొనుట

ఉ. గందర గోళముల్ జరిగి గాడిని దప్పెను కొన్ని తావులన్
కొందరు దొంగలై ధనము కోరిన రీతిగ కొల్లగొట్టగా
ముందుగ దానినాపగను మొండిగ వారికి బుద్ధి చెప్పగన్
సందడి యాగెనంతటను చక్కగ దారికి వచ్చిరందరున్ 32

తే.గీ. కర్మ కొలది రాబడి కానుపించు
అదియు హెచ్చు తగ్గులుగ, నయ్యది వారి
బుద్ధి బలమును బట్టియు, పూర్వ జన్మ
ఫలమును బట్టియు పొసగుచుండు. 33

కం. కొందరికి హెచ్చు లాభము
కొందరికిన్ నష్టము మరి కొందరికి మొగిన్
చెందును సరి సమముగ, నే
మందుము నొసటి పయి గీత నట్టుల చేయున్ 34

ధర్మదత్తుడు వేంగిపుర దోస్తును కలియుట, వేంగిపుర దుస్థితి తెలిసికొనుట

ఆ.వె. తిరిగి వెళ్ళు వేళ తీరిక సమయాన
గుడికి వెళ్ళగాను గ్రుచ్చి గ్రుచ్చి
పట్టి జూచు నట్టి పాదచారిని జూడ
పలుకరించగాను పల్లె నేస్తు 35

ఆ.వె. చిన్నతనపు దోస్తు శీనయ్య వాడని
గుర్తుపట్ట గాను గుబులు తగ్గె
చిరుత ప్రాయ మందు చిలిపిగ నాడిన
ఆటలన్ని దలచి రచట వారు. 36

ఆ.వె. పల్లె తీరు నేడు పరమ ఘోరమ్మని
శీను చెప్ప గాను చింత గలిగె
ఒక్కసారి వచ్చి ఊరుజూడు మనంగ
వల్లె యనియె దత్తు పల్లె జూడ 37

ధర్మదత్తుని కుమారుల దేశ సంచారము - గృహము జేరుట

వ. ధర్మదత్తుని కుమారులిద్దరు తండ్రి యాజ్ఞ మేరకు ఆయా
పదేశములన్దిరుగుచు 38

శా. ఆయా ప్రాంతములందు గల్గు నదులన్నందుండు జీవాళులున్
లోయల్ కానలు పర్వతమ్ముల దరిన్ జూపట్టు జీవాళుల
న్నీ యా పట్టుల పల్లె సీమల కడన్ జీవించు వారిన్ లసత్
ధ్యేయోత్సాహ మతింగనుంగొనుచు స్పందించుచున్ సాగుచున్ 39

తే.గీ. ప్రజల కష్ట సుఖమ్ములు, పండు పంట
లచటి వ్యాపార సరణులు - నమలు పరచు
తీరు - లభిరుచులు - బ్రతుకు తీరు తెన్ను
లన్నిటి గనుచు బుద్ధికి వన్నెలిడిరి 40

కం. జనకుని యానతి తీరున
చనుచున్- కావలసినంత జ్ఞానశ్రీలన్
పొనుపగు నమభవము ప్రజా
గణ గుణ జీవనమ్ము గైకొని పిదపన్ 41

ఆ.వె. మురిసి మరి యరసి తిరుగుచు తిరుగుచు
గడువులోన వలయు నడతలెన్నొ
తెలిసికొని కనులకొన వాని తిలకించి
పూర్ణ బుద్ధితోడ పొంది కలర 42

ఉ. చేరిరి చెప్పినట్లువిని చెడ్డను మంచిని గాంచిరంతటన్
ఘోరపు సంఘతీరునకు గోచరమయ్యెను సర్వ బాధలున్
దారుణ రీతిగా గడచె ధర్మము న్యాయము జూడరెవ్వరున్
వేరుగ వర్షముండగను వెల్గెను వారికి జ్ఞానదీపముల్. 43

తే.గీ. సుతుల మాటల కానంద శోభ గలిగి
పొదలు నాదాయ మార్గముల్ వెదకు మనుచు
కొన్ని పనులను వారిని కూడి చేయ
ఆనతీయ సుతద్వయ మనుసరించె. 44

ధర్మదత్తునికి శంకరుడు స్వప్నములో నగుపించుట

వ. ఇట్లుండ ఒక నాడు తెల్లవారు ఝామున 45

సీ. కలత నిద్దుర నుండ కలవచ్చె దత్తునకు
సంకు నూదిన యట్లు శంకరుండు
కాలకంఠుని గాంచి కళవళ పడె కొంత
పలికిన పలుకులు భయము గొలిపె
"కోట్లకు పడగెత్తి కూడబెట్టిన నీవు
సతియు సుతులతోడ చల్లగుండ
కూటికి లేనట్టి కోట్లాది ప్రజలెల్ల
కడుపులు నిండక కమిలె బ్రతుకు"



ఆ.వె. ఉలికి పడుచు లేచె! ఉదయపు రాకకు
కొంత పొద్దు ఝాము కూడి యుండె
శుభము నిచ్చు నట్టి సోమ శేఖరుండు
జన్మ కారణంబు జ్ఞప్తి జేసె. 46

ఆ.వె. అనుచు దలచి లేచి యానాడు శివపూజ
జరిపె దత్తుడంత జక్కగాను
సతియు సుతుల గూడి సాగిల పడిలేచె
నమక చమక సహిత నమసులిడుచు 47

ధర్మదత్తుడు కర్తవ్య విస్మరణ గావించితినని ఆవేదనాపరుడగుట

వ. ఆరోజు రాత్రి ఆలోచనా నిమగ్నుడాయెను. 48

ఉ. పల్లెకు మేలుజేయగను పట్టిన దీక్షకు మాయ గ్రమ్మెనే!
ముల్లెలు మూటలంచుచును మూలధనమ్ము న బానిసైతినే!
చెల్లని రూకలన్ భ్రమయ చేతులు గాలెను చాలునక్కటా!
చెల్లెను రోజులింకమరి చేయగ బూనితి నమ్ముమీశ్వరా! 49

తే.గీ. మరువ కర్తవ్య దీక్షను మందలించి
కళ్ళు తెరిపించి నిల్చిన గరళ కంఠ!
నాకు వెన్నుగ నిలువుము నాద నిలయ!
అండ నిలువుము కార్యంబు నరయగాను. 50

ఆ.వె. జనని జన్మభూమి జాతికె గర్వంబు
పల్లె పట్టులెల్ల తల్లి దలచి
గాంచ వలెను మనము ఘనమతి తోడుతన్
గ్రామ మన్న మనకు కల్పవల్లి 51

ధర్మదత్తుడు వేంగిపురమునకు పయనమగుట

వ.	మరుసటి ఉదయము ధర్మదత్తుడు వేంగిపల్లె శివార్లలోనుండగా. 52

ఆ.వె.	పూడ్చ శిశువు శవము పొందిక లేనట్టి
జనుల గుంపు జూడ జాలి గలిగి
వివరమడగ వారు విపరీత శోకాన
కుమిలి కుమిలి యేడ్చి కూల బడిరి 53

ఆ.వె.	పొట్ట నొప్పి యనుచు పొర్లిదొర్లేడ్చెను
తాళ లేనటంచు తల్లడిల్లె
తెల్లవార నొడలు చల్లబడె నకటా!
ఆరు వత్సరములె అనుచు వగచె 54

ధర్మదత్తుడు గ్రామసభలో ఊరికి వలసిన వసతులనేర్పాటు గురించి వివరించుట

వ.	వారి మాటలకు చింతాక్రాంతుడై వేంగి పల్లెను జేరి, గ్రామ
పెద్దలతో నొక సభ నేర్పాటు జేసి 55

ఉ.	పెద్దలు కోపగింపకుడు పిల్చితి మాటలు కొన్ని చెప్పగన్
ముద్దుల బిడ్డగా నిచట మోదము నందితి బాల్యమందునన్
మద్దతు నీయగా వలయు మాన్యత నాకొక మూడు మాసముల్
మద్దతు గోరినిల్చితిని మంచిని జేయగ వేంగికిప్పుడున్ 56

ఉ. పల్లెను వీడితిన్నిజము! భావిని దల్చుచు వృద్ధిగోరుచున్
చల్లగ నాదరించెనను చక్కగ దిద్దిరి దత్తతందగన్
చల్లని దీవెనల్ ఫలమె! చాలిన సంపద పొందగల్గితిన్
పల్లకి నెక్కుటన్ మరిగి పాడయి పోయెను జ్ఞాన మక్కటా! 57

ఆ.వె. సాంబ శివుడు నన్ను చక్కగా మేల్కొల్పె
బోధ జేయ నాకు బుద్ధి వచ్చె
చాల తప్పు జరిగె జాప్యంబు జరిగెను
పెద్ద మనసు తోడ మద్దతిండు 58

వ. అని వారిని మేల్కొల్పి, ఊరికి నేమేమి చేయవలయునో, నేమేమి
కావలయునో అన్నింటిని నిట్లు తెలిపెను. 59

ఉ. ముందుగ వైద్యశాలయును ముచ్చట గొల్పెడి పాఠశాలయున్
అందరి దాహచింతనయు నక్కర దీర్చెడి నీటిపంపులన్
సుందరమైన రోడ్లకును సూచన గావలె యోచనమ్ముతో
అందగ మానసోల్లసము నందరు గొల్చెడి దేవళమ్మునున్ 60

వ. నిర్మించ సంకల్పించినట్లు తెలిపి 61
ఆ.వె.వేంగి పల్లె పేరు వినిపింప ఘనముగా
ప్రజలు నిలుప వలయు ప్రగతి రథము
రాష్ట్రమందు మనమె రాణించ వలెనయ్య
ననుచు నిల్చి పలికె నందరెదుట 62

తే. గీ. మూడు మాసాల గడువని ముదము తోడ
ధర్మదత్తుండు చెప్పంగ తలల నూచి
సోమ శేఖరు డిట్టుల ప్రేమ మెరయ
వచ్చె మాయూరి కనుచును ప్రజ తలంచె 63

వ. అనుచు శివాలయమును దర్శించి, జనాంతికముగా 64

ఉ. వాలిన భక్తితో గొలిచి, వాకిట నిల్చిన వారి జూచుచున్
మేలగు రోజులొచ్చునిక , మీరక యుండగ న్యాయధర్మముల్
మూలము నన్నికర్మముల మోసపు ధోరణి వీడగావలెన్
శీలము గొప్పదై నిలువ చిక్కులు దాకవు మానవాళినిన్ 65

ఆశ్వాసాంత పద్యములు.

భుజంగ ప్రయాతము:

హరా! రుద్ర! సర్వేశ! అంబా వినోదా!
వరాధీన చిత్తాబ్జ భావప్రపూతా!
కరీంద్రాత్మ సంచార కార్య ప్రయత్నా!
సుర ప్రార్థనాసక్త! శూలీ! మహేశా! 66

(య,య,య,య 1-8 యతి, ప్రాస ఉన్నది- అప్పకవీయం - క్ర.సంఖ్య - 84)

తోటకము:

కరుణా భరణా! కనకాద్రి విభూ!
వర భక్త గణాంగణ భద్ర చరా!
హర! లోకపతీ! పరమాదరతన్
ధరణీ జనతాళి సదా కనుమా! 67

(స,స,స,స, 1-9 యతి, ప్రాస ఉన్నది- అప్పకవీయం - క్ర.సంఖ్య - 85)

ఆశ్వాసాంత గద్యము: ఇది శ్రీవాధూలసగోత్ర పవిత్ర టేకుమళ్ళ హనుమాయమ్మా సుబ్రహ్మణ్యాఖ్య చతుర్థపుత్ర, సహృదయ, కవిమిత్ర, శ్రీపరమాత్మ గురు కటాక్ష వీక్షణాలబ్ధ సారస్వతమర్మ వేంకటప్పయ్యశర్మ ప్రణీతంబైన ధర్మదత్తోదయంబను ప్రబంధంబున చతుర్థాశ్వాసంబు సమాప్తము.

❀ ❀ ❀

పంచమాశ్వాసము

కం. శ్రీ పాండురంగ విఠలా!
దాపున నిలుచుంటి నేను ధైర్యమునిమ్మా!
దీపము జూపుము నాకిటు
పాపపు చింతనలులేని బాటలనడువన్. 1

ధర్మదత్తుడు అన్యమనస్కుడై వుండుట గాంచిన అంకిత కారణమేమని ప్రశ్నించుట

వ. ధర్మదత్తుడు వచ్చినప్పడినుండి తీవ్ర ఆలోచనా పరుడైన సంగతి
గమనించిన అంకిత భర్తతో 2

తే.గీ. అన్య మనమున మీరుండ అడుగుచుంటి
బాధ నందుచు లోలోన పగలు రాత్రి
దిగులు నొందుచు నుంటిరి తిండి మాని
ధర్మ సంగతు లెరిగితి తమరి కరుణ. 3

తే.గీ. నాథ! విషయమ్ము నెఱిగింప నాకు మీరు
బాధ తెలిపిన కష్టముల్ పంచుకొందు
అనుసరించెద మీబాట ననవరతము
శంక వీడుము! చెప్పుము! శాంతి గలుగు. 4

వ. అని పరిపరి విధమ్ముల భార్య ప్రాధేయపడగా 5

ధర్మదత్తుడు తన స్వప్న వృత్తాంతమును వేంగి బాగుకై వెళ్ళవలసిన అగత్యము దెలుపుట

ఉ. అంకితకంతయున్ దెలిపె నావిషయంబుల నర్ధరాత్రమున్
శంకరు నాజ్ఞకున్నిలుచు శాసన బద్ధుడ జన్మభూమికై
కంకణ దీక్షధారుడను, కాదని చెప్పక నందనిల్వుమా!
వంకలు జెప్పగా వలదు వాదన జేయక మద్దతీయుమా! 6

వ. అని పలికిన భర్త పలుకులకు 7

ఆ.వె. ధన మదున్న లేక దారిద్ర్యమందైన
భర్త తోడు నీడ భార్య యనుచు
కలసి నడువగవలె కలకాల మోర్మితో
అద్ది మనుజ ధర్మ మగును ధరణి 8

వ. అనిన మాటలకు ధర్మదత్తు ండు మిక్కిలి సంతసించి 9

ఉ. తల్లివి బిడ్డలిర్వురకు తప్పదె యుండక కొంతకాలమున్
చల్లని తోడునీడయగు చక్కని యిద్దరు సుందరాంగులన్
తొల్లిటు గాంచగా వలయు దూతల నంపెద నట్టికార్యమై
చెల్లగ బాధ్యతల్ మనము చేరగ వచ్చును వేంగి పల్లెకున్ 10

వ. అని ధర్మదత్తుడు పలుకగా అంకిత 11

తే.గీ .సీత రాముని తోడాయె చింతలేక
కోటి బాధలలో నిన్నుకూడి వత్తు
సుతుల పెండ్లిండ్ల ముచ్చట చూచి మనము
వెళ్ళ వలయును జంటగ వేంగి కపుడు 12

వ. అని పలికి నలుదిక్కులకు మధ్యవర్తులనంపగా 13

ధర్మదత్తుడు సుతులకు వివాహము గావించి ఆస్తిని పంచి యిచ్చి తన అంతరంగమెరింగించుట

తే.గీ. గొప్ప వ్యాపార వేత్తలు కోరి రాగ
వియ్య మందుట కొఱకునై వేగ పడగ
బుద్ధిమతులగు కొమ్మలన్ పుడమి వెదకి
ఇంటికోడళ్ళ చేసె సంతృప్తి తోడ 14

తే.గీ. న్యాయవాదుల రావించి న్యాయమెరిగి
విషయమెరిగించి తనయొక్క విత్తమందు
వేంగి బాగుకు ద్రవ్యమ్ము వేరు జేసి
ఆస్తి పంచెను సుతులకు ఆదరమున 15

తే.గీ. గొప్ప శోకంబు మునిగిరా కొడుకులపుడు
ఆపు జేయగ గోరిరి అమ్మనపుడు
తల్లడిల్లిచు కోడళ్ళు తగ దనంగ
ధర్మదత్తుండు జేసెను తత్త్వబోధ 16

ఉ. పుట్టితి బీదవానిగను పూర్తిగ కూటికి గుడ్డకేడ్చుచున్
వెట్టిగ రైతు జీవమున వేదన బొందిన మాతవీడగన్
గిట్టక పల్లెనొగ్గితిని గీచిన రాతలు తప్పవెన్నడున్
మెట్టగ నిచ్చటన్ కడకు మిక్కుటమాయెను కోటి కోర్కెలున్ 17

వ. అని తన జన్మవృత్తాంతమంతయు నెరింగించి 18

తే.గీ. తప్పు బూనుట శివుడాన ధర్మమేన?
పల్లె యందున జనమెల్ల బాధ లందు
రోగ పీడన మందున రోదనంది
బ్రతుకు లీడ్చగ చూచుట పాడి యగునె? 19

తే.గీ. వేదవేత్తలు నాజన్మ విధిని గాంచి
పల్లె బాగును జేసెడి బాలు డనిరి
కోటి యాశల తోడుగ కోరు కొనుచు
ఎదురు జూచెడి జనమున కేమి సేతు? 20

తాతగారి వంశకీర్తి నిలుపవలసినదిగా కోరుట

ఉ. చేయుడు వర్తకమ్ములను, చేసిన బాసల వీడకెన్నడున్
కాయుడు బీదసాదలను, కావరమున్ విడనాడి ప్రేమతో
బాయకు డెన్నడున్ నిజము, పాయకు ధర్మము భద్ర సంస్కృతిన్
పూయును జీవితమ్ములిల పూర్వపు పుణ్యము నిల్వయుండగన్ 21

ఆ.వె. గొప్ప కీర్తి నందె గోవింద కర్తడే
తాతగారి ఘనత దలచి నిలిచి
బాధలెన్ని యున్న పద్ధతుల్ వీడక
నడువుడయ్య ధరణి న్యాయమెరిగి. 22

ధర్మదత్తుడు, భార్య వేంగి గ్రామము ప్రవేశించుట

వ. ధర్మదత్తు డు భార్యతో గూడి వేంగిపల్లెను ప్రవేశించి. 23

ఆ.వె. చిన్న పెంకుటింట చేరిరి యిరువురు
సర్వ సుఖములొడ్డి సర్దు కొనిరి
భర్తృ చిత్తవృత్తి పట్టమున్ గట్టంగ
తోడు నడిచె మరియు నీడయయ్యె 24

ఉ. వేంగిపురమ్మునన్ విరిసె వేడుకరోజులు మూలమూలలన్
రంగుల తోరణమ్ములట రాజ్యము చేసెను వీథి వీథులన్
బెంగను వీడిరా ప్రజలు పీల్చిరి యూపిరి సంతసమ్మునన్
రంగము సిద్ధమాయెనిక రాతను మార్చగ వేంగికప్పుడున్ 25

ధర్మదత్తుడు వైద్య శిబిరాలను ఏర్పాటు చేయుట

తే.గీ. వైద్య శిబిరాలు పెట్టించి వాడ వాడ
మంచి మందుల నిప్పించి మంది కెల్ల
ధూమపానమ్ము మద్యమ్ము దూర ముంచి
మంచి అలవాట్ల నేర్పించి మార్పు దెచ్చె 26

ఉ. గొప్పగు ఇంజినీరులట గూడిరి మంచి పథాళి వేయగన్
చెప్పిన మాటలెల్లయును చేతల జూపెడి కార్యశూరులై
చెప్పిన రీతిలో తగిన చేర్పులు మార్పులు చేయబూనుచున్
నప్పెడు రీతిగా పనులు నాణ్యత తోడుగ సాగుచుండగన్ 27

తే.గీ. ధర్మదత్తుని ఘనతకు తరలి వచ్చి
చుట్టు ప్రక్కల ప్రజలెల్ల చూడ వచ్చి
అన్ని గ్రామాల జనులను ఆదరింప
వలయు ననుచును గోరిరి వానినపుడు 28

ఆ.వె. ధర్మ రాజు మరల ధరపుట్టె గానంచు
దాన కర్ణుడనుచు దండ మిడిరి
విద్య వైద్యమెల్ల వేంగికే గాకుండ
విస్తరిం చుడనుచు వేడినంత 29

వ. ఆ మాటలను వినిన ధర్మదత్తుండు 30

తే.గీ. వేంగి వాసుల కన్ని ంట వెసులు బాటు
వంద పడకల ఆస్పత్రి వచ్చు నిచట
బడుల యందున విద్యను బడయ వచ్చు
సమయ మున్నది యని పల్కి సాగనంపె 31

ధర్మదత్తుడు మంచినీటి వసతినేర్పాటు చేయుట

వ. ముమ్మందుగా ప్రజలు మంచినీళ్ళకై పడుచున్న బాధలను గాంచి
దాహార్తిని తీర్చదలచి. 32

ఉ. గ్రుక్కెడు మంచినీళ్ళకును కోరిక తీరని పేదవారలున్
చక్కటి పంపులన్ గనుచు సంతసమందిరి గంతు వేయుచున్
తొక్కిస లాటలన్ మరచి తోయము నందిరి యెల్లవేళలన్
ఎక్కడనుండి వచ్చెనిట? ఎక్కడి బంధము? ధర్మదత్తుడా! 33

వ.	అని ప్రజలు వేనేళ్ళ పొగడిరి	34

మం.ద్వి. "ధర్మపాల జలపథక" మనుపేర
అంకితమును జేసె అందరికప్పుడు	35

వేంగిన గుడి గాలిగోపురము, గోడలు కూలుట, పునరుద్ధరణ చర్యలు

ఆ.వె.	వేంగి గుడిని గట్టి వేయేళ్ళు దాటెను
కూలె చాల చోట్ల గోడలన్ని
పూజ సలుపు చుండ పూజారి యొకనాడు
గాలిగోపురమ్ము కదిలి పడెను	36

ఆ.వె.	భక్తు లెల్ల జడిసి పరుగెత్తి పోవంగ
జనుల నష్టమేమి జరుగ లేదు
ఆస్తి నష్టమాయె అంగళ్ళు కూలంగ
గొల్లు మనుచు నేడ్చి గోల చేసి	37

ఉ.	చెప్పిరి ధర్మదత్తునకు చేటగు నిట్టివి యూరికంతకున్
తప్పక గోపురమ్ములను తక్కిన వానిని యుద్ధరించగా
చెప్పెను వారికిన్ భయము చెంతకు రాదని వేంగికెప్పుడున్
చెప్పిరి వేదపండితులు చేయగ నాగమ సూత్రపద్ధతుల్	38

సీ.	శ్రీకాళహస్తిన శ్రీకృష్ణమాచారి
దుర్గి పల్లెన యున్న దొడ్డ శిల్పి
అమరావతి నున్న ఆగమవేత్తలు
ఉత్తరదేశపు ఉడయవర్లు
కబురంది వచ్చిరి గాంచగ నచ్చట
ధర్మదత్తుడపుడు తగిన రీతి
వినిపింప గోరెను వేద విధానమ్ము
సమయ మడిగిరంత సంతసించి

తే.గీ. గాలిగోపుర ప్రాంతమ్ము కలిసి తిరిగి
గుడిని దర్శించి కూలిన కుడ్యమరసి
తిరిగి నిర్మించు పద్ధతుల్ దేల్చి రపుడు
ధర్మదత్తుకు వినిపింప ధనము వ్యయము 39

ఉ. విత్తము చింత చేయకుడు వేంగికి ఖ్యాతిని దెచ్చురీతులన్
పుత్తడి దేవళంబునకు పోయిన కాంతులు చేరునట్లుగా
చిత్తము దీనిపై నిలిపి చేయగ బూనుము కార్యమక్కటా!
మొత్తము కార్యభారమును మోయుడు మీరలు పూర్వశోభకై 40

తే.గీ. అనగ వారెల్ల మిక్కిలి అబ్బురముగ
“దేశదేశములెన్నియొ తిరిగినాము
కాన రాలేదు తమవంటి కర్మశీలి“
అనుచు బల్కిరి శిల్పులు వినయ రీతి 41

వ. అనంతరము వారి వారి కార్యక్రమంబునకు బూనుకొని. 42

ఉ. పల్లవ శిల్పచాతురిని పంచెడు రీతిగ గొప్పనేర్పుతో
చెల్లెను నాటి శిల్పమని చెప్పెడు వారల చెంపపెట్టుగా
పల్లెన దేవళమ్మునకు పట్టిన శోభకు మంత్రముగ్ధులై
యెల్లర కున్ముదాతిశయ మేర్పడ జేసిరి శిల్పులచ్చటన్. 43

వేంగిన పాఠశాల నిర్మించుటల

ఉ. ఉన్నత పాఠశాలయును ఉత్తమబోధన జేయునొజ్జలున్
అన్నిట మిన్నయై నిలువ నాటల నేర్వగ గొప్పభూమియున్
మిన్నగ నాట్యగానముల మెప్పును బొందగ నాట్యశాలలున్
పున్నమి వెన్నెలై కురిసి స్ఫూర్తిగ నిల్చెను రాష్ట్రమంతటన్. 44

తే.గీ. గాలి ధారాళమై వచ్చు గదులతోడ
కార్పొరేటు బడుల ధాటి గాను నిల్చు
దృశ్యము శ్రవణ మాధ్యమ దృష్టి నిలిపి
పాఠశాలను నిర్మించె ప్రగతినెంచి 45

తే.గీ. ధనము గలిగిన వారెల్ల తరలి వచ్చి
సీటు నిమ్మని కోరగ చేర దలచి
ద్రవ్యమెంతైన యిచ్చెడు దారి లోన
వరుస గట్టిరి పిల్లల భవితనెంచి 46

వ. వారికి ధర్మదత్తుడు విద్య, వైద్యము, జలము ఖరీదు గట్టజాలము. వేంగి ప్రజలకవసరములకు బోను మిగిలిన వనరులననుభవింపుమని సెలవిచ్చెను. 47

వేంగిన గొప్ప వైద్యశాలను నిర్మించుట

ఉ. సేవగ దల్చివైద్యమును చేయగ బూనెను పల్లెకంతకున్
భావిని బాధ్యతల్ గనుచు బంగరు బాటల వేయనిల్చితా
దేవుని యానగా దలచి దీనుల గాచుటె లక్ష్యమెంచితా
జీవన చక్రమందునను జిక్కిన పేదల మేలు దల్చుచున్ 48

ఆ.వె గొప్ప హాస్పిటలును కోరిన రీతిగా
పైస ఖర్చు లేని పసిడి గుడిగ
వేంగి పల్లె నందు వెలయించె ప్రీతిగా
వంద పడకలున్న వైద్య శాల 49

ఉ. దేశము నంతకున్ మిగుల దీటగు వైద్యము పల్లెయందు హృత్
పేశలమున్నవైద్యులను, ప్రేముడి చూపెడునట్టి నర్సులున్
ఆశయ సిద్ధికై నిలిపె నచ్చట దత్తుడు సర్వవేళలన్
దేశము నేలు నేతలును దిమ్మెర వోయిరి వేంగి గాంచుచున్ 50

వేంగి-హేలాపురి రహదారి నిర్మాణము గావించుట

ఆ.వె. బురద, గోతులందు పోవంగ నరకమౌ
రోడ్డు నందు నడక రోత గలిగి
వెతల నుండు పల్లె వేచెను బాగుకై
యేండ్లు పూండ్లు గడిచె నేమి ఫలము? 51

ఉ. కాంచెను ధర్మదత్తుడది కష్టము దోచెను పల్లెబాధలున్
మంచిగ ముఖ్యమంత్రికిని మాన్యులకెల్లను లేఖ వ్రాసెతా
కొంచెము సాయమీయగను కోరగ వారిని గౌరవమ్ముగా
అంచెల వారిగా ధనము నచ్చట చేరెను రోడ్డుబాగుకై 52

ఆ.వె. తారు రోడ్డు నేసి దారిని మంచిగా
తీర్చి దిద్ద గాను దివ్య రీతి
ముఖ్య మంత్రి వచ్చి ముదమందె తృప్తిగా
ధనము లెక్క చెప్పె ధర్మ దత్తు 53

ముఖ్యమంత్రిచే వేంగి–హేలాపురి రహదారి ప్రారంభోత్సవము

వ. వేంగి–హేలాపురి రహదారి ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి 54

తే.గీ. వంద కోట్లకు పడగెత్తు వాడు గాని
కూడు లేకను మరణించు కూలి గాని
మట్టి గలియుట తథ్యంబు మహిని తుదకు
మరచు లోకంబు నిరువురి మరుదినంబె 55

తే.గీ. మంది మేలును గాంచెడి మనిషి ధరణి
దైవ సమునిగ తలచుట తథ్య మనఘ!
తలుచు ప్రజలెల్ల వానిని తరములెన్నొ
ధర్మ దత్తుండు దానికి తారకాణ. 56

ముఖ్యమంత్రిచే ధర్మదత్తుని ఘనతను దెల్పుచు గవర్నరు మరియూ రాష్ట్రపతులకు లేఖ బంపుట

తే.గీ. ముఖ్యమంత్రియు తలపోసె నుర్వియందు
ధర్మ దత్తుని పోలెడు దాతవరుల
రాష్ట్రపతి గారి దృష్టికి రాగఫణితి
తీసికొని వచ్చి వారికి దృష్టి మీర 57

కం. గౌరవము తోడ భారత
పౌరులెదుట తగిన రీతి వర సన్మానం
బేరుపరచి చేయగవలె
దారా చిత్తమ్ము మెచ్చ తనయులు మెచ్చున్. 58

కం. వెను వెనుకనె సహచరులన్
ననువుగ బిలిపించి తనదు నాలోచనలన్
వినిపించి ధర్మదత్తుని
గుణముల వినుతించె వారు కోవిదులగుటన్ 59

తే.గీ. తగిన యట్టుల పథకమ్ము లొగి రచించి
ధర్మదత్తుని పేరును దాననిరతి
భద్ర గుణమున చేసిన పనుల తీరు
వరుస వరుసగ రాష్ట్రపతికి తెలిపి 60

కం. మాన్యున్ సన్మానింపుడు
మాన్యగ భావించి మీరు మానితబుద్ధిన్
మాన్యా! యంచున్ లేఖను
మాన్యుండౌ రాష్ట్రపతికి మనసిడి పంపన్ 61

వ. కొద్ది మాసములు ప్రశాంతముగ గడచిపోయెను. మరుసటిరోజు
శివరాత్రి పర్వదినము కాగా ముందురోజు తెల్లవారు ఝామున
ధర్మ దత్తున కొక స్వప్నము రాగా ఆ వృత్తాంతంబును ఉదయము
కులగురువైన ఖండోబా కెరింగింప దలచెను. 62

ధర్మదత్తుని చరమఘట్టమున స్వప్నము, దానిని కులగురువు ఖండోబా వివరించుట

సీ. శంకర తేజమ్ము, శంఖారవంబును
కలలోన నిప్పుడు గంటి, వింటి
ఘన శివలింగమ్ము కనుపించె నంతట
వేవేల జ్యోతుల వెలుగులందు

హంసలు గుంపులై ఆకాశ మార్గాన
ఎగిరెడి దృశ్యంబు నెఱిగితేను
గరుడ వాహనమెక్కి గగన వీథిననేను
తేలిపోవుట గంటి దివ్య లీల.

ఆ.వె. దీని భావ మేమొ తెలియంగ వలయును
చెప్ప వలెను గురువు తప్పకుండ
తలచి నంత వేగ తాబట్టి చరవాణి
కలను గనిన దంత కథగ జెప్పి 63

తే.గీ. తెలియ జెప్పంగ గోరుచు తేట పరచి
వినిన ఖండోబ చెందుచు విస్మయంబు
ధర్మ దత్తుని మరణ నిదర్శనమ్ము
నిద్ది చెప్పంగ వలయును సుహృత్ విధాన 64

వ. అని ఖండోబా పరి పరి విధముల తలంచి యిట్లు చెప్పెను 65

సీ. నీ గత జన్మంబు నిరుపయోగంబయ్యె!
అతి చిన్న వయసున ఆయువుడిగె!
మరణించు సమయాన మాధవుం డగుపించి
తరువాయి జన్మంబు తథ్యమనగ
మంది కుపకరించు మానవ జన్మను
ఎత్తంగ గోరంగ ఎనలేని ప్రేముడి
నినుగాచి తలయూచె నింగి వేల్పు
గోవింద కర్వాడే గోత్రోధ్భవుండవై
యీరీతి నీపుట్టు వృద్ధి చెందె

తే.గీ. జన్మ సార్థక మాయెను జన్మ ముగిసె
తరలి వెళ్ళంగ వలసిన తరుణ మిదియె
చివరి రోజిది నీకని చెప్ప వలయు
జన్మ లేదిక నీకును జాతకమున 66

ధర్మదత్తుని ప్రాయోపవేశము, ఆలయమున కపాల మోక్షము

వ . అని ఖండోబా నిక్కమెరింగించ, కొడుకులు కోడళ్ళను అత్యవసరముగా
పిలిపించ వలసినదిగా భార్యను కోరి, అభ్యంజన స్నానమాచరించి పరి
శుద్ధుడై శివుని ఎదుట ప్రాయోపవేశ విధమ్మున శివాలయము జేరి 67

చ. శంకర దీక్షలో నిలిచె సత్వర మోక్షము గోరి మౌనియై
అంకిత మౌన దీక్షగొని యచ్చట జేరగ భర్తనీడగా
అంకిత భావమున్ సుతులు నాలుల గూడిరి శైవపూజలో
శంకర శాంకరీ భజన సాగుచు నుండగ యర్ధరాత్రమున్ 68

వ. లింగోద్భవ సమయమునకు ముందు ఘంటారావములు,
శంఖధ్వానములు మిన్ను ముట్టునట్లు సాగుచుండగా
నిట్లు ప్రార్థించెను. 69

ఉ. శంకర! జన్మకారణము సంపద మత్తున వీడి యుండగా
పంకము నంటనీయకను పాపపు దారిని మూసివేయగా
వంకర బుద్ధులన్ విడిచి బాటల బట్టితి నాజ్ఞమీరకీ
లెంకను తప్పులెన్నకుడు! లీనము జేయుము నాత్మనిచ్చటన్. 70



తే.గీ. ధర్మ దత్తుండు సాష్టాంగ దండము నిడి
దివ్య పద్మా సనంబున దీక్ష బూని
ఆది దేవుని దర్శించె నాత్మ నందె
జరుగగ కపాల మోక్షంబు జగతి వీడె! 71

తే.గీ. జనులు తండోప తండమై జనిరి వేంగి
పుణ్య శీలిగ కీర్తించె పుడమి నందు
వాని దహనంబు జేయంగ వలెను గనుక
పల్లె పల్లెలు కదలెను పరమ భక్తి 72

ధర్మదత్తుని భౌతిక కాయమునకు దహన సంస్కారములు గావించు సమయమున రాష్ట్రపతి అవార్డు విషయము నెరిగించుట

వ. దహన కార్యక్రమ ము జరుపుటకు ధర్మదత్తుని భౌతిక కాయమును
ఊరేగింపుగా ఊరి శివార్లలోకి తీసుకొని
వచ్చుచుండగా..ఎదురుగా 73

ఉ. బారులు దీర్చికొందరట బాటకు నడ్డుగ నిల్చి కార్లతో
దారిని జూప గోరగను ధర్మని యింటికి సత్వరంబునన్
ఘోరము జెప్పివారికిని గొల్లున నేడ్చిరి పెద్దలందరున్
చేరిరి ఎందరో జనులు చెప్పుచు నాతని కీర్తిచంద్రికల్ 74

వ. తాము భారత రాష్ట్రపతి తరపున గవర్నర్ కార్యాలయము నుండి
వచ్చితిమని వచించి కార్లను పక్కన బెట్టి 75

ఆ.వె. భరత ఖండ మందు భావిజను లకతడు
దారి జూపినట్టి ధర్మమూర్తి
రాజ ధాని కతని రావించి మంత్రులు
గొప్ప బిరుదు నీయ గోరినారు 76

ఆ.వె. ఇప్పు డిట్టులయ్యె ! ఎంతయో గష్టంబు!
భార్య నంపు డనుచు బాధ పడుచు
సుతుల చెంత నిలిచి సోదర భావాన
కాగితముల నిచ్చి సాగిరంత 77

ధర్మదత్తుని శిలావిగ్రహము నిర్మించుట – జన ఘన నివాళి

ఉ.మా. ఊరి శివార్ల యందులలి నుంచిరి స్మారక చిహ్నామున్ జనుల్
మేరలు దాటుచున్ మిగుల మించెడు భక్తిని వచ్చి చూచుచున్
వీరలె ధర్మదత్తుడొక ప్రేముడి దైవమటంచు మ్రొక్కుచున్
నీరజనాభుడౌ హరి ననేక విధాల నుతించుచున్
హారతు లిచ్చినారు. పరమాత్ముని లీలల నెన్నశక్యమే!. 78

వ. అనుచు మార్కండేయ మహర్షి ధర్మదత్తుని గాధను సాంగో
పాంగముగా వివరించి ఈవిధముగా ఫలశ్రుతి నొసంగెను. 79

ఫలశ్రుతి

తే.గీ. ధర్మదత్తుని గాధను ధరణి యందు
వినిన వారలు, వినిపించు విశ్వ జనులు
కలియుగమ్మున కడగండ్ల కమలరనుచు
తరలి వెళ్ళెను యామౌని తపము జేయ. 80

ఆశ్వాసాంత పద్యములు

అనుష్టుప్

టేకుమళ్ళ సుధాజాత: వేంకటప్పయ్య సద్బుధ:
వ్యలిఖత్ భద్ర సద్భావై: ప్రబంధం సరసాత్మకమ్ 81

అనుష్టుప్

అద్య భారత రాష్ట్రానాం సమాజోద్యమ సంగతీమ్
ప్రజా బాహుళ్య సిద్ధాంతాన్వర్ణితం పఠ పాఠక! 82

మంగళం మహాశ్రీ:

మంగళము స్వర్పతికి, మంగళము సూర్యునకు, మంగళము రేమగనికిన్న
న్మంగళము నీటికిని, మంగళము వహ్నికిని, మంగళము వాయువు నకున్న
న్మంగళము నింగికిని, మంగళము ధాత్రికిని, మంగళము వేల్పుతతికిన్న
న్మంగళము ప్రాకృతిక మంజుల మనోజ్ఞతకు, మంగళము జీవతతికెల్లన్.

83

(అప్పకవీయము పుట 209 - భ,జ,స,న, భ,జ,స,న,గ గ యతి 1-9-17, ప్రాస యున్నది)

ఆశ్వాసాంత గద్యము: ఇది శ్రీవాధూలస గోత్ర పవిత్ర టేకుమళ్ళ హనుమాయమ్మా సుబ్రహ్మణ్యాఖ్య చతుర్థపుత్ర, సహృదయ, కవిమిత్ర, శ్రీపరమాత్మ గురుకటాక్షవీక్షణాలబ్ధ సారస్వతమర్మ వేంకటప్పయ్యశర్మ ప్రణీతంబైన ధర్మదత్తోదయంబను ప్రబంధంబున పంచమాశ్వాసంబు సమాప్తము. ప్రబంధము పరిసమాప్తము.

❀ ❀ ❀